ప్రజాపక్ష

సమీక్ష

ప్రథమ సంచిక : జనవరి 1, 2003 | సమతా పబ్లికేషన్స్ ప్రచురణ | వెల రు. 5-00

గౌరవ సంపాదకులు :
ఎబికె ప్రసాద్
సంపాదకులు :
వి. హనుమంతరావు
సలహా మండలి :
ప్రొ. ఆర్.వి.ఆర్. చంద్రశేఖర రావు
ప్రొ. వకుళాభరణం రామకృష్ణ
ప్రొ. పి. నారాయణ రెడ్డి
డి. పాపారావు
బి. సాంబశివరాజు
ఎన్. వేణుగోపాల్

లోపలి పేజీల్లో.....

వార్షిక చందా రూ॥ 120/-లు

Edited, printed and published by
V. Hanumantha Rao
for Samata Publications
D.No. 8-3-898/22, Road No.3,
Nagarjuna Nagar,
Hyderabad - 500 073.
Phone : 23748672

DTP at : Sri Sai Shamili Graphics
Golnaka, Hyd. Ph. 2756 9274

Printed at : Charita Graphics
Chikkadpally, Hyderabad - 020.

మీదే ఈ సమీక్ష!

సమాచార సాంకేతిక విప్లవం ప్రపంచాన్ని ముంచెత్తుతోంది. పుంఖానుపుంఖాలుగా వార్తలు, వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ దేశాలకు దేశాలనే కమ్ముకొని వస్తున్నాయి. ఈ పరిణామాలకు అనుకూల, వ్యతిరేక వ్యాఖ్యానాలు వింటున్నాం. పాలకులే ఈ పరిణామాలకు పల్లకి మోస్తుంటే, ప్రచారం చేస్తుంటే దిన పత్రికల్లో ఆ ప్రచారానికి సింహభాగం స్థలం కేటాయింపు జరుగుతోంది. ఆ పరిణామాలను ప్రశ్నించే వ్యాఖ్యానాలకు, విశ్లేషణలకు ప్రాముఖ్యత లభించడంలేదు. వాటికి సముచిత స్థానాన్ని ఇవ్వడానికి జరుగుతున్న ప్రయత్నంలో భాగమే 'ప్రజాపక్ష సమీక్ష' పక్షపత్రిక అవతరణ.

ఈ పత్రిక వెనుక డబ్బుమూటలులేవు. నయాపైసా పెట్టుబడి పెట్టలేదు కాబట్టి ప్రతిఫలాన్ని కోరుకోవడం లేదు. ప్రత్యామ్నాయ విధానాలు, ఆచరణే దేశానికి, ప్రజలకు విముక్తి కలిగిస్తాయనే విశ్వాసమే, మా మేధస్సే మా పెట్టుబడి. చందాదారులే మా పోషకులు. ఆ విధంగా ఒక ప్రత్యేక ఒరవడి ఈ పత్రికది. మార్కెట్‌లో వార, పక్ష, మాస పత్రికలు చాలానే వున్నాయి గాని ఇలాంటి పత్రికలు చెదురుమదురుగానే కనిపిస్తుంటాయి. ఆర్థికం, అభివృద్ధి గురించి విస్తృతంగా చర్చించే అతికొద్ది పత్రికల కోవలో చేరుతుంది 'సమీక్ష'.

ఈ పత్రికను ప్రారంభించడమే మావంతు. దాన్ని పెంచి, పోషించాల్సింది పాఠకులే. మీ రచనలు, ఆర్థిక సహాయమే మా ఊపిరి.

భారతదేశం ధనవంతమైంది కాని భారతీయులు నిరుపేదలు. ఇలా ఎందుకుండాలి? రాజకీయ స్వాతంత్ర్యం వచ్చింది కాని వాళ్ళకేం దక్కింది? ఎవరికీ అభివృద్ధి ఫలితాలు అందుతున్నాయి? సామాన్యులు సామాన్యులుగానే మిగిలిపోయారు-వారలా ఎందుకు మిగిలిపోవాలనేదే మా ప్రశ్న. ఈ ప్రశ్ననే లక్షలాది ప్రజలు వేస్తున్నారు. పాలకులను నిలదీస్తున్నారు. ఉద్యమిస్తున్నారు. వారి ప్రయత్నాలలో వ్యాఖ్యానాలతో కూడిన సమాచారం ఎంతో తోడ్పడుతుంది. దానిని వారికి అందజేయడమే ఈ పత్రిక లక్ష్యం. మేము దీపం వెలిగించాం. అది వెలుగును నిరంతరంగా ప్రసరించేలా చూడడం మీ చేతుల్లో వుంది. సంవత్సర చందా సామాన్యులకు అందుబాటులో వుంచాం. మేం కోరేది ఒక్కటే. చందాదారులుగా చేరండి. మీ సహాయ, సహకారాలను అందించండి.

- సమతా పబ్లికేషన్స్

రెండు రెళ్ళు నాలుగు...

రాష్ట్రంలో బ్యాంకుల మొండి బాకీలు

కంపెనీ	చెల్లించాల్సిన మొత్తం (రూ॥ కోట్లలో)
పెన్నార్ గ్రూప్	186
సంఘీ గ్రూప్	183
సోల్ ఫార్మా	173
సిరీస్ గ్రూప్	107
కిట్టి స్టీల్స్	68
సువర్ణ ఆక్వాఫార్మ్	59
సుచిత్రా టెలీ ట్యూబ్స్	48
గోల్డ్‌స్టార్ సిమెంట్స్	45
గలడా పవర్ కంపెనీ	43
దక్కన్ గ్రానైట్స్	42
హిందూస్తాన్ మాగ్నెటిక్స్	40
ర్యాంక్ ఇండస్ట్రీస్	40
నవభారత్ ఎంటర్‌ప్రైజెస్	30
సిడిఆర్ హాస్పిటల్స్	28
జెమ్ కేబుల్స్	25
ఆంధ్రా సిమెంట్స్	25
శ్రీ కృష్ణా ఆయిల్ కాంప్లెక్స్	22
జి.పి. ఇండస్ట్రీస్	20
నాగార్జున పేపర్ మిల్స్	18
నాగార్జున కోటెడ్ ట్యూబ్స్	17
గోదావరి సిరామిక్స్	14
ఈస్టర్న్ గ్రానైట్స్	12
చక్రా సిమెంట్స్	12

దేశవ్యాపితంగా వివిధ బ్యాంకుల మొండి బాకీలు

(31 మార్చి 2002 నాటికి) (కోట్ల రూ.)

	మొత్తం	ప్రాధాన్యేతర రంగం
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	15486	8037
బ్యాంక్ ఆఫ్ బరోడా	4489	2622
పంజాబ్ నేషనల్ బ్యాంక్	4140	2352
బ్యాంక్ ఆఫ్ ఇండియా	3376	1642
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	2420	1223
ఇండియన్ బ్యాంక్	2175	1372
కెనరా బ్యాంక్	2112	1006
అలహాబాద్ బ్యాంక్	2002	1174
దేనా బ్యాంక్	1996	1222
ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్	1819	1020
యుకో బ్యాంక్	1333	689
సిండికేట్ బ్యాంక్	1300	556
యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	1216	517
పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్	1092	714
ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్	952	510
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర	906	353
స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్	899	402
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ట్రావెంకూర్	728	333
స్టేట్ బ్యాంక్ ఆఫ్ పాటియాల	628	320
స్టేట్ బ్యాంక్ ఆఫ్ మైసూర్	625	323
స్టేట్ బ్యాంక్ ఆఫ్ బికనేర్ అండ్ జైపూర్	616	370
విజయా బ్యాంక్	603	290
కార్పొరేషన్ బ్యాంక్	587	348
ఆంధ్రా బ్యాంక్	524	218
స్టేట్ బ్యాంక్ ఆఫ్ సౌరాష్ట్ర	443	179
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండోర్	320	141

(ఆధారం : లోక్‌సభలో అందజేసిన సమాచారం)

సమీక్షా సమీక్ష

నమూనా సంచిక చదివాను. 'సమీక్ష' లో కనీసం ఒక పేజీ సాహిత్య సమీక్షకు కేటాయించండి. సాహిత్య అధ్యయనానికి ఉపకరించే పద్ధతిలో విమర్శనాత్మక వ్యాసాలు వేయండి.

-నిఖిలేశ్వర్, హైదరాబాద్

ఎన్నాళ్ళుగానో ఆంధ్ర ఆర్థిక-రాజకీయ పరిస్థితులను విశ్లేషించే ఒక పత్రిక వుండాలనిపిస్తుండేది. బహుశా ఆ కోరిక తెలుగు పాఠకులకు తీరేటట్లుంది. సంపాదకుల్లో ఆర్థిక - రాజకీయ విషయాలను ప్రజాపక్షం వహించి విశ్లేషించేవారుండడం, ఈ పత్రిక విశేషఆదరణ పొందుతుందని నా విశ్వాసాన్ని బలపరుస్తుంది. గణాంకాలు అవసరమా? ప్రత్యేకంగా సమీకరించిన గణాంకాలు ఫాక్ట్‌షీట్‌గా సందర్భానుసారంగా ఇవ్వవచ్చు. కథలు, గల్పికలు వదిలేస్తే మంచిది. అయితే మంచి కథలు వేయవచ్చునేమో కత్తిరింపులు వుండాలి. తెలుగునాడుకు 'ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ' లా 'సమీక్ష' రూపుదిద్దుకోవాలని కోరుతూ...

-శ్రీనివాస్, రిసెర్చిఫెలో, జె.ఎన్.యు, న్యూ ఢిల్లీ

బూర్జువా వర్గం తన వ్యవస్థను కాపాడుకొనేందుకు అవసరమైన మేధావులను సృష్టించుకుంటుంది. వారిని పోషించుకొంటుంది. అదే వ్యవస్థ తన గోరీని కట్టే కార్మికులను వారిలో సంచలనం కలిగించగలిగిన మేధావులనూ సృష్టిస్తుంది. కాని ఈ మేధావులు తమ మాటలు వినవలసిన వారిని తామే వెతుక్కోవాల్సిన పరిస్థితి. ఇది అన్ని రకాల దుర్భరపరిస్థితే. బూర్జువా వర్గపు సైద్ధాంతిక భావాలను ఎదిరించటం, వాటిలో వుండే నర్మగర్భతను ఎండగట్టాల్సిందే. (ప్రజల పక్షాన 'సమీక్ష' ఉద్దేశం ఇదేనని నేననుకొంటున్నా).

-వి. శ్రీహరి, హైదరాబాద్

2002 - ఓ విహంగ వీక్షణం

- వి. హనుమంతరావు

చరిత్ర పుటల్లోకి వెళ్ళిపోతున్న 2002 ఒక సంచలనాత్మక సంవత్సరం. 'చంద్ర' కాంతి మసక బారుతోంది. కృష్ణా-గోదావరిలో కనుగొన్న గాస్ నిల్వలు రాష్ట్ర భవిష్యత్తునే ఒక మూల మలుపు తిప్పవచ్చు. నక్సల్స్ సమస్య పరిష్కారం చేతికందినట్లే అంది మళ్లా చేయిజారిపోయింది. రాష్ట్రం మరింత రుణభారంలో కూరుక పోయింది. కనీవినీ ఎరుగని కరవు రాష్ట్రాన్ని కాజేసింది. ఆత్మహత్యల రాష్ట్రాల్లో నెంబర్‌వన్‌గా పేరుతెచ్చుకొంది.

ఇది రాస్తున్న సమయానికి రోమ్‌నగరం తగలబడిపోతుంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయించినట్లు, రాష్ట్రం తిండికి, సాగునీటికి, తాగు నీటికి విలవిలలాడిపోతుంటే, రు. 250 కోట్లు ఖర్చుపెట్టి, చంద్రబాబు క్రీడల సంబరాలు జరుపుతున్నారు. కరవు బాధితులకు సహాయం గురించి శాసనసభలో చర్చకు వస్తే, 1) దాన్ని రాజకీయం చేస్తున్నారని విమర్శించి, 2) కేంద్రంపై సహాయం చేయటం లేదనే నిందారోపణ చేసి, 3) రాష్ట్ర ప్రభుత్వం కరవు నివారణకు చేసిందని చెబుతున్న కేటాయింపులో కేంద్రం ఇస్తానన్న సహాయాన్ని కూడా కలిపి -ఇలా ఎన్నిరకాలుగా బాధ్యతనుంచి తప్పించుకోవాలో అన్ని రకాలుగా ప్రయత్నించారు. దుర్భిక్ష పరిస్థితులు రాష్ట్రానికి కొత్తేమీ కాదు. ప్రతిసారి శాశ్వత పరిష్కారం గురించి మాట్లాడడమే గాని ప్రయత్నం ప్రారంభించిన దాఖలాలు లేవు. నదీ జలాలకు ముక్కుతాళ్లు బిగించి, వృధాగా సముద్రంలోకి పోతున్న నీటిని పంట పొలాలకు మళ్ళించే శాశ్వత పరిష్కారాన్ని వదలిపెట్టి, నీరు-మీరు, ఇంకుడు గుంటలు, వాటర్ షెడ్లతో ప్రచారాస్త్రాన్ని సంధించి పబ్బం గడుపుకొంటున్నారు. వర్షాభావ పరిస్థితులవల్ల నీటి ఎద్దడి ఏర్పడి పట్టణాల్లో తాగునీటికి, గ్రామాల్లో వ్యవసాయానికి, దేనికి ప్రాధాన్యత ఇవ్వాలి అనే విషయంపై వివాదం చెలరేగి శాంతి భద్రతల సమస్యగా పరిణమిస్తున్నాయి. ఏవో కంటితుడుపులు తప్ప నీటి వినియోగం ప్రాధాన్యతల గురించి ప్రభుత్వం ఒక విధానాన్ని రూపొందించినట్లు తోచదు.

కరవులో అధికమాసం అన్నట్లు రాష్ట్ర ఆర్థిక, ద్రవ్య పరిస్థితులు దిగజారిపోతుంటే, కరువుతో ఆదాయం తగ్గి, రాష్ట్రం మరింతగా గిలగిలా కొట్టుకొంటూంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆదాయ వనరులను ఎలా పెంచాలా అనే పరిష్కారంపై కేంద్రీకరించకుండా సంక్షేమ పథకాలకు, పెట్టుబడి ఖర్చుకు చేసిన కేటాయింపుల కోతకు ప్రభుత్వం పాడిగట్టింది.

కొత్తగా మరింత రుణంకోసం ప్రపంచబ్యాంకు ముందు చేయి చాచటానికి బయలుదేరింది. పేదరిక నిర్మూలనకు, వ్యవస్థాగత సర్దుబాట్లకు బ్యాంకుతో సంప్రదించి రుణం తెచ్చుకోవడానికి ప్రయత్నించగా కేంద్రం పూచీకత్తు ఇవ్వడానికి నిరాకరించింది. ఇలా ఇంకా ఇంకా రుణాలు చేస్తూపోతే, వడ్డీలు చెల్లించలేక, బడ్జెట్లు తలకిందులవుతాయని కేంద్రం హెచ్చరించింది. రెవెన్యూ పద్దుకింద లోటు తగ్గుతున్నట్లు బడ్జెట్ గణాంకాలు చూపిస్తున్నాయి. కాని వాస్తవమేమంటే తగ్గడానికి కారణం ఆర్థిక పరిస్థితిని చక్కగా నిర్వహించడం వల్ల కాదని, చేసిన కేటాయింపులు ఖర్చు చేయకపోవటం వల్లనే అని కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదికలు నిరూపిస్తున్నాయి. ఎకౌంటింగ్‌లో కూడా గోల్‌మాల్ చేస్తుంది ప్రభుత్వం. రెవెన్యూ పద్దు కింద చూపించాల్సిన ఖర్చును పెట్టుబడి పద్దు కింద చూపించి, రెవెన్యూ పద్దు కింద లోటు తగ్గినట్లు చూపించింది. ట్రాన్స్‌కోకు ఇచ్చిన మొత్తాన్ని ప్రణాళిక పద్దులో పెట్టుబడిగా చూపించింది.

అభివృద్ధి ఖర్చు మొత్తం ఖర్చులో గత సంవత్సరంలో 61 నుంచి ఈ సంవత్సరంలో 59 శాతానికి పడిపోయిందని, అభివృద్ధేతర ఖర్చు 39 నుంచి 41 శాతానికి పెరుగుతుందని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. వ్యవసాయం పెట్టుబడులు లేక గుంటపూలు పూస్తూంది. పారిశ్రామికాభివృద్ధిని ఆచరణలో వెనక బెంచీలో కూర్చోబెట్టారు. 30 శాతం చిన్న పరిశ్రమలు ఖాయిలా పడ్డాయి. విద్యుచ్ఛక్తి షరా మామూలే. ఈ మూడు విషయాల్లో నిశ్చితంగా ఏం సాధించారో ప్రభుత్వాన్ని చెప్పమనండి. నిరుద్యోగం గురించి వేరే చెప్పాల్సిన పనిలేదు. పేదరికం గ్రామాల్లో 11 శాతానికి తగ్గింది కాగితం మీదనే. అలా తగ్గిందని లకడావాలా కమిటీ అంటే చంద్రబాబుకు కోపం వచ్చింది. పేదరికం పెరిగిందని ఎవరైనా అంటే ముఖ్యమంత్రికి మహాకోపం వస్తుంది. పేదరికం గురించి సర్వే చేసి తెచ్చిన సమాచారాన్ని విశ్లేషించటంలో మతలబులు చేసి పేదరికం తగ్గిపోయిందంటున్నారు. పేదలకు పనికి ఆహారం పథకం కింద సరఫరా చేసిన బియ్యాన్ని "ఎలకలు, పందులు" తినేస్తే పేదరికం ఎలా తగ్గుతుంది?

ఆత్మహత్యలు, ఎన్‌కౌంటర్ చావులు, లాకప్ మరణాలు, వరకట్నం చావులు, అక్కడక్కడ ఆకలితో మరణాలు - ఇది చావుల ఆంధ్రప్రదేశా అని అనిపిస్తుంది. నక్సలైట్లతో చర్చించే బంగారంలాంటి ఛాన్సును పోలీసుల ఒత్తిడితో రాష్ట్ర ప్రభుత్వం పోగొట్టుకుంది. ఆ విధంగా తెలంగాణ జిల్లాలో ప్రజా ప్రతినిధులు వారి వారి నియోజక వర్గాల్లో నిర్భయంగా తిరిగే అవకాశాన్ని నిరాకరించినట్లయింది.

ఇదివరకు నక్సలైట్లకే పరిమితమైన ఎన్‌కౌంటర్లు, ఇపుడు ఇతర రకాల నేరస్తులకు కూడా విస్తరించారు. తెలంగాణా జిల్లలకే ప్రధానంగా పరిమితమైన నక్సలైట్ కార్యక్రమాలు కోస్తా రాయలసీమ జిల్లాలకు కూడా విస్తరించడానికి ప్రభుత్వ విధానం తోడ్పడింది. సంప్రదింపులకు సంసిద్ధమైన నక్సలైట్లతో, సంప్రదింపులు ప్రారంభించినట్లే ప్రారంభించి, ప్రభుత్వం సరిగానే స్పందించిందనే భావన కలిగించి, హఠాత్తుగా సంప్రదింపులనుంచి వెనుతిరగటం ప్రభుత్వం చేసిన పెద్ద రాజకీయ పొరపాటు. నేరచరితులు చట్ట సభల్లో ప్రవేశించడానికి పార్టీల నాయకులే పచ్చజెండా వూపుతుంటే, కంచే చేను మేస్తే శాంతి భద్రతలకు అర్థం లేకుండా పోయింది. ఈ ప్రభుత్వ ధోరణిని గమనించిన శాసనసభ్యులు, వారి బంధువులు ఉద్యోగుల మీద అహంకారంతో చేయి చేసుకొనే వరకూ వచ్చింది. దళితుల మీద భూస్వామ్య వర్గాల దాడులు సర్వ సామాన్యం. ఇవి చాలా అరుదుగా పత్రికల కెక్కుతాయి. ఆఖరుకు హింస తెలుగుదేశం పార్టీలోకే చొరబడింది.

రోజుకో కొత్త నినాదం ఇవ్వటం ముఖ్యమంత్రికి అలవాటు. ఈ సంవత్సరం అంతా గుడ్‌గవర్నెన్స్, ఇ-గవర్నెన్స్ నినాదాలతో హోరెత్తి పోయింది. ఇదే సమయంలో అధికారుల్లో లంచగొండుల పట్టివేత వార్తలు తరచుగా వస్తున్నాయి. పరిపాలనా వ్యవస్థ ఎంత భేషుగ్గా పనిచేస్తుందో ఇటీవల జరిగిన కలెక్టర్ల సభల్లో స్వయాన ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలే అద్దం పడుతాయి. లంచగొండితనం, అసమర్థత పునాదులుగా వున్న పరిపాలనా వ్యవస్థతో సుపరిపాలనను సాధించ గలుగుతామనుకోవడం ఎండమావి వంటిది. ఇ-గవర్నెన్స్‌లో ముఖ్యమైనది కంప్యూటర్ కావచ్చు. కాని దానిలోకి సమాచారాన్ని ఫీడ్ చేసేది ఉద్యోగే. ఆ ఉద్యోగి ఎలాంటి వ్యక్తో మనందరికి తెలుసు.

ఆటో డ్రైవర్‌నుంచి అధికారులవరకూ అందరూ, ఉద్యమ బాటలో అడుగుపెట్టడం ఈ సంవత్సరం ప్రత్యేకత, ఇటీవలి కాలంలో నీటి సమస్యపై రైతు ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ప్రదర్శనలు, ఆందోళనలు, రాస్తారోకోలు, ధర్నాలు, మంత్రుల, అధికారుల ఘెరావ్ గృహనిర్బంధాలు సుమారుగా నిత్యకృత్యాలైపోయాయి. మొన్న మొన్ననే విశాఖ జిల్లాలో పోలీసు కాల్పుల వరకూ వెళ్ళింది. ఈ వ్యాసం రాస్తుండగా, ఆంధ్ర విశ్వవిద్యాలయ విద్యార్థుల ఉద్యమం కొనసాగు తూనే వుంది. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు రిజర్వేషన్లకోసం ఉద్యమించారు. నల్లబెల్లం మీద రైతుల ఉద్యమం మరో ఉదాహరణ. నకిలీ విత్తనాలు, పురుగుమందు అమ్మకం, ఆందోళనకు దారితీసాయి. తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా ఘోరవైఫల్యం రైతుల ఆగ్రహానికి గురైంది. సహకార బ్యాంకుల దివాళా మధ్య తరగతి గృహస్థులను వీథుల్లోకి నెట్టింది. మునిసిపల్, పంచాయతీ ఉద్యోగులు కూడా నిరసనలు తెలియజేశారు. ఎన్నికైన పంచాయతీ సర్పంచులు కూడా వారి అధికారాల్ని కుదించినందుకు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇటు విద్యార్థులు, అటు ఉపాధ్యాయులు ప్రదర్శనలకు పాల్పడ్డారు. నిరుద్యోగుల ఆక్రందనలు సంవత్సరం పొడవునా వినిపిస్తూనే వున్నాయి. ప్రాంతీయ అసమానతలకు, నాలుగైదు దశాబ్దాలుగా జరిగిన అన్యాయాలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజల అసంతృప్తి రాజుకుంటోంది. రాయలసీమ నుంచి, ఉత్తరాంధ్ర నుంచి కూడా అసంతృప్తి వినబడుతోంది. నదీజలాల పంపిణీలో అసమానతలు ఉద్రిక్తతలకు దారితీసే మార్గంలో ఉన్నాయి. వామపక్షాల రాష్ట్ర వ్యాపిత ఆందోళనలు కేవలం వారి దైనందిన సమస్యలకే పరిమితం కాలేదు. పరిశ్రమలను మూసేయరాదని, ప్రయివేటీకరించవద్దని, ప్రపంచ బ్యాంకు ధృతరాష్ట్ర కౌగిలిలోంచి బయటపడాలని ఆందోళన చేయటం ఉన్నత రాజకీయ, ఆర్థిక లక్ష్యాలకోసం పోరాటాలు చేస్తున్నారనే దానికి సాక్ష్యం. మొత్తం రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తున్న ప్రభుత్వ ఆర్థిక విధానాల గురించి విస్తృత ప్రచారం సాగింది. ఇలాంటి విషయాల్లో సామాన్య శ్రమజీవి ఇదవరకు తల దూర్చేవాడు కాదు. కాని సంస్కరణలు ప్రారంభించినప్పటినుంచి ఈ విషయం కేంద్ర బిందువైంది. ప్రజలలో చైతన్యం పెరగటం హర్షణీయమైన పరిణామం. ఇది రాబోయే కాలంలో మరిన్ని ఆందోళనలకు, పోరాటాలకు నాందీ ప్రస్తావనగా భావించవచ్చు. నిజానికి 2001 సంవత్సరం ప్రారంభంలోనే యువత, విద్యార్థులు వీథుల్లోకి వచ్చి నిరసన జండాను చేపట్టారు. అప్పటినుంచి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకత మెల్లమెల్లగా రాజుకొంటూంది. ఈ సంవత్సరం ఆందోళనల్లో కొట్టొచ్చేటట్లు కనిపించేది ఉద్యమ వాతావరణం గ్రామాలకు, రైతాంగానికి విస్తరించడం. కరవు, నీరు, విద్యుచ్ఛక్తి, నల్లబెల్లం, ధరలు - ఇలా ఎన్నో సమస్యలు రైతాంగాన్ని పోరాట బాటలో పెట్టాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ ఛార్జీలు పెంచటం, పంటపోయి తిండికి కటకట, తిండి గింజలకు పెరగబోయే ధరలు లాంటి సమస్యలమీద రైతులను మరింత ఉధృతంగా పోరాటాల్లోకి దింపుతాయి. వామపక్షాలు అపుడే కత్తులు నూరుతున్నాయి. ఐక్యపోరాటాలు రైతులు తమ కోర్కెలను సాధించు కోవటానికి ఎంతగానైనా తోడ్పడతాయి.

మసక చీకట్లు :

పై విశ్లేషణ సమాజంలో అన్ని వర్గాలనుంచి అసంతృప్తి, వ్యతిరేకత చంద్రబాబును చుట్టుముట్టుతున్నాయని తెలియచేస్తుంది. తిండికి కరవు, మంచినీటికి కరవు, నిధులకు కరవు, రక్షణకు కరవు, నిజాయితీకి కరవు, చంద్రుడిచుట్టూ మసక చీకట్లు కమ్ముకొటూ వస్తున్నాయి. కలెక్టర్లు, ఐ.ఎ.ఎస్ అధికారులు సంతోషంగా ఏమీలేరు. కేంద్ర ప్రభుత్వం చంద్రబాబును లాలూచీ కుస్తీలో భాగంగా దూరం వుంచుతోంది. 29 సీట్ల తురుపుముక్క అక్కరకు రావటం లేదు. ప్రపంచబ్యాంకు షరతులు ఆయనను ఊబిలోకి నెడుతున్నాయి. జాతీయ పత్రికలు ఇదివరకటిలా చంద్రబాబును ఇంద్రుడు, చంద్రుడని పిలవడంలేదు. దవ్యరంగంలో ఆయన మెడచుట్టూ ఉచ్చుబిగుస్తోంది. అనేక సర్వేలు రాష్ట్రాన్ని ఎక్కడో కింది స్థానాల్లో వుంచుతున్నాయి. మంత్రులు, పార్టీ నాయకులు, కార్యకర్తల్లో అసంతృప్తి నివురుగప్పిన నిప్పులా వుంది. ఆ పార్టీలో ఆయనొక

(తరువాయి 24వ పేజీలో)

అన్ని రాష్ట్రాలూ అదే ఊబిలో....

- సి. సుబ్బారావు

గత ఆరేడు సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ ఆర్థిక ధోరణులను, ద్రవ్య పరిస్థితిని గమనిస్తున్నవారు, ముఖ్యంగా రుణభారం, వడ్డీ చెల్లింపుల భారం చూసి తీవ్రంగా ఆందోళన పడటం సహజం. కాని ఇతర రాష్ట్రాల, ముఖ్యంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాల ధోరణులను కూడా పరిశీలిస్తే, అందులో కొంతమంది మనకన్నా పెద్దన్నయ్యలు న్నారని విదితమవుతుంది. మొత్తం అన్ని రాష్ట్రాల ఆదాయ వ్యయాలను విశ్లేషిస్తే గుండె గుభేల్‌మంటుంది. అన్ని రాష్ట్రాల గణాంకాలను అధ్యయనం చేస్తున్న మన ఆర్థిక మంత్రి కొన్ని ఇతర రాష్ట్రాలతో పోల్చిచూసి మనమే నయం అని స్వయం సంతృప్తి పడాల్సిన పనిలేదు. ఆయా రాష్ట్రాల జనాభా, సహజ వనరులు, పారిశ్రామికీకరణ, వ్యాపారం లాంటి అనేక విషయాలు ఆ రాష్ట్రాల ఆదాయవ్యయాలను ప్రభావితం చేస్తాయి. ఎంత చెట్టుకు అంత గాలి. వనరులు పరిమితమైనా, ఆదాయాలు పెరుగుతున్నా, వాటిని సమర్థంగా నిర్వహించడం, అదనపు వనరుల సేకరణ, ఖర్చుపై అదుపు లాంటి విషయాలు ఆయా రాష్ట్రాల పురోగతిని నిర్దేశిస్తాయి.

నడుస్తున్న (2002-03) సంవత్సరం తాలూకు అన్ని రాష్ట్రాల బడ్జెట్లు పరిశీలిస్తే, అలాగే అంతకు ముందు సంవత్సరాల్లో ధోరణుల నేపథ్యంలో అధ్యయనం చేయగా రెవెన్యూ ఆదాయం మందకొడిగా పెరగటం, ఖర్చులు కళ్లాలు లేకుండా పరుగులు తీయటం, పెరుగుతున్న రుణభారం, వడ్డీ చెల్లింపులు అన్ని రాష్ట్రాలను కుదిపి వేస్తున్నాయి.

రిజర్వుబ్యాంకు విశ్లేషణ ప్రకారం (ఆర్.బి.ఐ. బులెటిన్ - అక్టోబర్ 2002) 2001-02 సంవత్సరంలో అన్ని రాష్ట్రాల స్థూల ద్రవ్యలోటు బడ్జెట్ అంచనా ప్రకారం రు. 95,053 కోట్లు వుండాల్సి వుండగా (స్థూల జాతీయాదాయంలో 3.8 శాతం) వాస్తవంలో రు. 1,06,595 (4.6శాతం)కు పెరిగింది. రెవెన్యూ పద్దుకింద ఆదాయం తగ్గడం, స్థూల జాతీయాదాయం మందకొడిగా పెరగటం ఇందుకు ప్రధాన కారణాలు.

ఆ సంవత్సరంలో రెవెన్యూ ఆదాయం రు. 2,70,901 కోట్లయితే మొత్తం ఖర్చు రు. 4,01,571 కోట్లు. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఆదాయం 13.8 శాతం పెరిగితే, అభివృద్ధేతర ఖర్చు 21 శాతం పెరిగింది. ఫలితంగా మొత్తం ఖర్చులో అభివృద్ధి శాతం 60.4 నుంచి 58.9కు తగ్గింది. 2001-02 సవరించిన అంచనాల్లో కూడా లోటును సూచించే సూచికలన్నీ బడ్జెట్ అంచనాలను మించిపోయాయి. ఉదాహరణకు రాష్ట్రాల రెవెన్యూ ఆదాయం కేంద్రం నుంచి వచ్చే పన్నుల వాటా, అలాగే రాష్ట్రాలు వసూలు చేసే పన్నులు తగ్గటం వల్ల రెవెన్యూ ఆదాయం బడ్జెట్ అంచనాలకన్నా 5.2 శాతం తగ్గింది. సంస్కరణలు ప్రవేశపెట్టక ముందు 1987 వరకూ రాష్ట్ర బడ్జెట్లు మిగులునే చూపించగా ఆ తర్వాత బడ్జెట్ల లోటు పర్వం ప్రారంభమైంది. ఇక 2002-03 బడ్జెట్ అంచనాలకొస్తే స్థూల ద్రవ్యలోటు ఈ సంవత్సరంలో తగ్గుతుందని అంచనా వేసినా, కరువు పరిస్థితుల వల్ల ఆదాయం తగ్గి, ఈ లోటు తీరుతుంది. అలాగే బడ్జెట్‌లో వేసిన ఇతర అంచనాలన్నీ తల కిందులై ఆర్థిక పరిస్థితి, ద్రవ్య పరిస్థితి ఇంకా క్షీణిస్తుందని నిస్సందేహంగా చెప్పుకోవచ్చు. ఇది జ్యోతిష్యం కాదు. వాస్తవ పరిస్థితుల ఆధారంగా వేసిన అంచనా.

రుణభారం :

మార్చి 2002 నాటికి రాష్ట్రాల రుణభారం అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే 18.3 శాతం మేరకు పెరిగి రు. 5,89,219 కోట్లకు చేరుకుంది. స్థూల జాతీయాదాయంలో ఇది 25.6 శాతం. వడ్డీ భారం 1993-94 / 2002-03 మధ్య కాలంలో కేవలం తొమ్మిదివేల కోట్లనుంచి రు. 54వేల కోట్లకు పెద్ద గంతు వేసింది. ఇందులో మార్కెట్ నుంచి తీసుకొన్న స్థూల రుణం (రాష్ట్రాలు మార్కెట్ నుంచి ఎంత రుణం తీసుకోవాలో కేంద్రం ప్రతి సంవత్సరం నిర్దేశిస్తుంది). 2001-02లో రు. 1870 కోట్లు, నడుస్తున్న సంవత్సరంలో రాష్ట్రాలకు రు. 15,411 కోట్లు కేటాయింపు జరగ్గా సెప్టెంబరు 2002 నాటికే రు. 10,617 కోట్లు సేకరించింది. ప్రభుత్వాధారిత సంస్థలకు ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలు 2000లో రు. 1,32,029 కోట్లు కాగా తర్వాతి సంవత్సరంలో 1,68,712 కోట్లు. గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు - ఈ అయిదు రాష్ట్రాలే మొత్తం గ్యారంటీల్లో సగం ఇచ్చాయి. గ్యారంటీ తీసుకొన్న ప్రభుత్వ సంస్థలు తిరిగి ఇవ్వకపోతే ప్రభుత్వం మీద ఈ సంవత్సరంలోనే రు. 5,400 కోట్లభారం పడుతుంది. నికర మార్కెట్ రుణాలు 1990-91/2002-03 (తాత్కాలిక) మధ్యకాలంలో అయిదు రెట్లు పెరిగాయి. 2000-01 లో కేంద్రం నుంచి స్థూల రుణం రు. 18,823 కోట్లు. 2002-03 బడ్జెట్ అంచనాల ప్రకారం కేంద్ర రుణం రు. 31,266 కోట్లయితే, తిరిగి చెల్లించిన రుణం రు. 12,718 కోట్లు, వడ్డీ చెల్లింపు రు. 31,030

కోట్లు. అసలు కన్నా వడ్డీ రుణం ఇచ్చినవారికి ఎందుకు అంత రుచిగా వుంటుందో గణాంకాలు తెలియజేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వమే రాష్ట్రాల అవసరాలతో ఇలా వడ్డీ వ్యాపారం చేస్తుంటే ప్రపంచబ్యాంకు చేయటంలో విశేషమేముంది? రిజర్వుబ్యాంకు నుంచి తీసుకున్న చేబదుళ్లు (వేస్ అండ్ మీన్స్) సంవత్సరం, సంవత్సరం పెరుగుతూనే వస్తున్నాయని రిజర్వుబ్యాంకు రిపోర్టు తెలియజేస్తుంది. ఇవి ప్రాణం లేని అంకెలని అనుకోకండి. ఇవి ప్రాణాలు తీసే అంకెలు.

పైన పేర్కొన్న రిజర్వుబ్యాంకు గణాంకాలను విశ్లేషించుకొంటే ఆర్థికంగా బలమైన, బలహీనమైన రాష్ట్రాలు కావచ్చు, లేదా గుడ్ గవర్నెన్స్ ఉండవచ్చు, లేకపోవచ్చు. కాని కేంద్రం, అన్ని రాష్ట్రాలు (ఏ పార్టీఐనా పరిపాలించనివ్వండి) అందరూ అదే చిల్లు బోటులో ప్రయాణం చేస్తున్నారు. అందరూ జీతాలివ్వడానికి ఇబ్బంది పడుతున్నారు. సాంఘిక సంక్షేమం, పెట్టుబడి పద్దులకింద కోత పడుతూంది. కేంద్రం కొన్ని అభివృద్ధి పథకాలను రాష్ట్రాలు మాచింగ్ గ్రాంటు ఇచ్చే షరతులపైన కేటాయింపు చేస్తుంది. కాని రాష్ట్రాలు తమవంతు కేటాయింపులు చేయలేకపోతున్నాయి. కేంద్రం జీతాల పెంపుదల గురించి నిర్ణయం చేసి డబ్బుల్లేకపోతే నోట్లు అచ్చు గుద్దించి నిధులు సమకూర్చుకొంటుంది. కాని రాష్ట్రాలకు ఆ వెసులుబాటు లేదు సరికదా మార్కెట్‌లో ఎంత రుణం చేయవచ్చో నిర్ణయించి రాష్ట్రాల నెత్తిన మేకు కొడుతుంది. ఆంక్షలు విధిస్తుంది. అలాగని ఆంక్షలు తొలగించాలని అనబోవడం లేదు. ఆంక్షలుండగానే రాష్ట్రాలు రుణాల ఊబిలో దిగబడిపోతున్నాయి. ఆంక్షలు తొలగిస్తే అప్పులు చేయడానికి రాష్ట్రాలకు ఆకాశమే హద్దు.

ఈ పరిస్థితిని అధిగమించడానికి ఏమి చెయ్యాలో ప్రభుత్వాలకు తెలుసు. తెలియకపోతే ఆర్థిక శాస్త్రవేత్తలు సలహాలిస్తున్నారు. కాని అమలు చేయటం చేత కావటం లేదు. అలాంటపుడు వారికి ప్రభుత్వోద్యోగులు లోకువగా కనిపిస్తారు. అక్టోబరులో కేంద్రం ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రుల సమావేశంలో గడ్డు పరిస్థితిని అధిగమించే నిమిత్తం ప్రభుత్వోద్యోగుల కరువు భత్యం, బోనస్‌లను స్థంభింపచేయాలని, పెన్షన్ భారం తగ్గించాలని విఫల ప్రయత్నం చేశాయి. కొన్ని రాష్ట్రాలైతే వీళ్ల జీతాలు మస్తుగా పెంచేశాం కాబట్టి ఇకముందు పే కమిషన్లు నియమించవద్దనే వరకూ వెళ్లాయి.

కేంద్రం, రాష్ట్రాల రుణభారం ఎంత పెరిగిందంటే వారి మొత్తం పన్ను ఆదాయాన్నంతా ఈ రుణాన్ని తీర్చి వేయటానికి వినియోగించినా (వడ్డీ మాట అటుంచి) అయిదు సంవత్సరాలపాటు చెల్లిస్తూ వస్తేనే రుణభారం మాయమవుతుంది. మరి వడ్డీ చెల్లింపులు? ఈ అయిదు సంవత్సరాల్లో రుణాలు చేయకుండా పూటగడవదు కదా. ప్రభుత్వాలు విష వలయంలో చిక్కుకొన్నాయి. ప్రపంచబ్యాంకు ప్రయత్నం ఫలించింది.

రాష్ట్రాల రుణం బకాయిలు 1998లో రు. 2,81,207 కోట్లు కాగా, 2002 నాటికి 5,91,832 కోట్లకు పెరిగాయి. సంస్కరణలు ప్రారంభించిన 1991 సంవత్సరం నుంచి చూస్తే దాదాపు అయిదు రెట్లు పెరిగాయని అస్సోచామ్ విశ్లేషించింది. ప్రతీ సంవత్సరం సగటున 20 శాతం మేరకు పెరుగుతున్నాయి.

రాష్ట్రాల రుణభారం (కోట్ల రూ॥లలో)

1998	2,81,207
1999	3,41,978
2000	4,20,132
2001	5,04,248
2002	5,91,832

స్టాండర్డ్ అండ్ పూర్స్ రేటింగ్ సంస్థ 2001-02 లో వేసిన లెక్కల ప్రకారం కేంద్ర, రాష్ట్ర రుణాలు, వీరి గ్యారంటీ మీద ఇచ్చిన రుణాలు కలుపుకొంటే ఆ మొత్తం జిడిపిలో 85 శాతం వుంటుంది.

ప్రభుత్వాదాయంలో పన్నులనుంచి వచ్చే ఆదాయమే ఎక్కువగా వుంటుంది. వారి రెవెన్యూ ఆదాయంలో 79 శాతం పన్ను వసూళ్ళద్వారా వస్తుందని, ఆ వసూళ్ళలో 70 శాతం వినిమయ పన్నులు, అంటే కస్టమ్స్, ఎక్సయిజు అమ్మకం పన్ను ద్వారా లభిస్తుందని ఎకనమిక్ టైమ్స్ పత్రిక లెక్క వేసింది. ఈ పన్నులన్నీ పరోక్షంగా సామాన్యులే చెల్లిస్తారని గమనంలో వుంచుకోవాలి.

రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి ఏమిటి అనేది కొన్ని సూచికలు తెలియ చేస్తాయి. గణాంకాలే రాష్ట్రాలకథలు చెప్పేస్తాయి చూడండి.

మాట్లాడే గణాంకాలు 2000-01 (శాతం)

రాష్ట్రం	ద్రవ్యలోటులో రెవెన్యూలోటు	మొత్తం ఖర్చులో అభివృద్ధేతర ఖర్చు	రెవెన్యూ ఆదాయంలో వడ్డీ చెల్లింపులు	రెవెన్యూ ఖర్చులో సొంతపన్ను ఆదాయం
కర్నాటక	52.4	29.7	16.2	53.9
తమిళనాడు	67.9	32.9	16.3	56.3
మధ్యప్రదేశ్	60.2	34.0	17.4	34.8
మహారాష్ట్ర	62.3	34.6	18.4	56.9
ఆంధ్రప్రదేశ్	43.2	29.9	20.2	45.8
బీహార్	60.6	36.8	20.9	20.5
గుజరాత్	81.4	23.4	21.4	39.4
హర్యానా	42.9	33.0	21.8	54.9
కేరళ	74.1	37.4	22.6	49.9
పంజాబ్	57.7	43.6	23.8	40.1
రాజస్థాన్	54.4	36.7	27.0	35.4
ఉత్తరప్రదేశ్	47.4	38.7	30.4	31.7
ఒరిస్సా	55.1	37.8	30.9	25.3
పశ్చిమ బెంగాల్	55.0	35.3	35.8	28.3

(ఎకనమిక్ టైమ్స్ 15 నవంబర్ 02)

మన రాష్ట్ర ప్రభువులు ఉద్యోగులు తామరతంపరలా పెరిగిపోతున్నారని అంటూ, వారిని ఇంటికి పంపేయడానికి ప్రయత్నాలు ఎపుడో ప్రారంభించారు. రిటైరైన, వారి స్థానంలో కొత్తవారిని నియమించడంలేదు. ఖాళీలు భర్తీ చేయటం లేదు. వి.ఆర్.ఎస్. ఇచ్చి ఇంటికి పంపే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాని పైన ఉదహరించిన పత్రిక ప్రకారమే లక్షమంది ప్రజలకు ఎంతమంది ఉద్యోగులున్నారో లెక్కవేస్తే 54 మందితో 15 పెద్ద రాష్ట్రాల్లో మన రాష్ట్రం పదవస్థానంలో వుంది. అస్సాం, ఒరిస్సా,

ప్రపంచీకరణ వ్యతిరేక ప్రజావెల్లువ

- రావు దేవభక్తుని

సుమారు మూడు సంవత్సరాలక్రితం నవంబరు 23, 1999న సియాల్‌లో డబ్ల్యు.టి.వో. సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని నిరసిస్తూ వేలాదిమంది ప్రజలు, నిరసన ప్రదర్శనను జరిపారు. ఇది ప్రపంచీకరణ వ్యతిరేక ఉద్యమ ఆరంభ ఘట్టం. అయితే, వాస్తవానికి ప్రపంచీకరణ వ్యతిరేక పోరాటం, సియాల్ ప్రదర్శనల కంటే ముందే మొదలయ్యిందనేది కొందరి అభిప్రాయం. ఈ పోరు 1999 నూతన సంవత్సర దినాన దక్షిణ మెక్సికోలోని చియాపాస్ అడవులలో ఆరంభం అయ్యిందనేది వారి వాదన. ఆ రోజునే ఉత్తర అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (నాఫ్టా) అమలులోకి వచ్చింది. అదే రోజున రెండువేలమంది దక్షిణ మెక్సికోకు చెందిన స్థానిక ప్రజలు పోరాటరంగంలోకి దూకారు. వారు తమను తాము 'జపాతిస్టా'లుగా పిలుచుకున్నారు. వారి యుద్ధనినాదం "జరిగింది చాలు" అనేది. ఈ ప్రజాపోరాటం, ప్రపంచ పెట్టుబడిదారీ వ్యతిరేక ప్రతిఘటన మూల దృశ్యాన్నే మార్చివేసింది. ఈ ముసుగులు ధరించిన తిరుగుబాటు దారులు, అంటే పేదరికం బారిన పడిన సమాజాల నుంచి వచ్చినవారు, తమ భూమి, తమ జీవితాలు తమకే చెందాలని డిమాండు చేసారు. వారు కేవలం అంతర్జాతీయ మద్దతు, సుహృద్భావాలను మాత్రమే కోరడంలేదు. వారు నయా ఉదారవాదాన్ని వ్యతిరేకిస్తున్నారు. స్థానిక ప్రజలపై నాఫ్టా, ఇతర స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాలు విధించే 'మరణ దండన' గురించి వారు మాట్లాడుతున్నారు. పెట్టుబడి ప్రపంచ ప్రజలను చుట్టుముట్టడాన్ని వ్యతిరేకిస్తున్నారు. వారి సందేశం "మాతో చేరవద్దు - మీ అంతటను మీరే చేయండి" అనేది.

ఈ తిరుగుబాటు ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమంది ప్రజలలో రేకెత్తించిన ఆశ అనంతమైనది. కాబట్టి, నేటి ప్రపంచీకరణ వ్యతిరేక పోరాటాలకు 'జపాతిస్టా' తిరుగుబాటును ప్రథమ సంకేతంగా

పంజాబ్, తమిళనాడు, కర్ణాటక, హర్యానా రాష్ట్రాల్లో నూరుకు పైగానే వున్నారు. మన కన్నా ఇంకా తక్కువగా వున్న రాష్ట్రాలు నాలుగే. అందరికన్నా తక్కువ ఉద్యోగులున్న రాష్ట్రం పశ్చిమబెంగాల్.

అక్టోబరులో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశంలో రాష్ట్రాల రుణభారం సమస్యమీద కేంద్రం చేసిన ప్రతిపాదన పరిష్కారానికి దూరమైంది. హెచ్చు వడ్డీరేట్లకు తీసుకున్న రు. 90000కోట్ల రుణాలను ఆ మూడేళ్ళలో తక్కువ వడ్డీ రుణాలుగా మార్చుకొంటే వడ్డీల భారం తగ్గుతుందని కేంద్రం ప్రతిపాదన. అయితే కేంద్రం దానికో మెలిక పెట్టింది. చిన్న మొత్తాల పొదుపు ఉద్యమంలో కొత్తగా సేకరించిన నిధుల్లో కొంతభాగాన్ని ఎక్కువ వడ్డీ చెల్లించే రుణాల తగ్గింపుకు వినియోగించి ఈ భారాన్ని తగ్గించుకోవాలనేది ఈ మెలిక. ఇది రాష్ట్రాలకు మింగుడు పడడం లేదు. ఎందుచేతనంటే అలాచేస్తే పెట్టుబడి పద్దులో ఆ మేరకు తక్కువవుతాయి. అసలే పెట్టుబడి నిధులు తక్కువ కావటం, లంగరందక వాటిని తగ్గించటం జరుగు తోంది. ఈ సలహామేరకు ఇంకా తగ్గుతాయి. పెట్టుబడి పెట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కొరవడుతాయి. నిర్ణయం వాయిదా పడింది. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వుండి పోయింది.

1. స్థూల జాతీయాదాయంలో, స్థూల ద్రవ్యలోటు 1996-97లో 2.72 శాతం నుండి 2002-03లో 4.76 శాతానికి పెరిగింది.
2. స్థూల జాతీయాదాయంలో శాతంగా రెవెన్యూ లోటు 1.24 నుండి 2.85 కు పెరిగింది. అదే లోటు స్థూల ద్రవ్యలోటులో 1999-2000లో 63.23 శాతానికి చేరింది.
3. రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రాధార సంస్థలకిచ్చిన గ్యారంటీల మొత్తం రూ. 1,35,600 కోట్లకు చేరింది.
4. వడ్డీ చెల్లింపులు రెవెన్యూ ఆదాయంలో భాగంగా 14.96 శాతం నుంచి 21.4 శాతానికి పెరిగాయి.
5. నడుస్తున్న సంవత్సరంలో తిరిగి చెల్లించిన రుణాలు కొన్ని వున్నాయి. అవి చెల్లిస్తే, రాష్ట్ర ఆర్థిక స్థితి ఏమవుతుందో ఇపుడే తెలియరాలేదు.
6. చేసిన రుణాల్లో 63 శాతం రోజువా ఖర్చులకే వెళ్లిపోయాయి.

ముఖ్యమంత్రుల సమావేశంలో అందచేసిన అధికారిక నేపథ్య పత్రంలో నేటి దుస్థితి గురించి పైన పేర్కొన్న ఆరు విషయాలు రాష్ట్రాలు తమ ఖర్చును అదుపు చేసుకోలేక పోవటం వల్ల, జనాకర్షక పథకాలకు ఖర్చు చేస్తుండటం వల్ల, కొత్త ఆదాయ వనరులను చేపట్టలేక పోవటం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. బెంగుళూరులోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ సోషల్ అండ్ ఎకనమిక్ ఛేంజ్ విశ్లేషణ ప్రకారం బడ్జెట్‌లో చూపించే లోటు మాత్రమే అసలైన లోటు కాదని, రాష్ట్ర ప్రభుత్వాలు పలు రకాల పద్ధతుల ద్వారా ఈ రుణాలు చేస్తున్నాయని, ఇవి ప్రభుత్వ బడ్జెట్లో కనపడవని తేలింది. హడ్కో, నాబార్డ్, ఐడిఎఫ్‌సి లాంటి సంస్థల నుంచి తీసుకొనే రుణాలు చాలా ఎక్కువగా వుంటున్నాయని ఆ విశ్లేషణ తెలియచేస్తుంది. అలాగే విద్యున్మండలుల 2000-01 బడ్జెట్ ప్రకారం వాటి నష్టాలు 26వేల కోట్లు అయినా, బడ్జెట్‌లో చూపించింది ఆరువేల కోట్లు మాత్రమే. ఆంధ్రప్రదేశ్‌లో ట్రాన్స్కోకు ఇచ్చిన రుణాన్ని బడ్జెట్‌లో చూపించకుండా ప్రణాళికలో చూపించారు. ❑

తీసుకోవచ్చునేమో. అయితే ప్రపంచ పెట్టుబడిదారీ శిబిరపు కంచుకోట అయిన అమెరికాలోని సియాటిల్‌లో జరిగిన డబ్ల్యు.టి.ఓ వ్యతిరేక పోరాటపు ప్రాధాన్యతను ఏమాత్రం తక్కువగా అంచనా వేయరాదు. ఇది, ప్రపంచ పెట్టుబడిదారీ విధానానికి విసరబడ్డ మొట్టమొదటి పెనుసవాలు. కాగా, ఈ నిరసన ప్రదర్శన అనంతరం పెట్టుబడిదారీ వ్యతిరేకపోరాటాలు ప్రపంచమంతా పోటెత్తసాగాయి. మార్క్స్ కలలు కన్నట్లుగానే అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో పెనుచిచ్చు రగులుకుంది. ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు, డబ్ల్యుటిఓ సమావేశాలు జరిగిన చోటల్లా నిరసన వెల్లువలు పొంగెత్తసాగాయి.

సియాటిల్ తమ సమావేశాన్ని 'సాఫీగా' జరుపుకునేందుకు డబ్ల్యు.టి.ఓ నిర్వాహకులు పడ్డపాట్లు అన్ని ఇన్నీ కాదు. వారు ఈ విషయంలో ఎన్జీవోల ప్రాపకాన్ని సాధించడానికి ప్రయత్నం చేసారు. తమకు స్నేహ పూర్వకంగా వుంటామని భావించిన ఎన్జీవోలను ఎంపిక చేసుకున్నారు. వాటికే పార్ట్‌నర్ ఎన్జీఓస్ అనే ముద్దుపేరును తగిలించు కున్నారు. 'నిర్దిష్ట సమస్య' ఘటనల ప్రాతిపదికన ఈ ఎన్జీవోలతో సమావేశాలు జరిపారు. యూరోపియన్ కమిషన్ ఎంపిక చేసిన వినియోగదారుల బృందాలు, కార్మిక సంఘాలు, పర్యావరణబృందాలు, అభివృద్ధి సంస్థలతో పలు దఫాల చర్చలు జరిపారు. దీని ఉద్దేశ్యం డబ్ల్యుటిఓ సమావేశాల పారదర్శకతను పెంచడమే"నని చెప్పుకుంది. వాణిజ్య సరళీకరణ ఎజెండాను పెద్ద సవాళ్ళు రాకుండా ఛోటా మోటా సమస్యలతో సియాల్ నిరసన ప్రదర్శన ముగిసిపోవాలని కోరుకుంది.

ఇది చాలదన్నట్లు, తన - సామ, దాన, భేద, దండోపాయాలలో భాగంగా ఎఫ్‌బిఐ, సిఐఏ ఇతర ఫెడరల్ సంస్థలను, వాటి ప్రత్యేక దళాలను రంగంలోకి దింపేందుకు సిద్ధం అయ్యింది. స్వేచ్ఛా మార్కెట్ వ్యవస్థను వ్యతిరేకించేవారిని అణచివుంచేందుకు డబ్ల్యుటిఓ పడరాని పాట్లు పడింది. డబ్ల్యుటిఓ కు మానవ పార్శ్వాన్ని ఇచ్చేందుకు నామమాత్రపు పర్యావరణ తదితర రాయితీలను ఇవ్వడానికి సిద్ధపడింది. ఇది, డబ్ల్యుటిఓ తో కుమ్మక్కైన పార్ట్‌నర్ ఎన్జీఓస్ కూడా తమ పోరాటపటిమ చావలేదని చెప్పుకోవడానికి కావాల్సిన కుంటిసాకుగా వుండగలదు. రి యోడి జనైరో లో 1992లో జరిగినప్పటి నుంచీ ప్రతి సంవత్సరం తంతుగా జరుగుతోన్న పీపుల్స్ సమ్మిట్ లు యధావిధిగా "ప్రత్యామ్నాయం" పేరిట జరిగి పోతున్నాయి. ఈ పీపుల్స్ సమ్మిట్ లు విమర్శనాత్మక చర్చకు వేదికను కల్పిస్తూనే కాలక్రమేణా అసమ్మతి తాలూకు తంతుగా మిగిలిపోయాయి. ఇవి ప్రపంచపెట్టుబడి దారీ శిబిరపు ప్రధాన పునాదు లైన డబ్ల్యుటిఓ, ఐఎంఎఫ్, డబ్ల్యుబి లను సమావేశం చెక్కుచెదరనివ్వని "స్వామి భక్త" పాత్రను పోషిస్తు న్నాయి. పెట్టుబడిదారీ పదఘట్టన క్రింద నలుగుతున్న శ్రామికులు, రైతాంగం, మధ్యతరగతిలోని ఒక వర్గం, కొందరు మేధావులకు తమ ఆగ్రహాన్ని వెళ్లగక్కుకునే "ప్రత్యామ్నాయ" వేదికలను ఇస్తున్నాయి. ఇది నిజమైన పోరాటాలనుంచి వారిని ప్రక్క ద్రోవ పట్టించడమే. ఉదాహరణకు, 1999వ సంవత్సరం జూన్ నెలలో కొలోన్ జి-7 దేశాల సమావేశాలకు ప్రత్యామ్నాయంగా పీపుల్స్ సమ్మిట్ పేరిట సమావేశం జరిగింది. ఈ సమావేశం ఏర్పాటుదారులు దానిని, అధికారిక సమావేశపు నిర్వాహకులతో చర్చించి, వారి అనుకూలత మేరకు నిర్ణయించారు. ఈ సమావేశానికి జర్మన్ విదేశాంగ శాఖామాత్యుడు జోష్కా ఫిషర్ అదుపులోవున్న జర్మన్ గ్రీన్ పార్టీ విభాగమైన హైన్‌రిచ్ బోల్ ఫౌండేషన్ ఉదారంగా విరాళాలను ఇచ్చింది. మరోప్రక్కన, యూరప్‌లోని అన్ని ప్రాంతాలనుంచీ వచ్చిన 20,000 మంది నిరసన ప్రదర్శనలు కొలాన్ వీధులను ముంచెత్తారు. వారు మూడవ ప్రపంచ దేశాల రుణాలను ఎటువంటి షరతులు లేకుండా రద్దు చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై 16-17 మిలియన్ల మంది సంతకాలు చేసారు.

అంటే వాస్తవానికి నియోటిల్‌లో జరిగింది. రెండు పరస్పరం భిన్నమైన తీరుతెన్నులు కల నిరసనలు 1) నిఖార్సుగా నూతన ప్రపంచ వ్యవస్థకు వ్యతిరేకం అయినవారు 2) "భాగస్వాములైన" పౌర సమాజ సంఘాల వారు "చూపిన" నిరసన. ఈ రెండవరకం నిరసనలు పైకి మాత్రమే ప్రగతిశీలంగా కనపడేవి. అంతఃసారం డొల్లే. ఈ తరహా సంస్థలకు తరచుగా ఆయాదేశాల ప్రభుత్వాలు నిధులను సమకూరు స్తుంటాయి. ఇవి రాజకీయంగా "సరైన" "ఆమోద యోగ్యమైన" ప్రతి పక్షంగా వ్యవహరిస్తాయి. ఈ సంస్థలకు, వాటి నిర్వాహకులకు అత్యంత క్రిందిస్థాయి సామాజిక ఉద్యమాలతో ఎటువంటి సంబంధమూ లేదు. ఈ పార్ట్‌నర్ ఎన్జీఓస్‌లు నిజమైన ప్రజా, సామాజిక ఉద్యమాలనుంచి పీడిత ప్రజల దృష్టిని ప్రక్కకు మళ్ళించడానికి మాత్రమే ఉపయోగ పడతాయి.

కాగా సియాల్ తరువాత వాషింగ్టన్, దావోస్‌ల వంటి ప్రాంతాలలో ఐఎంఎఫ్, డబ్ల్యుబి, డబ్ల్యుటిఓ ల వ్యతిరేక పోరాటాలు జరిగాయి. అంతేకాకుండా, ఇంకా పలు ప్రదేశాలలో ఈ సంస్థలకు చుక్కెదురయ్యింది. హంస పాలనుంచి నీటిని వేరు చేస్తుందంటారు. అలాగే, ప్రజా ఉద్యమాలు, ముఖ్యంగా వామపక్ష ఉద్యమాలు "ప్రత్యామ్నాయ" పోరాట వేదికలను పైన పేర్కొన్న తరహా పార్ట్‌నర్ ఎన్జీవోస్ గుత్త సొత్తుకాకుండా నిలువరించాలి. ఈ పోరాటంలో వామ పక్షాల విజయం, నిఖార్సయిన ఎన్జీవోల విజయం మాత్రమే ప్రజా పోరాటాలకు పదునుపెట్టగలదు. వాటిని ముందుకు తీసుకువెళ్ళ గలదు. ఇప్పటికే పెట్టుబడిదారీ వ్యతిరేక పోరాటాలలో స్పెయిన్, ఆస్ట్రియా, బాన్ పర్యావరణ సదస్సు, జెనోవా, బొలీవియా, కొలంబియా, క్విటార్, కెనడాలోని ఒట్టావో, అర్జెంటీనా, బ్రెజిల్ నిరసనల వంటివి ప్రత్యామ్నా యాలకు మార్గం చూపాయి. వీటిలో నిఖార్సయిన ప్రత్యామ్నాయ ధారకు ప్రాతినిధ్యం వహించడం నేటి తక్షణ కర్తవ్యం. లేని పక్షంలో పార్ట్‌నర్ ఎన్జీవోస్ వంటివి ప్రజా పోరాటాలను ఎగురవేసుకుపోయి నిజమైన పోరాటాలను నీరుకార్చివేసే పెనుముప్పు వున్నది. ఇది నేటి ప్రపంచీ కరణ - సరళీకరణ - ప్రైవేటీకరణల వ్యతిరేక పోరాటంలో కీలకదశ. కుహనా పోరాటాలు, పోరాటకారుల స్థానంలో నిఖార్సయిన పోరాట పటిమకు శ్రీకారం చుట్టవలసిన తరుణం.

మార్క్స్, ఎంగెల్స్‌లు తమ కమ్యూనిస్టు ప్రణాళికలో స్పష్టం చేసిన విధంగా పెట్టుబడిదారీ వ్యవస్థ చరమాంకంతో ఆ వర్గంలోనే

(తరువాయి 22వ పేజీలో)

తలసరి ఆదాయం సూచించేదేమిటి?

- ఎన్. వేణుగోపాల్

సామాజికాభివృద్ధికి ఒక సూచికగా జాతీయాదాయం పెరుగుదలనో, తలసరి ఆదాయం పెరుగుదలనో చూపడం ఒక ఆనవాయితీ అయింది. మరీ ముఖ్యంగా గత దశాబ్దంగా 'అభివృద్ధి మాయాజాలాన్ని' ప్రచారం చేస్తున్న పాలకులు అంకెల గారడీతో ఆరు శాతం పెరుగుదల, పదిశాతం పెరుగుదల, పన్నెండు శాతం పెరుగుదల వంటి డాంబికాలు ప్రకటిస్తున్నారు.

ఒకవైపు జాతీయాదాయం, తలసరి ఆదాయం, వాటి పెరుగుదలరేట్లు పైపైకి ప్రయాణిస్తుండగా, మరోవైపు ప్రజల జీవన ప్రమాణాలు దిగజారుతుండడం, పేదరికం పెరిగిపోతూ ఉండడం నిత్యజీవిత వాస్తవికత అయింది. ఈ స్థితిలో మానవాభివృద్ధి అంటే నిజంగా ఏమిటి? కేవలం తలసరి ఆదాయం పెరుగుదలతో మానవాభివృద్ధిని కొలవవచ్చునా, మానవాభివృద్ధిని లెక్కించ డానికి పరిశీలించవలసిన ఇతర ప్రమాణాలేమిటి అనే చర్చ అభివృద్ధి అర్థశాస్త్రంలో ప్రధానమైన చర్చ అయ్యింది.

తలసరి ఆదాయాన్ని ఒక సమాజపు అభివృద్ధికి చిహ్నంగా చూడడంలో ప్రధానంగా మూడు సమస్యలున్నాయి. ఒకటి, ఆ తలసరి ఆదాయపు అంకె దేశం మొత్తానికో, రాష్ట్రం మొత్తానికో సగటు అంకె కావడం వల్ల ఆ జనాభాలోని అంతరాల గురించి ఆ అంకె చెప్పజాలదు సరిగదా తప్పుడు సూచికలను కూడా ఇస్తుంది. ఉదాహరణకు మన దేశంలోనూ రాష్ట్రంలోనూ రోజుకు పది రూపాయల ఆదాయం రావడాన్నే మహాభాగ్యంగా భావించే వాళ్ళు కోట్లాది మంది ఉన్నారు. మరొక కొసన రోజుకు కొన్ని డజన్ల కోట్ల రూపాయలో, వందల కోట్ల రూపాయలో ఆదాయం వచ్చేవాళ్ళు కూడా కనీసం కొన్ని వందల మంది అయినా ఉన్నారు. వారినీ వీరినీ కలగలిపి, వారిరువురి ఆదాయాలను కలిపేసి, మొత్తం జనాభాతో భాగహారం చేస్తే వచ్చే అంకె ఎంత హాస్యాస్పదమైనదో చెప్పనక్కరలేదు కాని దశాబ్దాలుగా ఇటువంటి అంకెలూ తయారవుతున్నాయి. ప్రభుత్వాలు ఆ అంకెలనే పట్టుకుని తమ అభివృద్ధిని ప్రకటించుకుంటున్నాయి.

రెండో సమస్య, తలసరి ఆదాయం అనే అంకె ఉజ్జాయింపుగా సరైన ఆదాయాలనే ప్రతిబింబించే చోట కూడా దాని లక్షణం పరిమాణాత్మకమైనదే గాని గుణాత్మకమైనది కాజాలదు. అంటే వచ్చే ఆదాయం సామాజిక శ్రేయోదాయకమైన కార్యక్రమాలనుంచి వస్తుందా, అందుకు భిన్నంగా సామాజిక ఆరోగ్యాన్ని భంగపరిచే కార్యక్రమాల నుంచి వస్తుందా అనే దానితో తలసరి ఆదాయం అంకెకు నిమిత్తం లేదు. అట్లాగే ఆ తలసరి ఆదాయం మానవాభివృద్ధికోసం వినియోగించ బడి, మనుషుల జీవన ప్రమాణాలు పెరుగుతున్నాయా, లేక అనుత్పాదక, అనవసర, వ్యర్థ రంగాలలో వినియోగించబడుతూ మనుషుల జీవన ప్రమాణాల మీద ఎటువంటి ప్రభావం చూపడం లేదా అనే ప్రశ్నతో ఆ అంకెకు నిమిత్తం లేదు.

మూడో సమస్య, తమ ప్రజల వర్తమానాన్నీ, భవిష్యత్తునూ తీర్చిదిద్దవలసిన ప్రభుత్వాలు, ప్రజల కనీస అవసరాలను తీర్చడం మాత్రమే గాక విజ్ఞాన, వినోద అవసరాలను తీర్చవలసిన ప్రభుత్వాలు ఆ పని నుంచి తప్పుకునేందుకు, ఆ పనిని విస్మరింపజేసేందుకు తలసరి ఆదాయంలో పెరుగుదల అంకెలను ఒక ముసుగుగా వాడుకుంటు న్నాయి. పిడికెడు మంది సంపన్నుల ఆస్తులను ఇంకా పెంచడంద్వారా, పనిచేసే చేతులకు ఉపాధి కల్పించకపోయినా ఎక్కువ పెట్టుబడులను, ఎక్కువ సాంకేతిక విజ్ఞానాన్ని, ఎక్కువ లాభాలను ప్రవేశపెట్టడం ద్వారా జాతీయాదాయం అంకెలను ఇతోధికంగా పెంచడానికి ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. ఆ రకంగా పెరిగిన జాతీయా ఆదాయాన్ని జనాభాతో భాగించి తలసరి ఆదాయం పెరిగిందని ప్రగల్భాలు పలుకుతున్నాయి. అందువల్లనే తలసరి ఆదాయం లో పెరుగుదల కనబడుతున్నప్పటికీ పేదరికం పెరగడం, సంపద కొందరి చేతుల్లో పెరుగుతుండడం, అంతరాలు పెరుగు తుండడం జరుగుతున్నాయి.

ఈ నేపథ్యంలో మానవ అభివృద్ధికీ, సంక్షేమానికీ సూచికగా కేవలం తలసరి ఆదాయం అంకెను తీసుకోగూడదని, మరింత విశాలమైన నిర్వచనంతో, మరిన్ని ప్రమాణాలను నెలకొల్పాలనీ ఆలోచన ప్రారంభమైంది. ఐక్యరాజ్యసమితి అభివృద్ధి పథకం (యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) గత పది సంవత్సరాలకు పైగా మానవ సంక్షేమాన్ని కొలవడానికి కొత్త ప్రమాణాలను తయారు

చేస్తూ వస్తోంది. పాకిస్తాన్‌కు చెందిన అభివృద్ధి అర్ధశాస్త్రవేత్త మహబూబుల్ హక్. యుఎన్‌డిపి సంయుక్తంగా 1989 నుంచి మానవాభివృద్ధి నివేదిక అనే ఒక కొత్త దృక్పథానికి సంబంధించిన ఆలోచనలను ప్రకటిస్తున్నారు.

మానవాభివృద్ధి అంటే ప్రజల ముందు ఉండే ఎంపిక అవకాశాలను విస్తృతం చేసే ప్రక్రియ అని, సంక్షేమాన్ని ఇతోధికంగా ఉన్నత స్థాయికి తీసుకుపోయే ప్రక్రియ అని మానవాభివృద్ధి నివేదిక నిర్వచించింది. ఎంపిక అవకాశాలనేవి స్థలకాలాలను బట్టి మారవచ్చునని, వేరువేరుగా ఉండవచ్చునని కూడా మానవాభివృద్ధి నివేదిక అంగీకరించింది.

స్థూలంగా ఇప్పటివరకు మానవాభివృద్ధి నివేదికలో వ్యక్తమయిన ఆలోచనల ప్రకారం ఎంపిక అవకాశాలంటే, సుదీర్ఘకాలం, ఆరోగ్యంగా జీవించగలిగే అవకాశం కావచ్చు. జ్ఞానాన్నీ, విద్యనూ పొందగలిగే అవకాశం కావచ్చు. గౌరవ ప్రదమైన జీవనం గడపడానికి అవసరమైన వనరులను పొందగలిగే అవకాశం కావచ్చు. ప్రధానంగా ఈ మూడు మార్గాలను గుర్తించిన మానవాభివృద్ధి నివేదికలు ఆయుః ప్రమాణం, అక్షరాస్యత, స్త్రీ పురుషసమానత్వం, సర్వతోముఖాభి వృద్ధి వంటి ఎన్నో అంశాలను పరిగణనలోకి తీసుకున్నాయి. తలసరి ఆదాయం కూడా ఒకానొక సూచిక కావచ్చునని అంగీక రించాయి.

ఆయుఃప్రమాణం, విద్యార్హతలు అనేవి వాటికవిగానే లక్ష్యాలుగా ఉంటాయని, ఒక మనిషి జీవన ప్రమాణానికి గుణాత్మక సూచికలుగా పనిచేస్తాయని యుఎన్‌డిపి అంటుంది. తలసరి ఆదాయం అనే సూచిక ఎంత లోపభరితమయిన దయినా, దాన్ని సాధించవలసిన ఇతర ప్రమాణాలకు సాధనంగా చూసినప్పుడు అంగీకరించవచ్చునని ఆ నివేదిక అంటుంది.

అంటే కొత్త దృక్పథం ప్రకారం మానవాభివృద్ధికీ, సంక్షే మానికీ ఆయుఃప్రమాణం, విద్య, ఆరోగ్యం, స్త్రీ పురుష సమానత్వం, వనరులపై అధికారం వంటి లక్ష్యాలూ, తలసరి ఆదాయం వంటి సాధనాలూ ప్రమాణాలుగా ఉంటాయి.

సరిగ్గా ప్రపంచవ్యాప్తంగా ప్రపంచీకరణ క్రమం ఉధృతం కావడం, మన దేశంలో ప్రపంచీకరణలో భాగంగా నూతన ఆర్థిక విధానాలు అమలుకావడం, పెట్టుబడిదారీ సాంఘీక ధర్మం మినహా, 'గత్యంతరం లేదు' అని మార్గరెట్ థాచర్ సిద్ధాంత ప్రవచనం చేయడం, మానవాభివృద్ధి గురించి కొత్త దృక్పథం ఉనికిలోకి రావడం ఒకే నేపథ్యం నుంచి వెలువడడం గమనించ దగిన విషయం. యుఎన్‌డిపి మొదటి నుంచీ పెట్టుబడిదారీ ప్రపంచీకరణ శక్తులు ప్రకటించే అభివృద్ధికి భిన్నమైన వాదనలు చేస్తూ వస్తోంది.

మానవాభివృద్ధి నివేదిక 1999 ప్రధాన సంకలనకర్త డా॥ రిచర్డ్ జాలీ మాటల్లో చెప్పాలంటే, "మానవ జీవితమంటే ఆదాయం ఒక్కటే కాదు. మానవాభివృద్ధి అనే భావన ఆదాయం కన్న లోతయినది. విలువైనది. ఆదాయం మానవాభివృద్ధికి ఒక మార్గం మాత్రమే గాని గమ్యం కాదు.

అయినా ఇప్పటికీ మన ప్రభుత్వాలు తలసరి ఆదాయాన్నే ప్రధాన సూచికగా తీసుకుని మనం ఇంకా ఇంకా పైపైకి వెళ్ళాలని ఉద్బోధిస్తున్నాయి. నిజానికి యుఎన్‌డిపి మానవాభివృద్ధి నివేదిక సోదాహరణంగా తలసరి ఆదాయం హెచ్చుగా ఉన్నంత మాత్రాన అభివృద్ధి ఎక్కువగా ఉన్నదని చెప్పడానికి వీల్లేదని ప్రకటించింది. తలసరి ఆదాయం ఖతర్‌లో 20,987 డాలర్లు ఉన్నప్పటికీ, మానవ సంక్షేమ విషయంలో ఖతర్ ప్రజలు 7,910 డాలర్ల సగటు తలసరి ఆదాయం ఉన్న స్లొవాకియా ప్రజలతో సమానంగా ఉన్నారని మానవాభివృద్ధి నివేదిక చూపింది.

తలసరి ఆదాయం అనేది ప్రధానంగా ద్రవ్యరూపపు కొలత. అంటే మార్కెట్ ప్రక్రియలో భాగమై, ద్రవ్యరూపంలోకి మారగల అవసరాలను, అవకాశాలను మాత్రమే అది పరిగణన లోకి తీసుకుంటుంది. "ప్రపంచీకరణ, కొత్త సూత్రాలు, వాటిని రాస్తున్న స్వార్థపర శక్తులు, అంతర్జాతీయ మార్కెట్లను ఏకం చేయడం మీద శ్రద్ధ చూపుతారు. మార్కెట్ల ద్వారా తీరడానికి వీలులేని అవసరాలు కూడా ప్రజలకు ఉంటాయని వాళ్ళు గుర్తించరు. కనుక వాటిని నిర్లక్ష్యం చేస్తారు. ఈ క్రమం వల్ల అధికారం, సంపద కొన్ని దేశాల దగ్గర, కొంతమంది దగ్గర, కేంద్రీకృతమై, అశేష ప్రజానీకం పక్కకు తప్పుకోవలసి వస్తుంది అని యుఎన్‌డిపి రాసింది.

ఈ కొత్త దృక్పథం మన దేశంలోనూ కొందరు మేధావుల ను ఆకర్షించింది. ప్రభుత్వ గణాంకాలలో కూడా ఎంతో కొంత ఈ దృక్పథాన్ని జొప్పించడానికి కొంతకాలంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తమ తమ రాష్ట్రాల మానవాభివృద్ధి నివేదికలను ప్రకటించాయి. ఆ ప్రయత్నాలన్నింటినీ ఇంకా సమగ్రం చేస్తూ కేంద్ర ప్రణాళికా సంఘం 2002 మార్చిలో భారతదేశపు జాతీయ మానవాభివృద్ధి నివేదిక 2001 ని మొదటిసారిగా ప్రచురించింది.

ఈ తాజా నివేదిక దాదాపు 70 వేర్వేరు ప్రమాణాల ఆధారంగా గణాంకాలను సేకరించి చాలా సమగ్రమైన విశ్లేషణలు చేసి, అంచనాలు ప్రకటించింది. ఎంతో కాలంగా కేవలం తలసరి దాయం మీద ఆధారపడి అభివృద్ధి మాయా జాలాన్ని ప్రచారం చేస్తున్న మనదేశంలో ఈ మానవాభి వృద్ధి నివేదిక కొత్త అంచనాలను అందిస్తోంది. ❑

గుబులు పుట్టించిన మధ్యంతర సర్వే

-గుడిపూడి విజయరావు

డిసెంబరు 3వ తేదీన కేంద్ర ఆర్థిక మంత్రి జస్వంత్‌సింగ్ పార్లమెంటుకు మధ్యంతర ఆర్థిక సర్వేను సమర్పించారు. అయితే అసాధారణమైన రీతిలో ఇప్పుడు ఈ మధ్యంతర సర్వే అవసరం ఎందుకు వచ్చిందో మాత్రం అర్థం కాదు. మరో 12 వారాలలో వార్షిక బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టనుండగా ఈ మధ్యంతర సర్వేను విడుదల చేశారు. బడ్జెట్ సమయంలో ఎలాగూ సమగ్రమైన వార్షిక ఆర్థిక సర్వేను అందజేస్తారు. మధ్యంతర సర్వే అంటే ఆర్థిక సంవత్సరం మధ్యలో వెల్లడిస్తే అర్థవంతంగా ఉంటుంది. కాని బడ్జెట్ రూపకల్పన ప్రక్రియ తుది దశకు చేరుకుంటున్నది. ఈ స్థితిలో మధ్యంతర సర్వేలోని అంశాలను పరిగణనలోకి తీసుకొని బడ్జెట్ మార్పులు చేయడం కూడా అంతగా జరిగే పనికాదు. అందువల్ల మధ్యంతర సర్వే వెల్లడి అయినా అది రాబోయే బడ్జెట్‌కు సూచికగా మాత్రమే ఉంటుంది. అందువల్ల మధ్యంతర సర్వేవల్ల ప్రయోజనం అంతగా లేకపోయినప్పటికీ వివిధ సెక్షన్లకు చెందిన ప్రజానీకం ఆసక్తిగా ఎదురుచూశారు. పైగా కొద్దికాలం క్రితమే ఆర్థిక శాఖ బాధ్యతలు స్వీకరించిన జస్వంత్‌సింగ్ బహిరంగ వేదికలపై చాలా అరుదుగా మాత్రమే కనిపిస్తున్నారు. మీడియా ప్రతినిధులు కలుసుకోవడానికి కూడా అవకాశం ఇవ్వడం లేదు. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన పలు సమావేశాలలో ఆయన పాల్గొనలేదు. పన్ను సమస్యలపై ఫిక్కీ జరిపిన సమావేశం, భారతదేశంపై వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశం అంతర్జాతీయ బ్యాంకింగ్ శిఖరాగ్రసభ ఇటువంటి సమావేశాలలో ముఖ్యమైనవి. వీటిలో ఆర్థికమంత్రి తప్పనిసరిగా పాల్గొనవలసి ఉంది. కాని ప్రాధాన్యత కల్గిన పలు ఆర్థిక అంశాలపై ప్రభుత్వం ఏం ఆలోచిస్తున్నదో బహిరంగంగా తెలుసుకోవడానికి ఈ కాలంలో అవకాశం కలగలేదు. అందువల్లనే మధ్యంతర సర్వే ఎంతో కొంత ప్రాధాన్యత సంతరించుకున్నది.

ఇంతకీ ఈ మధ్యంతర సర్వే ఏం చెప్పింది? అన్నింటికన్నా ముందు ప్రస్తుత ఆర్థిక బడ్జెట్‌లో అంచనా వేసిన స్థూల జాతీయ ఉత్పత్తి రేటు 6 శాతం కన్నా ఇది తకువ. పైగా ఒకటి రెండు మాసాల క్రితం ప్రణాళికా సంఘం పదో పంచవర్ష ప్రణాళిక (2002-1007) ఏడాదికి సగటున 8 శాతం అభివృద్ధి రేటును సాధించడం లక్ష్యంగా పేర్కొంది. దీనికి ప్రభుత్వం ఆమోదముద్ర కూడా వేసింది. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే పదో ప్రణాళిక మిగిలిన నాలుగేళ్ళ కాలంలో కనీసం 9 శాతం అభివృద్ధిని సాధించాలి. కాని మధ్యంతర సర్వే చావుకబురు చల్లగ చెప్పినట్లు అభివృద్ధిరేటు 5.5 శాతం ఉంటుందని పేర్కొంది.

గత ఏడాదితో పోల్చుకున్నప్పుడు మాన్యుఫాక్చరింగ్‌రంగం పుంజుకున్నదని సర్వే తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు మాసాలలో 2.5 శాతంగా ఉన్న మాన్యుఫాక్చరింగ్ రంగం అభివృద్ధిరేటు ఈ ఏడాది అదే కాలంలో 5.3 శాతానికి పెరిగిందని చెప్పింది. మాన్యుఫ్యాక్చరింగ్ రంగం పుంజుకోవడాన్ని ఇది తెలియజేస్తున్నదని, సిమెంట్, స్టీల్, టెక్స్‌టైల్ రంగాలు ఇప్పటికే వూపునందుకున్నాయని పేర్కొంది. ఈ ఆరుమాసాల కాలంలో సిమెంట్ ఉత్పత్తి 9.3 శాతం, స్టీలు ఉత్పతి 7.3 శాతం పెరిగాయి. యంత్ర పరికరాలు. ఇతర పెట్టుబడి సరకుల ఉత్పత్తి 8.9 శాతం పెరిగింది. టెక్స్‌టైల్ రంగంలో దుస్తులు ఉత్పత్తి 17 శాతం పెరిగింది. నిర్మాణరంగం వూపులో ఉండటంవల్ల సిమెంట్, స్టీల్‌కు గిరాకీ పెరిగిందని, 2002-03 బడ్జెట్‌లో ప్రకటించిన టెక్స్‌టైల్స్ ప్యాకేజీవల్ల ఈ రంగం అభివృద్ధి చెందిందని అభిప్రాయపడింది. ఇదంతా దేశ పారిశ్రామికరంగం పుంజుకోవడాన్ని సూచిస్తున్నదని సర్వే తెలిపింది.

వ్యవసాయరంగంలో సైతం సర్వే ఆశావహమైన చిత్రాన్ని అందించింది. ఒకవైపున అత్యధిక రాష్ట్రాలలో కరవు విలయతాండం చేస్తున్నప్పటికీ ఈ విధమైన ఆశాభావాన్ని వ్యక్తం చేయడం నిజంగా సాహసమే. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఆహార ధాన్యాల ఉత్పత్తి 2.1 కోట్లు టన్నులు పడిపోతుందన్న వ్యవసాయ మంత్రిత్వశాఖ అంచనాను సైతం సర్వే సవాలు చేసింది. ఈ సీజనులో బియ్యం దిగుబడి వ్యవసాయ మంత్రిత్వశాఖ వేసిన అంచనా 1.3 కోట్ల తరుగుదలకు బదులు 1 కోటి టన్నులు మాత్రమే ఉంటుందని సర్వే పేర్కొంది. కరవు ప్రభావం వర్షాధార పంటలు వేసే ప్రాంతాలకే పరిమితమవుతుందని. ఆ మేరకు ముతక ధాన్యాల దిగుబడిలో మాత్రమే ప్రధానంగా తరుగుదల ఉంటుందని సర్వే అభిప్రాయపడింది. మొత్తం మీద ఈ ఏడాది వ్యవసాయ ఉత్పత్తి పెరుగుతుంది. రేటు 1 శాతం ఉంటుందని అంచనా వేసింది.

పారిశ్రామికరంగంపట్ల వ్యవసాయరంగంపట్ల ఇలా సంతృప్తిని వ్యక్తం చేసిన సర్వే ద్రవ్య పరిస్థితిపై కూడా ఇదే మాదిరి అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ఈ ఆరు మాసాల కాలంలో ద్రవ్యలోటు రు. 57,746 కోట్లు ఉందని, గత ఏడాది ఇదే కాలంలో కాన్న ఇది స్వల్పంగా మాత్రమే అధికమని సంతృప్తిని వ్యక్తం చేసింది. ఈ కాలంలో రెవెన్యూ వసూళ్ళు 15 శాతం, మొత్తం ఆదాయం 12 శాతం పెరిగిందని, ఇదే కాలంలో రెవెన్యూ వ్యయం 13.5 శాతం, పెట్టుబడి వ్యయం 3.6 శాతం

పెరిగాయని తెలిపింది. అయితే ఈ ఏడాది మిగిలిన కాలంలో కూడా ఇదే పరిస్థితి కొనసాగాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పింది.

ద్రవ్యోల్బణం స్వల్ప స్థాయిలో కొనసాగడం శుభపరిణామమని సర్వే తెలిపింది. ఒకవైపున కరవు పరిస్థితి ఉన్నప్పటికీ ఆహార ధాన్యాల నిల్వలు పుష్కలంగా ఉండటంవల్ల వాటి ధరలు పెరగకపోవడంతో ద్రవ్యోల్బణం స్వల్ప స్థాయిలో ఉన్నదని తెలిసింది. ఎగుమతులు, దిగుమతుల పరిస్థితి కూడా ఆశాజనకంగా ఉందని సర్వే పేర్కొంది. 2002-03 ఏప్రిల్-సెప్టెంబర్ మధ్యకాలంలో ఎగుమతులు 13.5 శాతం పెరిగాయి. దిగుమతులు 8.5 శాతం పెరిగాయి. ఈ కాలంలో వాణిజ్య లోటు 430.3 కోట్ల డాలర్లుగా ఉంది. గత ఏడాది ఇదే కాలంలో వాణిజ్యలోటు 494.2 కోట్లు డాలర్లుగా ఉంది. విదేశీమారక నిల్లవు కూడా గత మార్చి నుంచి ఇప్పటివరకు 1200 కోట్ల డాలర్లు పెరిగి 6600 కోట్ల డాలర్లకు చేరుకున్నాయి. 2002 ఏప్రిల్-ఆగస్టు మధ్యకాలంలో 135.8 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు లభించాయి. గత ఏడాది ఇదే కాలంలో 146.9 కోట్ల డాలర్ల కన్న ఇది కొంచెం తక్కువ. ఇన్వెస్టర్స్ సెంటిమెంట్ బలహీనంగా ఉండటం, స్టాక్ మార్కెట్ చురుకుగాలేకపోవడం దీనికి కారణాలని సర్వే పేర్కొంది. మొత్తంగా చూసుకున్నప్పుడు ఆర్థిక వ్యవస్థ పరిస్థితి ఆశాజనకంగా ఉన్నట్లు సర్వే చిత్రించింది.

కాని అందరూ ఎదురుచూస్తున్నది ఈ అంకెల కోసమే కాదు. ప్రభుత్వం ఎటువంటి విధానపరమైన మార్పులు చేపట్టనున్నది అన్నదే ముఖ్యమైన విషయం. సరళీకృత విధానాలు, సంస్కరణల విషయంలో ప్రభుత్వం ఏం చేస్తుందని కార్పొరేట్ వర్గాలు ఒకవైపున, సాధారణ ప్రజలు, కార్మికులు, రైతులు, ఉద్యోగులు, ఇతర కష్టజీవులు మరొక వైపున ఎదురుచూస్తున్నారు. అందువల్ల ఈ విషయాలకు సహజంగానే సర్వేలో ప్రాధాన్యత లభించింది. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచుకోవాలని చెప్పిన సర్వే దీనికి అవసరమైన చర్యలను కూడా సూచించింది. పన్ను వసూళ్ళను మెరుగుపరుచుకోవాలని, 'వ్యాట్'ను చేపట్టాలని కోరింది. వ్యయాన్ని తగ్గించుకోవడంలో సర్వే సూచించిన చర్యలు నిజంగా తీవ్రమైనవి. వ్యయ సంస్కరణల కమిషన్ సూచించిన విధంగా 23416 ప్రభుత్వ పోస్టుల రద్దును వేగంగా అమలు చేయాలని చెప్పింది. మార్కెట్ పరిస్థితిని బట్టి చిన్నపొదుపు మొత్తాలపై వడ్డీరేట్లను సవరించాలని కోరింది. పెన్షన్, ఇతర రిటైర్‌మెంట్ బెనిఫిట్లను కూడా హేతుబద్ధం చేయాలని చెప్పింది. ఆహార, ఎరువుల, ఎల్.పి.జి., కిరోసిన్ సబ్సిడీలను తగ్గించాలని సూచించింది. ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రభుత్వ రంగ సంస్థల విక్రయాలద్వారా రూ. 12,000 కోట్లు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకొంటే ఇప్పటికి వసూలయింది కేవలం రూ. 3022 కోట్లు మాత్రమేనని, దీనిని మరింత పెంచాల్సిన అవసరముందని పేర్కొంది. చిన్నతరహా పరిశ్రమలకు రిజర్వేషన్లు పారిశ్రామిక ఉత్పత్తి పెరుగుదలకు అవరోధంగా ఉన్నాయని, ఈ రంగానికి రిజర్వు చేయబడిన ఉత్పత్తుల్లోకి భారీ పారిశ్రామికరంగానికి కూడా అవకాశం ఇవ్వాలని అభిప్రాయపడింది.

కేల్కర్ ప్రతిపాదించిన విధంగా ఆదాయంపన్ను విషయంలో మార్పులు చేస్తున్నట్లు చెప్పకపోయినప్పటికీ మిగతా విషయాల్లో మాత్రం కేల్కర్ నివేదిక మాదిరిగానే ఈ సర్వే పని చేసింది. ప్రభుత్వ విధానాలపై మధ్యతరగతి వర్గాలలో రగులుతున్న అసంతృప్తిని తగ్గించడానికి 'మధ్యతరగతి వర్గాల జేబుల్లోకి అదనపు డబ్బు' చేరేలా చేయడమే తన విధానమని జస్వంత్‌సింగ్ ప్రకటించారు. కేల్కర్ నివేదిక ఆ ప్రకటనకు విలువ లేకుండా చేసింది. అయితే ఈ సిఫార్సులను అంగీక రిస్తున్నట్లు చెప్పినప్పటికీ, సబ్సిడీల కోతపై సర్వే పేర్కొన్న వివరాలు రైతాంగంలోను, మధ్యతరగతి ప్రజానీకంలోనూ గుబులు పుట్టించాయి. ఓ వైపున గుజరాత్‌లో కొద్ది రోజులలోనే ఎన్నికలు జరుగనుండగా వెలువడిన ఈ సర్వేరేట్ల బిజెపి నాయకులు సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనితో ఆ మరుసటి రోజే ఆర్థికశాఖ కార్యదర్శి వివరణలకు పూనుకున్నారు. ఏదేమైనప్పటికీ మధ్యంతర సర్వే ప్రభుత్వ ఆలోచనా ధోరణిని స్పష్టం చేసింది. మధ్యంతర సర్వేతో ఇంత హడావుడి చేసిన ఆర్థికమంత్రి ఏటా బడ్జెట్‌కు ముందు వివిధ సెక్షన్ల ప్రజానీకపు ప్రతినిధులతో జరిపే చర్చలకు మంగళం పాడటం ఈ ధోరణికి అద్దం పడుతుంది. కార్పొరేట్ రంగం, ట్రేడ్ యూనియన్, రైతులు, ఆర్థిక వేత్తలు, సీనియర్ ఎడిటర్లతో జరిపే చర్చలను ఆర్థిక మంత్రి ఈ ఏడాది రద్దు చేశారు. బడ్జెట్ రూపకల్పనలో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నాయని చెబుతూ దానిలో భాగమే మధ్యంతర సర్వే విడుదల అని పేర్కొన్న ఆర్థిక మంత్రి అప్రజాస్వామికధోరణిని ఈ చర్చల రద్దు నిరూపిస్తున్నది. ఈ మధ్యంతర సర్వే రాబోయే బడ్జెట్‌కు సూచిక అని భావించవద్దని ఆయన చెబుతున్నప్పటికీ సాధారణ, మధ్యతరగతి ప్రజానీకంలో గుబులు తగ్గడం లేదు. ❒

కారు ఎంత విలాసం ?

ప్రతి వెయ్యి మందికీ కారున్న వారి సంఖ్య

భారతదేశం	4
థాయిలాండ్	35
బ్రెజిల్	92
దక్షిణ కోరియా	187
పాశ్చాత్య దేశాలు	450 - ఆ పైన

ఒక కారు కొనాలంటే సగటు ఉద్యోగి

భారతదేశంలో 28 నెలల రాబడి ఖర్చుపెట్టాలి.

థాయిలాండ్‌లో 16 నెలల రాబడి ఖర్చుపెట్టాలి.

మలేషియాలో 8 నెలల రాబడి ఖర్చుపెట్టాలి.

అమెరికా, పశ్చిమ యూరప్‌లలో 2-3 నెలల రాబటి పెట్టాలి.

గుజరాత్ ఫలితాలు - భవిష్యత్తు

-ఎబికె ప్రసాద్

గుజరాత్ ఎన్నికల పేరిట బిజెపి సంఘ్‌పరివార్ ప్రభుత్వం సాధించిన 'విజయం' శవజాగరణ ఫలితం తప్ప మరొకటి కాదు. శ్మశాన శాంతికి అది విజయం కాని, సజీవ సమాజశాంతికి అది విజయం కాదని గుర్తించవలసిన అవసరం వచ్చింది. విభిన్న మతాలతో, భిన్న సంస్కృతులతో, విభిన్న భాషలతో, భిన్న భాషా, మత మైనారిటీలతో, జాతులతో, ఉపజాతులతో భాసిల్లుతున్న బహుళ సంస్కృతీ విభవాన్ని హైందవం పేరిట (నిజానికి 'హిందూ' పదం కూడా మనది కాదు, పర్షియన్లు సింధూనదీ తీరానికి చేరుకున్నప్పుడు "స"కారం వారికి పలకదు కాబట్టి "హ" కారం తగిలించి "సింధు" ను "హిందు' గా మార్చారు) గాంధీ హంతకులైన సంఘ్ పరివార్ భ్రష్టుపట్టిస్తున్నదాని ఫలితమే భాషా, మత మైనారిటీల పట్ల వారు పెంచదలచిన వైషమ్యమూ, ద్వేషమూ. గుజరాత్ ఎన్నికల్లో బిజెపి పరివార్ 'విజయానికీ నాజీ జర్మనీలో హిట్లర్ ఎన్నికల్లో అబద్ధాలపైన అకృత్యాలమాటున, యూదుజాతి పట్ల విషం కక్కి ప్రజల్ని మతం మత్తు మాయ మందెక్కించడం ద్వారా సాధించిన విజయానికి తేడా లేదు. నాజీలకు కావలసింది అధికారం ఇక్కడ సంఘ్ పరివార్‌కు కావలసిందీ బిజెపిని అధికారంలో నిలబెట్టడమే. మతాన్ని అధికార సాధనకోసం హిట్లర్ వాడుకున్నాడు. ఇక్కడ పరివార్ ఉన్మాదులూ మతాన్ని అందుకే వాడుకున్నారు. అయినా సరే వారికి ఎన్నికల్లో గెలుపు ఎలా సాధించామన్నది ప్రధానం కాదు. ఎలాగైనా సాధించాలన్నదే, ఏ అడ్డ దారుల్లో అయినా సరే గెలుపు సాధించాలన్నదే ధ్యేయం. అందుకోసం హిట్లర్ నాడు జర్మనీలో "రీచ్‌స్టాగ్" భవనానికి (పార్లమెంటు) తన అనుయాయులతో నిప్పు పెట్టించి, ఆ పాపాన్ని సోషలిస్టులపైకీ, కమ్యూనిస్టుపైకీ రుద్దబోయి అభాసుపాలయ్యాడు. చరిత్ర హీనుడయ్యాడు. ఇక్కడ సంఘ్‌పరివార్ కూడా "గోధ్రా" రైలు బోగీ దహనకాండ (ఎస్-6 బోగీ జర్మనీలో 'రీకస్టాగ్' దహనమంత ప్రసిద్ధిలోకి వచ్చేసింది) పేరిట గాంధీ గుజరాత్‌నే కాదు, యావద్భారత మతాతీతలౌకిక (సెక్యులర్) వ్యవస్థనే భ్రష్టుపట్టించ జూచింది. తద్వారా గాంధీ గుజరాత్‌కూ, "గాడ్సే" ముఠాకూ మధ్య తేడాను చెరిపేసింది. గాంధీని పాతేసి, గాడ్సేను పునరుద్ధరించింది పరివార్!

తలకెక్కిన మత్తులో.....

గుజరాత్ ఎన్నికల ఫలితం ఎక్కువ కాలం నిలవదు. ఎందుకంటే పరివార్ వివేకానంద హైందవ సహన సంస్కృతినీ, గాంధీ అహింసా సంస్కృతినీ చెరిపివేసి, ముస్లిమ్, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, జైన మత విశ్వాసాలపైన దాడులను పరివార్ ఆపుకొనలేదు. ఎందుకని? పరివార్ సంస్కృతి హిట్లర్ పూజించిన 'ఆర్య' సంస్కృతినుంచే పుట్టుకొచ్చింది. కాబట్టి పరివార్ 'పురోహితుడై'న సావర్కార్ ఆర్య సంస్కృతినే 'బ్రాహ్మణ' సంస్కృతిగా భావించి (బ్రాహ్మిణిజం) బ్రాహ్మణ సంస్కృతినే హిందూ సంస్కృతిగా అభివర్ణించి పోయాడు. కాబట్టే మత, భాషా మైనారిటీలన్నీ ఈ సంస్కృతికి లోబడి జోహుకుం అనేదాకా పరివార్ దాడులు ఆగలేదు, ఆగబోవు! ఇందుకుగాను, పరివార్ నాజీలు చేస్తున్నపని దళితుల్ని ఆదివాసులనూ ముస్లిం, క్రైస్తవ మైనారిటీలపైన దాడులకు పురిగొల్పడం. అందుకనే, గోధ్రా ఘటనను, ఆ తరువాత మైనారిటీల ఊచకోతలనూ గుజరాత్ పర్యటనలో "సిగ్గుమాలిన" చర్యలుగా ప్రకటించిన ప్రధాని వాజ్‌పేయి "గోధ్రా ఘటన తర్వాత నేను ఏ ముఖం పెట్టుకొని విదేశాలలో పర్యటించేది" అని ప్రకటించిన వాజ్‌పేయి గుజరాత్ ఎన్నికల తర్వాత "సిగ్గు" విడిచేశారు. దిలాసాగా "ముఖం" చూపిస్తున్నారు! అమెరికన్ ఇండియన్‌గా ఏనాడో నమోదైపోయి విదేశాల్లో "విశ్వహిందూ పరిషత్" పేరిట దండిగా నిధులు వసూలు చేసి సమర స్వభావానికి పెద్దపీట వేసిన హైందవాన్ని గాకుండా మత విద్వేష ప్రచారానికి అండగా నిలబడుతున్న పరివార్ నాయకుడు (ఎన్.ఆర్.ఐ) తొగాడియా, సంఘ్‌పరివార్ గుజరాత్ ఎన్నికల ఫలితాలను ఆసరా చేసుకుని రెండేళ్ళలో హిందూరాష్ట్ర స్థాపన గురించి ప్రగల్భాలు పలుక సాగారు. భారతీయ బహుళ సంస్కృతికి భిన్నమైన ఈ తప్పుడు ప్రకటనలను ఖండించేది పోయి, ప్రధాని వాజ్‌పేయి విచిత్రమైన వాదనలకూ వ్యాఖ్యానాలకు దిగారు.

తొగాడియా ప్రకటన ప్రకారం "గుజరాత్‌లో ఎన్నికల ఫలితాల తర్వాత ఊచకోత ప్రక్రియను మిగతా భారతంలో కూడా ప్రారంభిస్తారా అన్న ప్రశ్నకు "మరి గోధ్రా కూడా పునరావృతం అవుతుందా" అని ఎదురు ప్రశ్నించారు! నిజానికి గోధ్రా ఘటన లేదా గోధ్రా ప్రక్రియను ప్రారంభించి పరివార్, దానిని ఒక ప్రయోగంగా రాజకీయ ప్రక్రియగా ఉత్తరోత్తరా యావద్భారతంలో వాడకంలోకి తేవడానికి ఆరంభం చేసిందీ పరివారే. దాని పూర్వ రంగంలో ఆ తరువాత మైనారిటీల ఊచకోతలకు అంకురార్పణ చేసిందీ పరివారే. ఈ నగ్నసత్యం దాచినా దాగని సత్యమని మరవరాదు! ఈ రోజుకీ గోధ్రాలో సబర్మతీ రైలు "ఎస్-6" బోగీని ఫిబ్రవరి 27న (2002 సంవత్సరం) కాల్చడానికి మూడు రోజుల ముందు నుంచీ (ఫిబ్రరి 24 నుంచి ఫిబ్రవరి 26 దాకా) అదే గోధ్రా రైలులో పరివార్ ఏతప్పుడు పనులకు పూనుకున్నదీ తెలుసుకుంటే తప్ప

వాజ్‌పేయి ప్రశ్నకు (గోద్రా మరోసారి ఘటిల్లుతుందా?) తొగాడియా, సింఘాల్‌ల నాజీ వీరంగాలకు సమాధానం దొరకదు. అసలు గోద్రాలో సబర్మతీరైలు అసలు ఎస్-6బోగీకి నిప్పు ఎవరంటించారు? ఎందుకంటించారు అన్న ప్రశ్నలకు ఆనాడే కాదు. అధికారికంగా సమాధానం లేదు. అంటే, ఆ దుర్ఘటన అంత పకడ్బందీగా చాపకింద నీరులా చేయగలిగారంటే అందుకు తగిన ఏర్పాట్లు ముందునుంచీ జరగనిదే ఇంతటి దుర్మార్గం జరగడానికి వీలు లేదు. ఈ సత్యాన్ని అనధికార సంస్కృతి. ప్రజాస్వామ్య సంస్కృతీ, ఎన్.జీ.వో సంస్కృతీ, మాజీ న్యాయమూర్తులూ, వారి ఆధ్వర్యంలో దుర్ఘటన ప్రాంతం, కల్లోల ప్రాంతాలు సందర్శించి వందలాది మంది హతుల కుటుంబాలను పరామర్శించి వచ్చిన సంఘాలూ, పౌరహక్కుల సంఘాలూ, న్యాయవాదుల సంఘాలూ కూడా వెల్లడించాయి. ఆలోచిస్తే స్వయంగా వాజ్‌పేయి కూడా గుజరాత్ పర్యటనలో "ఇన్నివేల మంది స్వదేశంలోనే శరణార్థులు కావడం దారుణం" అని వాపోవలసి వస్తోంది. అయితే గుజరాత్ నుంచి బిజెపి సంస్థాగత సభలకు గోవా వెళ్లిన వెంటనే గొంతు మార్చేశారు. మెజారిటీ హిందువులకు, మైనారిటీ ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులూ లొంగిఉండవలసిందేనన్నారు. అంతకన్నా గుజరాత్ ఫలితాలతో 'తల తిరిగి'న అనామక తొగాడియా శస్త్రవైద్యుని హోదాలో భారతీయ సమాజానికి ఓ కొత్త "సర్జరీ"ని ప్రతిపాదించాడు! ఏమిటది? గుజరాత్‌లో లేచిన ఉప్పెన అక్కడికే పరిమితం కాబోవడం లేదు. మా లక్ష్యం ముస్లిములే కాదు. హిందూత్వను వ్యతిరేకించే వారందరికీ, సెక్యులర్ వాదులతో సహా మరణశిక్ష (చావు) తప్పదు అని తొగాడియా అంతర్యుద్ధ పిలుపిచ్చాడు! ఇలాంటి ఉన్మాద ప్రకటనలను ఇతనూ, ఇతడి తాలూకూ పరివార్ ముఠాలు గత రెండున్నర సంవత్సరాలుగా విడుదల చేస్తూనే వచ్చాయి. స్టెయిన్స్ కుటుంబం హత్యతో ప్రారంభించిన పరివార్ ఉన్మాదానికి ఊపిరి అంతా కేంద్రంలో బిజెపి ఉనికి వల్ల మాత్రమే వచ్చిందని గ్రహించాలి. ఈ సత్యాన్ని మరచిపోతే తొగాడియాల ఉన్మాద ప్రకటనలను ఎదుర్కోవలసిన అవసరాన్ని అంతర్యుద్ధ ప్రమాదాన్నీ ప్రజలూ, ప్రజాతంత్ర పక్షాలూ గుర్తించలేరు. వాజ్‌పేయి తొగాడియాను గోద్రా దుర్మార్గం పూర్వాపరాల గురించి ఏమీ తెలియని "నంగనాచుల్లా" మాట్లాడుతున్నారు. 2002 ఫిబ్రవరి 24 - ఫిబ్రవరి 26 తేదీల మధ్య గోద్రా నుంచి వెళ్లే, గోద్రా వచ్చే రైలు ప్రయాణాల్లో బోగీలలోని ప్రయాణీకులకు ఏం జరిగిందీ, ఫిబ్రవరి 27 సబర్మతీ ఎక్స్‌ప్రెస్ ఎస్-6 బోగీకి ఎవరు నిప్పంటించిందీ తెలియాలంటే ఆనాటి సాధికార జాతీయ పత్రికలలో వెలువడిన వార్తలు తెలుసుకోవాలి. గోద్రా రైలు బోగీకి (27న) నిప్పంటుకున్న ఘటన పట్ల ఆ దుర్మార్గంలో హతులైనవారి పట్ల, మైనారిటీలు "అవసరమైనంతగా విచారం వ్యక్తంచేయలేద"నీ "ఖండించలేద"నీ వాజ్‌పేయి ఇప్పుడు కొత్త వాదన లేవనెత్తాడు. ప్రధానమంత్రి స్థాయిలో బహుశా ఇంతకన్నా పచ్చి అబద్ధం, వక్రీకరణ మరొకటి ఉండబోదు. ఆనాడు ముస్లిం సంస్థలు, క్రైస్తవ సంఘాలు, ప్రజాజీవనంలోని అన్ని వ్యాపకాల వారూ, రాజకీయ పార్టీలవారూ, రాజకీయ పక్షాల వారూ, ఘాటుగానూ నిర్ద్వంద్వంగానూ గోద్రా ఘటనను ఖండించారు. నిజానికి విచారం వ్యక్తం చేయవలసిన పరివార్ ప్రభుత్వం 'గోద్రా' ఘటనకు కారకుల్ని పట్టి బంధించడంలోనూ, పూర్తి విచారణ జరిపించడంలోనూ ఎందుకు విఫలమైందన్నదీ ఆనాటికీ, ఈనాటికీ సమాధానం కోరుతున్న ప్రశ్నగానే మిగిలిపోయింది. స్టెయిన్స్ కుటుంబాన్ని హత్యచేయడంలో ప్రధాన నిందితుడైన దారాసింగ్‌ను పరివార్ భాగస్వాములై భజరంగ్ దళ్ కీర్తిస్తూ నినాదాలిచ్చి ప్రోత్సహించడాన్ని పత్రికలు ప్రకటించినా ఈ రోజుకీ బజరంగ్‌దళ్ చర్య తీసుకోలేదు. ఎందుకంటే "గోద్రా" విషయంలో ప్రధానిలాంటి వాడే "ఈ సంఘటనకు ఎవరు కారకులని" మనల్ని ఎదురు ప్రశ్నిస్తున్నాడు! ఫిబ్రవరి 27 గోద్రా ఘటనకు ముందు ఫిబ్రవరి 24, ఫిబ్రవరి 26న "సబర్మతీ"లో వెళ్ళిన ప్రయాణీకుల బాధలకు కారకులెవరో రైలులోపల జరిగిన ఆయా ఘటనల గురించి ఫిబ్రవరి 25న, ఫిబ్రవరి 27న బాధ్యతగల స్థానిక జాతీయ దిన పత్రికలు ప్రకటించిన నివేదికల ద్వారా విందాం. ఈ వినికిడి వాజ్‌పేయ్ తొగాడియా లకు కూడా చాలా అవసరం. అయోధ్య నుంచి వెలువడే ప్రముఖ హిందీ దినపత్రిక "జనమోర్చా" రిపోర్ట్‌లో (2002 ఫిబ్రవరి 24) యిలా వుంది :-

"ఖైల్సార్ (ఫైజాబాద్) ఫిబ్రవరి 24 : త్రిశూలధారులైన భజరంగ్ దళ్ కార్యకర్తలు ఈ రోజు ఉదయం సబర్మతి ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. వారు అయోధ్యకు వెళ్తున్నారు. అదే రైలులో ప్రయాణిస్తున్న డజన్ల కొద్దీ ముస్లిం ప్రయాణీకులను భజరంగ్ దళ్ కార్యకర్తలు భయోత్పాతానికి గురిచేశారు. బురఖాల్లోఉన్న ముస్లిం స్త్రీలను అమాయకులైన వారి పిల్లలనూ దళ్ కార్యకర్తలు వేధించారు. రైలు ఫ్లాట్‌ఫారమ్ మీద వేచివున్న ప్రయాణికుల్ని కూడా 'శ్రీరామ్' అంటారా లేదా అని వేధించ సాగారు. ఈ భయానక బెదిరింపుల నుంచి బయటపడడంకోసం కొందరు ముస్లిం ప్రయాణీకులు తమను హిందువులమని చాటు కోవలసి వచ్చింది. లక్నో నుంచి వస్తున్న సబర్మతీ ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కిన బజరంగ్‌దళ్ కార్యకర్తల సంఖ్య 2000 మంది అనీ, వారి వద్ద త్రిశూలాలు ఉన్నాయనీ ప్రత్యక్ష సాక్షుల కథనం (ఈ త్రిశూలాలను వేలసంఖ్యలో అంతకుముందే పరివార్ ముఠా నెలక్రితమే పంచి పెట్టిందని పత్రికా వార్తలు). ఈ భయానక వాతావరణాన్ని వారు దర్యాబాద్ స్టేషన్‌నుంచే సృష్టించారు. ఫలానా ప్రయాణీకులు ముస్లిం అని గుర్తుపట్టిన వెంటనే అతనిపైన నిర్దాక్షిణ్యంగా త్రిశూలాలతో దాడిచేసి అతణ్ణి ఇనుపకడ్డీలతో బాదారు. చివరికి అమాయక స్త్రీలనూ, పిల్లలను కూడా విడిచిపెట్టలేదు. ముస్లిం స్త్రీల బురఖాలను బలవంతంగా పీకేశారు, వారిని కొట్టారు, ఈడ్చారు. ప్లాట్‌ఫాంమ్‌పై రైలుకోసం వేచి వున్న ప్రయాణికుల్నీ ఇలాగే బాధించారు. ఈ భాగోతమంతా దర్యాబాద్, రుజౌలీ స్టేషన్ల మధ్య జరిగింది. ఈ అమానుషకాండను నిరసించిన ఒక యువకుడ్ని బజరంగ్‌దళ్ కార్యకర్తలు పత్రంగా-రోజగావ్ స్టేషన్లమధ్య ప్రయాణంలో ఉన్న రైలునుంచి బలవంతంగా బయటకు విసిరేశారు.

ఆరోజురాత్రి (ఫిబ్రవరి 24) 8 గంటల సమయంలో రుజౌలీ స్టేషన్‌కు రైలు చేరుకుంటున్న సమయంలో, గాయపడి రక్తసిక్తమై ఉన్న మహిళలు రైలునుంచి భీతికొద్దీ గబగబా బయటకు దూకేశారు.

బజరంగ్‌దళ్ కార్యకర్తలు కూడా రైలు దిగి ప్లాట్ ఫారంమీద నున్న ప్రయాణికుల్లో ముస్లిములను గుర్తించి వారి పైన దాడి చేశారు. అలాగే తఖియా బైరాన్ పూర్ స్టేషన్ సమీపంలో నివసిస్తున్న 50 ఏళ్ల మహ్మద్ అష్రఫ్‌ను త్రిశూలాలతో పొడిచే ముందు అతని పొడవాటి గెడ్డాన్ని పీకేశారు. ఖెల్సార్ పోలీస్ స్టేషన్ నుంచి పోలీసులు స్టేషన్‌కు చేరుకునే లోపు రైలు వెళ్లిపోయింది. స్టేషన్ ఇన్‌చార్జి ఆఫీసరులేడు, కాగా పోలీస్ స్టేషన్‌లో కేసు రిజిష్టర్ చేసుకునేవాడు లేడు".

అలాగే "గుజరాత్ టుడే" పత్రిక విలేఖరి యూనస్ గాంధీ మార్చి 7న బాధితులతో జరిపిన ఇంటర్వ్యూలో యిలా వివరించాడు.

"ఫిబ్రవరి 26 రాత్రి సబర్మతీ ఎక్స్‌ప్రెస్ ఫైజాబాద్‌నుంచి గోద్రాకు వెడుతోంది. ఆ రైలులో అక్బర్‌బేగ్ సిరాజుద్దీన్ షా తన మామగారితోనూ, భార్యతోనూ కలిసి ప్రయాణిస్తున్నాడు. చీపుళ్ళు తయారుచేసి అమ్ముకోడం వీరి వృత్తి. ప్రయాణంలో తన అనుభవాల్ని షా ఇలా చెప్పాడు. 'ప్రయాణంలో మా బాధలు చెప్పనలవి కావు. ఫైజాబాద్‌లో ఎక్కింది మొదలు అనేక సమస్యలు ఎదురయ్యాయి. భయంతోనే బయలుదేరాం. రైలులోనూ బాధలు తప్పలేదు. ఎలాగోలా మమ్మల్ని అహ్మదాబాద్ చేర్చండి' అన్నాడా యువకుడు. రైలు ఎక్కిన 'కరసేవకులు' ప్రయాణం పొడుగునా ఎలా బెదిరించిందీ, ముస్లింలకు వ్యతిరేకంగా నినాదాలిస్తూ ఎలా వేధించారో తెలిపాడు. ముస్లిం ప్రయాణీకుల్ని కరసేవకులు పిడిగుద్దులు గుద్దారు. టీలు అమ్మేవారికి డబ్బులు చెల్లించలేదు. పైగా బండబూతులు, అశ్లీల నినాదాలు చేశారనీ, తన నొసటి పైన తిలకం పెడతావా లేదా అని, 'జై శ్రీరాం' అంటావా అనవా అని బలవంతం చేశారనీ షా చెప్పాడు. 18 ఏళ్ళ అక్బర్ బేగ్ వివాహితుడు. ఈ యువ దంపతులిద్దర్నీ కరసేవకులు కొట్టారు. ప్రయాణంలో ఉన్నవారిని అర్ధరాత్రి నిద్రలేపి, రైలు గొలుసులు లాగి రైలులోంచి బయటకు తోసేశారు. అలాగే పిల్లల్నీ బయటకు నెట్టేశారు. అనుక్షణం మృత్యు ముఖంలోనే గడిపామని షా చెప్పాడు."

ఫిబ్రవరి 27న ఏం జరిగింది?

ఇక ప్రముఖ జాతీయ దినపత్రికలలో ఒకటైన "ది హిందూ" గోద్రా ఘటన (ఫిబ్రవరి 27) పూర్వాపరాల గురించి యిలా పేర్కొంది.

"సబర్మతీ రైలులో ఫిబ్రవరి 27న 1200 మంది 'రామ్ సేవకులు, కరసేవకులు ప్రయాణిస్తున్నారు. ముస్లింల జనాభా ఎక్కువగా వున్న గోద్రా పట్టణంలో స్థానిక ప్రజల్ని ఈ రామ్ సేవకులు నానా దుర్భాషలాడి రెచ్చగొట్టారని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. ఇదే పనిని ఈ కరసేవకులు ఇదే రైలులో కొద్ది రోజుల క్రితం అయోధ్యకు వెడుతూ కూడా చేశారు. ఇక ఈ రోజు ఉదయం కూడా అదే రైలు గోద్రాకు వస్తున్న సమయంలో వీరు (తిరుగు ప్రయాణంలో కూడా) దుర్భాషలతో నినాదాలు చేశారు" ("హిందూ" ఫిబ్రవరి 28, 2002)!

అందువల్ల ఈ ఘటనలన్నీ అధ్యయనం చేసిన తర్వాత, ఇంతకూ సబర్మతీ రైలుకు గాడ్సే సాక్షిగా ఎవరు నిప్పెట్టిఉంటారో ఈ రోజుకీ పరివార్ నాజీ నరేంద్రమోడీ ముఠా తెలుపలేదు, తెలపదు చెప్పింది చేయడమే ("మరిన్ని గుజరాత్‌లు సృష్టిస్తాం")గాని, చేసింది చెప్పడం, ఒప్పుకోవడం అన్నది పరివార్ నాజీల నిఘంటువులో ఉండదు! పైగా బాధలకు వారినే నిందితులుగా మారుస్తూ చార్జిషీట్ల నాటకం ఆడారు. బాధలు పెట్టిన హంతకులకు చట్టం రక్షణ కల్పించింది! అదేమంటే నిప్పెట్టిన రైలుబోగీ ("ఎస్-6") లో చనిపోయిన వారంతా కరసేవకులని (58-59మంది) ఓ పెద్ద అబద్ధం అల్లి ఫిబ్రవరి 28 నుంచీ గుజరాత్ ముస్లింలపైన ఊచకోతలు కోయించి 2000 మందిని పొట్టన పెట్టుకున్నారు. సగానికి సగం జిల్లాల్లో వాళ్ళ ఆస్తి పాస్తుల్ని, మసీదుల్ని మద్రసాలనూ, సర్వమత సమభావనకు భారత దేశంలో దోహదం చేసిన సూఫీ ప్రవక్తల సదనాన్నీ కూల్చివేశారు. గృహ దహనాలు జరుగుతుంటే గుడ్లప్పగించి అటు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమూ ఇటు మోడీ ముఠా ప్రభుత్వమూ కూర్చున్నాయి. ఫిబ్రవరి 27న జరిపిన క్యాబినెట్ సమావేశం సందర్భంగా (ఫిబ్రవరి 28న కరసేవకులు గ్రీన్ సిగ్నల్‌గా) పోలీసు అధికారుల్ని బెదిరించి, 28న జరుగబోయే "బంద్" నాటక సందర్భంగా 'మీరేమీ జోక్యం చేసుకోవద్దు, పరివార్ కార్యకర్తలకు అడ్డురావద్దు' అని మోడీ స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు మంత్రివర్గ సభ్యుడైన పాండ్యా జస్టిస్ కృష్ణయ్యర్ కమిటీ ముందు స్వయంగా హాజరై వాంగ్మూలమిచ్చాడు! ఇప్పటికీ పరివార్ ఆగడాలు ఆగలేదు. దేశమంతటా "గుజరాత్"లు సృష్టిస్తామని ముస్లిం, క్రైస్తవ, సిక్కు మైనారిటీలను బెదిరిస్తూ వాగుతున్నారు. అందువల్ల గుజరాత్‌లో ఊచకోతల ద్వారా పరివార్ తలపెట్టిన ప్రయోగం, శవాల గుట్టల మధ్య సాధించిన 'విజయ' గర్వంతో దేశవ్యాపితం కాకముందే ప్రజాతంత్ర సెక్యులర్ రాజకీయ పక్షాలన్నీ గ్రామస్థాయివరకూ వెంటనే సమాయత్తం కావాలి. ఎందుకంటే, గాంధీజీ హత్య చేసిన ఆర్.ఎస్.ఎస్. ఉగ్రవాద కార్యకర్త నాథోరామ్ గాడ్సే తన సభ్యుడే కాదని ఈ రోజున అబద్ధమాడుతున్న పరివార్ 'గోద్రా' దుర్మార్గానికి దారితీసిన పూర్వరంగానికి పథకం ప్రకారం జరిగిన గోద్రా కవ్వింపు ఘటనకీ బాధ్యత వహించడానికి చస్తే ఒప్పుకోదు. ఉన్న ప్రమాదమంతా ఈ నాటకం లోనే ఉంది. ఒక అబద్ధాన్ని సృష్టించడంలో నేర్పుగల పరివార్ ఒక ఘటనను సృష్టించడంలో మాత్రం నేర్పరులు కారని ఎవరూ నమ్మలేరు. సబర్మతీ రైలుబోగీ ని ఎలా తగలబెట్టారన డానికి గుజరాత్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ 'నిపుణులు అసలు వాస్తవాన్ని ప్రయోగం ద్వారా నిరూపించేవరకూ పరివార్ అబద్ధాలాడు తూనే వచ్చింది. ఆ ఉన్మాదాన్ని మైనారిటీల మీదకునెట్టే ప్రచార ఊదరద్వారా మరునాడు ఊచకోతద్వారా తన ఉనికిని పరివార్ బలవంతంగా చాటుకుంది! ఈ తంతుకాస్తా ఫోరెన్సిక్ నిపుణుల ప్రయోగ నివేదికతో బట్టబయలయింది! బోగీని తగలబెట్టింది బయటనుంచి కాదనీ, బోగీలోకి చేరిన వారే ఈ పనికి దిగారనీ, బయటనుంచి పెట్రోల్ లేదా రసాయనం గానీ బోగీలోపలికి పోయాలంటే ప్లాట్‌ఫారానికి ఏడడుగుల ఎత్తుగా ఉండే బోగీలోకి పోయడం సాధ్యపడదని పోసినా హెచ్చుభాగం నేలపాలవుతుందనీ, అందుకే బోగీలోపలనుంచే దుండగులు ఈ పనిచేశారనీ ప్రయోగం ద్వారా నిపుణులు నిరూపించారు. దీంతో మోడీ ముఖం, పరివార్ ముఖాలు నాడే వాడి పోయాయి. నిపుణులపై కారాలు మిరియాలు నూరారు. కరసేవకులు తమ జనాన్ని తాము చంపుకుంటారా అని వాదనను పరివార్ ముఠా లేవనెత్తింది. కాని కేంద్రరైల్వేశాఖ అసలు "ఎస్-6" బోగీలో ప్రయాణించిన రిజర్వుడు ప్రయాణీకుల జాబితాను పార్లమెంటు

సభ్యుల వత్తిడివల్ల విడుదల చేయవలసి రావడంతో గుట్టుకాస్తా రట్టు అయ్యింది. సీట్లు రిజర్వుచేయించుకున్న ప్రయాణీకుల్లో సగానికి పైగా "బోగీలో ఘర్షణల" ఫలితంగా పక్క బోగీల్లోకి వెళ్లి పోయారనీ, నిప్పంటుకొన్న బోగీలో చనిపోయినవారు "నలుగురు మాత్రమే"నని రైల్వేశాఖ ప్రకటించింది! అయినా సరే స్థానిక పత్రికల "సహకారం"తో "కాలిపోయిన కరసేవకులు 58" మంది అని అంతకుముందు పరివార్ చాటుకున్న ప్రచారానికి రైల్వేశాఖ జాబితా తెరదించింది. ఇది మన వెంకయ్యానాయుడికి (బిజెపి అధ్యక్షుడు) గొంతులో వెలక్కాయ పడినట్టయి, రైల్వే శాఖనుకూడా మందలించే దశకు ఎదిగారు! అలాగే హోంమంత్రి అద్వానీ ఫోరెన్సిక్ రిపోర్టును "పట్టించుకోదగిన రిపోర్టు కాదని" చెప్పినా తరువాత ఒక సందర్భంలో మాట్లాడుతూ "బోగీని నేనూ చూశాను, మంటలు బోగీలోపలినుంచే వచ్చాయని ఎవరికైనా తెలుస్తుంది. అయితే ప్రజలు తమను తామే తగలబెట్టుకుంటారని దాని అర్థం కాదు" అన్నారు. (చూ: టైమ్స్ ఆఫ్ ఇండియా" జూలై 21/ 2002)!!

అంతేకాదు. "టైమ్స్" మరో కథనాన్ని కూడా నమోదు చేసింది. ఈ ఘటనకు సంబంధించిన ముగ్గురు నిందితులు తాము కోచ్‌లో ప్రవేశించి, దహించే పదార్థాన్ని పోశామని ఒప్పుకున్నారని గుజరాత్ పోలీసులు తెలిపారు" (టైమ్స్ ఆఫ్ ఇండియా" జూలై 15. "ది వీక్" జూలై 7/2002)! అయితే ఆ ముగ్గురి పేర్లను పోలీసులు బయటపెట్ట లేదు. ఆరోజుకీ, ఈరోజుకీ!

సమాధానాలు రాని ప్రశ్నలు :

అంతేకాదు, టైమ్స్ ఆఫ్ ఇండియా నేషనల్ బ్యూరో డిప్యూటీ చీఫ్, ప్రసిద్ధ పాత్రికేయుడు, ఆర్థిక నిపుణుడు అయిన సిద్ధార్థ వరదరాజన్, 'గోద్రా' ఘటనకు కారకులెవ్వరన్న ప్రశ్నకు యింతవరకూ సమాధానాలు దొరకకపోవడాన్ని ఆక్షేపిస్తూ గోద్రా పూర్వాపరాలను అనంతర ఊచకోతలను వివరిస్తూ తాజాగా "గుజరాత్ - ది మేకింగ్ ఆఫ్ ఎ ట్రాజడీ" అనే పుస్తకం రాశారు. అందులో ఆయన, సబర్మతీ రైలులో ఆనాడు ప్రయాణిస్తున్న "జీవనం కోసం కూలి పని చేసేందుకు అహ్మదాబాద్‌కు వెడుతున్న పేద, అమాయక కూలీల మరణానికి విశ్వహిందూ పరిషత్ (పరివార్) కార్యకర్తలే కారణమని గుజరాత్ రిజర్వుపోలీసు, రైల్వే రిజర్వు పోలీస్ చెప్పార"ని రాశారు. విశ్వహిందూ పరిషత్ తాలూకు కార్యకర్తల్ని ఈ పోలీసులు రక్షించనందుకు పోలీసులు మండిపడ్డారనీ రాశారు. అయితే చనిపోయిన 59 మందిలో తమతో కలిసి ప్రయాణించినవారు మాత్రం 38 మందిని పరిషత్ గుర్తు పట్టింది. ముగ్గురి జాడ తెలియదు. ఇక మిగిలిన 17 మందినీ ఎవరూ గుర్తుపట్టలేకపోయారు. వీళ్లు ఉత్తరప్రదేశ్ కూలీలా?" అని సిద్ధార్థ ప్రశ్నించాడు.

అయితే "గుర్తుపెట్టుకోవలసిన అసలు విషయం" గురించి సిద్ధార్థ ఆ గ్రంథంలో ఇలా నమోదు చేశాడు. "ఎస్-6 బోగీలో సీట్లు రిజర్వు చేసుకున్న రిజర్వుడ్ ప్యాసింజర్‌లలో ఒక్కరి పేరుకూడా రిజర్వుడ్ ప్రయాణీకుల జాబితాలో గానీ, లేదా చనిపోయిన లేదా క్షతగాత్రుల జాబితాలోగానీ లేదు" (పే. 57, సిద్ధార్థ వరదరాజన్ పుస్తకం, డిసెంబర్ 2002, పెంగ్విన్)!! అంటే మైనారిటీల ప్రయాణీకుల్ని వేధింపులకు గురిచేసే ఉద్దేశంతోనే కరసేవకులు రిజర్వుడు కంపార్ట్‌మెంటులోని ప్రయాణీకుల్ని బలవంతంగా మరో బోగీలోకి పంపడానికి మొదటిదఫా, గొలుసు లాగినపుడు ప్రయత్నించి ఉండాలి. రెండవ దఫా గొలుసు లాగి బండిని ఆపినపుడు బోగీ దహనకాండకు ఏర్పాట్లు పకడ్బందీగా జరిగి ఉంటాయని విశ్లేషకుల భావన! అయితే 59 మంది కరసేవకులు చనిపోయారన్న ప్రచారాన్ని వ్యాప్తిచేసి అందుకు స్థానిక "సందేశ్" "గుజరాత్ సమాచార్" గాసిప్ పత్రికల ద్వారా ప్రచారం చేయించి, ఫిబ్రవరి 28 నాటి ఊచకోతకు పరివార్ పథకం సిద్ధంచేసింది! అలాగే అంత పకడ్బందీగా "ఎస్-6" బోగీ వాక్యూమ్‌లను పైపును ఎవరు తెంపేసి ఉంటారు అని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ కూడా ప్రశ్నించింది. అలాగే జస్టిస్ నానావతి కమిటీ ముందు గుజరాత్ పౌరహక్కుల కేసులు వాదించే ప్రముఖ న్యాయవాది అమ్రిష్ పటేల్ వాంగ్మూలమిస్తూ, సేవకులు చేసిన పనుల్ని గుర్తించకుండా జాగ్రత్తపడడం కోసం చేసిన పని 4 బోగీలనుంచి ఒకే సమయంలో చైన్స్ (గొలుసులు) లాగారనీ, కాని ఈ కోచీలు అయోధ్య నుండి వస్తున్న కరసేవకులతో నిండి ఉన్నందున గొలుసులు లాగడానికి కారకులైన వారిని రైలు ఇంజన్ డ్రైవర్లు గుర్తుపట్టలేకపోయారనీ చెప్పారు! ఇక మళ్ళీ అదే ప్రశ్న? "ఎస్-6" బోగీ నిప్పంటించినవారెవరు? ఈ ప్రశ్ననే వాజ్‌పేయి వేస్తున్నారు! మనమూ అదే ప్రశ్న వేస్తూనే సూక్ష్మంగా విశ్లేషించుకోవలసి వస్తోంది! సరిగ్గా ఇదే సమయాన్ని సందర్భాన్ని ప్రస్తావిస్తూ "వాషింగ్టన్ పోస్ట్" విలేకరి రాజీవ్ చంద్రశేఖరన్ గుజరాత్ అధికారులనూ, ప్రత్యక్ష సాక్షుల్నీ గుచ్చి గుచ్చి ప్రశ్నించిన తరువాత నివేదిక సమర్పించాడు. "గోద్రా ఘటనకు దారితీసిన కవ్వింపు చర్యలు, అంత బలంగానూ వచ్చిన ప్రతిస్పందన" గురించి రాస్తూ రాజీవ్ చంద్రశేఖరన్ ఇలా వివరించాడు! రెండు రోజులుగా సబర్మతీ ఎక్స్‌ప్రెస్ ఉత్తర భారతం మీదుగా ప్రయాణిస్తున్నంతసేపూ ఎస్-5, ఎస్-6 బోగీల్లో చేరిన హిందూ కరసేవ కార్యకర్తలు ప్రయాణీకుల పాలిటి గూండాలుగా వ్యవహరించారు. తోటి ప్యాసింజర్లందరూ ఈ భాగోతం కళ్ళారా చూశారు. కరసేవకులు ముస్లిం, స్త్రీల బురఖాలను పీకేశారు. "రామ్" పేరు జపించడానికి నిరాకరించినందుకు అర్ధరాత్రి నలుగురు కుటుంబ సభ్యుల్ని బోగీలోంచి దించేశారు. కొన్ని టీలకు కూడా కరసేవకులు డబ్బులివ్వలేదు. ఇక రైలు ఫిబ్రవరి 27న ఉదయం పశ్చిమ భారతంలోని నగర ప్రవేశంచేయబోయేముందు ఈ రౌడీలు విజృంభించేశారు. ఈ రౌడీలు తిన్నతిండికి డబ్బులు తమకు చెల్లించకుండా ఎగ్గొట్టినందుకు పదార్థాలు సప్లయి చేసే వెండర్లలో ముస్లిం యువకులు గోద్రాస్టేషన్ వద్ద రైలును ముట్టడించారు. ఇంతగాథ గోద్రా వెనుక దాగి ఉండగా, సత్యాన్ని ఒప్పుకోవడానికి కనీసం క్షమాపణ చెప్పుకోవడానికి వెరసీ పరివార్ నాజీలు మనదేశంలో పాలకులుగా ఉండడానికి వీల్లేదని చాటవలసిన రోజు వచ్చింది. వివేకానందస్వామి బోధించిన హైందవం వేరు, అది బహుళ సంస్కృతీ సమ్మేళనం. అధికారానికీ, పదవులకూ, అధికార తాపత్రయానికీ వ్యతిరేకం. కాగా పరివార్ 'నాజీ' సంస్కృతి పూర్తిగా హైందవ సంస్కృతి విరుద్ధం, "హిందూత్వ" పేరిట అందలాలు ఎక్కడానికి పరివార్‌కు ఉపయోగించే ఓ రాజకీయ తంత్రం! బహుపరాక్! ❒

సంస్కరణల సేద్యంలో పేదరికపు పంట!

- డి. పాపారావు

పేదరికాన్ని కొలిచేందుకు, వాడే కొలబద్దల విషయంలో ఆర్థిక శాస్త్రవేత్తల మధ్య ఏకాభిప్రాయంలేదు. అయితే, ఏదో ఒక కొలబద్దను ప్రామాణికంగా స్వీకరించకుండా మనం పేదరికాన్ని అంచనా వేయలేము. అందుచేత అంతర్జాతీయ దారిద్ర్యరేఖ కొలబద్ద అయిన రోజుకు ఒక డాలరులోపు (1993 సం॥ కొనుగోలు శక్తి మారకం ఆధారంగా) ఆదాయంవున్న వారిని దారిద్ర్య రేఖ దిగువవున్న వారిగా పరిగణనలోకి తీసుకుంటూ మన పరిశీలనను సాగిద్దాం. దీని ప్రకారంగా భారతదేశంలో సంస్కరణల అనంతర కాలంలో, అంటే 1990వ దశకం ఆరంభం నుంచి పేదరికం తీరు తెన్నులను మనం ఈ కొలబద్ద ఆధారంగా పరిశీలన చేయవచ్చు. గౌరవడాల్ మార్టిన్ రెవెలియన్‌ల పరిశోధనల ప్రకారంగా 1990 దశకపు సంస్కరణల కాలంలో భారతదేశంలో పేదరికం తగ్గలేదు. వాస్తవానికి తొలినుంచి గ్రామీణాభివృద్ధి, మానవ వనరుల అభివృద్ధి తక్కువగా వున్న రాష్ట్రాలలో ఆర్థిక అభివృద్ధి అనబడే దాని ప్రభావం పేదరికంపై సానుకూలంగా లేదు. అయితే భారతదేశంలో పేదరికం నిర్మూలనకు ఆర్థిక అభివృద్ధి అనేది కేవలం ఒకానొక అంశంగా మాత్రమే వున్నది. కాబట్టి భారతదేశ ఆర్థిక వ్యవస్థలో స్థూల జాతీయ ఉత్పత్తి గురించిన ఎన్ని కాకిలెక్కలు చెప్పినా, అవి అన్నీ దేశంలో పేదరికం స్థాయి తగ్గిందనటాన్ని నిరూపించలేవు.

ఆదాయపరంగా ప్రపంచంలోని పేదవర్గాలలోని అత్యధిక సంఖ్యాకులు భారతదేశంలోనే నివసిస్తున్నారు. (రోజుకు డాలరు లోపు ఆదాయం కలవారి కొలబద్ద ప్రకారంగా) 1990 వ దశకం మధ్యకాలపు లెక్కల ప్రకారంగా, ప్రపంచంలోని అత్యంత నిరుపేదలలో 1/3వ వంతు వరకు భారతదేశంలోనే వున్నారు.

1960, 1970 దశకాలలో స్థూల జాతీయ ఉత్పత్తి పెరుగుదల రేటు సాలీనా 3.4% వుంది. అంటే తలసరి ఆదాయం వార్షిక ప్రాతిపదిక 1% మాత్రమే పెరిగింది. కాగా 1980 దశకం మధ్యభాగం నుంచి జాతీయ ఉత్పత్తి పెరుగుదల రేట్లు సరాసరిన గణనీయంగా వుండటం గమనార్హం కాబట్టి, మొత్తం మీద 1990వ దశకపు ముందస్తు కాలపు ఆర్థిక ఎదుగుదల భారతదేశంలో పేదరికం తగ్గింపుదిశగా సాగింది. 1958-1991 కాలంలో జాతీయ ఆర్థికాభివృద్ధి వలన పేదరికం రేఖ దిగువన వున్నవారు లబ్ధిపొందారనేది నిర్వివాదం. అంతే కాకుండా, 1990వ దశకపు ముందుకాలంలో ఆర్థికాభివృద్ధితో పాటుగా ఆర్థిక వ్యత్యాసాలు కూడా పెరిగి పోయాయి అనటానికి దాఖలాలు లేవు. అయితే 1990వ దశకం మాత్రం ఈ విషయంలో గందరగోళానికి, వివాదాలకు తావుకల్పించింది. కొందరు ఆర్థిక వేత్తల అభిప్రాయం ప్రకారంగా, ఆదశకంలో పేదరికం, భారీగా తగ్గింది. (భల్లా, 2000) కాగా మరికొందరి అభిప్రాయంలో పేదరికం స్థాయిలో మార్పులేదు. వాస్తవానికి పేదరికం ఇంకా పెరిగి వుండవచ్చుకదా. (సేన్, 2001) అయితే, వాస్తవానికి జరిగిందేమిటి అన్నది ఇక్కడ మనం పరిశీలించాలి.

భిన్న గణాంకాల సేకరణ :

భారతదేశంలో ఆర్థికాభివృద్ధికి సంబంధించి రెండు భిన్న గణాంక వివరాల సేకరణలు వున్నాయి. వీటిలో ఒకటి జాతీయ నమూనా సర్వే. రెండవది జాతీయ అకౌంట్ల విభాగపు సర్వే. ఈ రెండు సర్వేలను ఉపయోగించుకొని మాత్రమే మనం సరియైన నిర్ధారణకు రాగలం. జాతీయ అకౌంట్ల సర్వే లాభాపేక్ష లేని సంస్థల వ్యయాన్ని, గృహవినియోగాలతో పాటుగా కొలుస్తుంది. కాగా జాతీయ నమూనా కేవలం గృహ వినియోగాన్ని మాత్రమే పరిగణనలోనికి తీసుకొంటుంది. అలాగే జాతీయ అకౌంట్ల సర్వే ఆర్థిక సేవలు, ఇంటి అద్దెలకు అయ్యే వ్యయాన్ని కూడా పరిగణనలోని తీసుకొంటుంది. యిపుడు ఒకమారు వెనక్కి తిరిగిచూస్తే ఈ రెండు సర్వేలమధ్య వైరుధ్యం పెరగటం స్పష్టంగా కనబడుతుంది.

జాతీయ నమూనా సర్వే వినియోగానికి సంబంధించిన అంచనాలను తక్కువగా వేయటం ఒక్కటే, జాతీయ అకౌంట్ల సర్వేతో దానితేడాకు ఏకైక కారణం కాదు. ఉదాహరణకు, పేదల ఆదాయ వినియోగంలో 60% మేరకు ఆహారానికే ఖర్చు అవుతుంది.

కాగా, మనం జాగ్రత్తగా పరిశీలిస్తే జాతీయ నమూనా సర్వే, సర్వేచేసే తీరులో 1990-2000 సం॥ల మధ్య తేడా వచ్చిందని గుర్తించవచ్చు. ఈ తేడావలన, ఆ సర్వే తాలూకు గణాంక వివరాలు ప్రశ్నార్థకంగానే మారుతున్నాయి. 1950వ సంవత్సరంలో సర్వేలను ఆరంభించినపుడు ఎన్.ఎస్.ఎస్. వినియోగానికి సంబంధించి 30 రోజుల కాలాన్ని పరిగణనలోకి తీసుకొంది. కాగా 1994-1995 సం॥ నుంచి రెండు భిన్న భిన్న నమూనాలకు ఎన్.ఎస్.ఎస్. రెండు భిన్న తరహాల వినియోగ తీరులను కొలబద్దగా తీసుకొంది. ఒక నమూనాకు 30 రోజుల కాలాన్ని, మరో నమూనాకు 7 రోజుల కాలాన్ని కొలబద్దగా తీసుకొంది. ఆహారం, పాన్, పొగాకు, మత్తు పదార్థాలకు సంబంధించి 7 రోజుల కాలాన్ని కొలబద్దగా తీసుకొంది.

వంట చెరకు, దీపాలు మొదలైన వాటికి సంబంధించి 30 రోజుల వినియోగ కాలాన్ని పరిగణనలోనికి తీసుకొంది. ఇక విద్య, వైద్యం, దుస్తులు, పాదరక్షలు వంటి వాటికి సంబంధించి 365 రోజుల కాలాన్ని పరిగణనలోనికి తీసుకొంది. అయితే 1999-2000 సం॥ గాను ఎన్.ఎస్.ఎస్ సర్వే మరింత ఆందోళనకరమైన తీరులో కూడా వ్యవహరించింది. ఆ కాలానికి సంబంధించి ఒకే తరహా గృహస్తులకు ఆహార వినియోగానికి సంబంధించి రెండు రకాల నమూనాలను స్వీకరించింది.

(7రోజులు మరియు 30రోజులు:ఈ రెండు నమూనాలు)

ఈ రెండు నమూనాలకు సంబంధించిన ఒకే ప్రశ్నాపత్రంలో ప్రశ్నలను ప్రక్కప్రక్కన వుంచింది. దీనివలన, ఆ రెండు నమూనాలకు సంబంధించి గృహస్తుల జవాబులు ఒకేరీతిలో వచ్చే అవకాశం పెరిగింది. 1999-2000 సం॥లకు గాను ఎన్.ఎస్.ఎస్. సేకరించిన గణాంక వివరాలను విశ్లేషించగా వచ్చే వివరాలు 7 రోజుల కాలానికి ఒక రకంగాను, 30 రోజుల కాలానికి ఒక రకంగాను (ఆహార పదార్థాల విషయంలో) వుండే అవకాశం వుంది. 30 రోజుల కాలాన్ని పరిగణనలోకి తీసుకుంటే (ఇతర తేడాలను విస్మరించి) దేశంలో పేదరికం తగ్గినట్లుగా కనబడుతుంది. ఈ లెక్కల ప్రకారమే ప్రణాళిక సంఘం (2001) దేశంలో పేదరికం స్థాయి 1993-94, 1999-2000 సం॥ల మధ్య 36% నుంచి 26% తగ్గిందని చెబుతుంది. మరోప్రక్క 7 రోజులు కాలాన్ని పరిగణనలోకి తీసుకుంటే గ్రామీణ పేదరికం 2% పెరిగినట్లు, నగరప్రాంతపేదరికం 5%పెరిగినట్లు కనబడుతుంది.

వాస్తవ ధోరణి యిలా వుంది :

మొత్తం మీద భారతదేశంవంటి విశాలమైన దేశంలో ఏ గణాంక వివరాలనైనా వివిధ ప్రాంతాల విడివిడి అంకెలు లేకుండా పరిశీలించలేము. ఈ రకంగా చూస్తే 1990వ దశకంలో ప్రాంతీయ అసమానతలు బాగా పెరిగాయి. అంతేకాకుండా భారతదేశానికి గ్రామాలు ఆయువుపట్టు వంటివని మరువరాదు. ఈ గ్రామీణ ప్రాంతాలలో స్థూల జాతీయ ఉత్పత్తి పెరుగుదల మొత్తం దేశీయ స్థూల, జాతీయ ఉత్పత్తులతో పోలిస్తే సగానికి సగంగా వుంది. 1993-94, 1999-2000 సం॥ల మధ్య భారతదేశపు స్థూల జాతీయ ఉత్పత్తి 6.7% పెరగగా, వ్యవసాయం, సంబంధిత రంగాలలో మాత్రం ఈ పెరుగుదల సాలీనా కేవలం 3.2% మాత్రంగానే వుంది. గ్రామీణాభివృద్ధిలోనూ, ముఖ్యంగా పేదరికం నిర్మూలనలో గ్రామ ప్రాంతాల అభివృద్ధి అంశాన్ని పరిగణనలోనికి తీసుకోకుండా వుండలేము. చారిత్రకంగా చూసినా, ఇతర దేశాలతో పోల్చినా మనదేశ గ్రామీణ ప్రాంతాలలోనే 'పేదరికం' ఎక్కువగా వుంది. 1960-90 సం॥ల మధ్య గ్రామీణ పేదరికం రేటు, పట్టణ ప్రాంత పేదరికంతో పోలిస్తే 1.1 - 1.2 గా వుంది. కాగా 1990వ దశకంలో ఈ తేడా పెరిగి 1.4కు చేరుకుంది. ఇక, రాష్ట్రాలవారిగా చూస్తే కేరళలో పేదరికం బాగా తగ్గింది. ఆ తరువాతి క్రమంలో అస్సాం, బీహార్ వున్నాయి. అయితే, మొత్తం మీద దేశంలోని అతిపెద్ద రాష్ట్రాలు జనాభా ఎక్కువగా వున్న రాష్ట్రాలలో పేదరికం తగ్గుదల అనేది, మొత్తం దేశవ్యాప్త పేదరికం తగ్గుదలలో కీలకాంశం కాగా, వాస్తవానికి ఈ రాష్ట్రాలలో పేదరికం తగ్గుదల (1990వ దశకంలో) జరగలేదు. దీనిని బట్టి 1990వ దశకపు సంస్కరణల కాలంలో పేదరికం తగ్గిందని కొన్ని సర్వేలు తెలపడం హాస్యాస్పదం.

సంస్కరణల కాలంలో వ్యవసాయరంగేతర అభివృద్ధి :

ఈ రాష్ట్రాలలో అభివృద్ధి నామమాత్రమే. ఇక వ్యవసాయ రంగంలో ఎదుగుదలకూడా ఈ రాష్ట్రాల్లో పేదలకు అనుకూలంగా లేదు. కాబట్టి బీహార్, మధ్యప్రదేశ్, ఒరిస్సా, ఉత్తర ప్రదేశ్ వంటి రాష్ట్రాలలో గణనీయమైన స్థాయిలో వ్యవసాయేతర, వ్యవసాయ రంగాలలో అభివృద్ధి అనేది, దేశవ్యాప్త పేదరికం స్థాయిలో తగ్గుదలకు కీలకం. కాని ఇలా జరగలేదు. మార్పులు చేసుకుని ఎన్.ఎస్.ఎస్. చేసిన సర్వేల ఫలితాలు, దేశంలో వాస్తవిక పేదరికస్థాయిని సూచించలేవు.

చారిత్రక తీరు తెన్నులను ఆసరాగా చేసుకొని పేదరికం స్థాయిలో మార్పులను ఒకసారి చూద్దాం. ఈ వివరాలు 1960-94 మధ్యకాలానివి. 1960, 70, 80వ దశకంలో జరిగిన తీరులోనే అభివృద్ధి జరిగివుంటే 1990వ దశకంలో పేదరికంస్థాయి గణనీయంగా తగ్గివుండవలసింది. 1993-94వ సంవత్సర కాలపు స్థాయి అయిన 39.1% నుంచి పేదరికం స్థాయి 1999-2000 సంవత్సరాల నాటికి 34.3% నికి తగ్గివుండవలసింది. అంటే ఇది వార్షిక రేటున 0.8 శాతం పాయింట్లమేరకు వుడాలి. ఈ తగ్గుదల గతకాలపు (సంస్కరణల ముందరి) తగ్గుదలకంటే ఎక్కువగానే వున్నట్లుగా భావించవచ్చు. కాగా వాస్తవానికి ఈ తగ్గుదల వివిధ అంచనాల ప్రకారంగా కేవలం 0.65 శాతంగా మాత్రమే వున్నది. (ఒకవేళ మనం వాటిని విశ్వసించినప్పటికీ). కాగా, 1990వ దశకంలోని స్థూలజాతీయ ఉత్పత్తి పెరుగుదల రేటుతో పోలిస్తే 0.8 శాతం పాయింట్ల వార్షిక పేదరికం తగ్గుదల కూడా తక్కువస్థాయిదే. దీనర్థం జాతీయ సంపద పెరుగుదలతో అధికభాగం ధనాధిక వర్గాలకే దక్కుతోంది. ఆర్థికాభివృద్ధి శాతంలో సంస్కరణల అనంతర కాలంలో పేదల వాటా తగ్గు ముఖం పట్టింది.

అభివృద్ధి పథంలో ఎందుకీ తేడాలు :

ఆర్థిక అభివృద్ధి అనబడేదాని ప్రభావం కొన్ని రాష్ట్రాలతో పేదరికంపై హెచ్చుగా వుండడానికి, ఇతర రాష్ట్రాలలో తక్కువగా వుండడానికి కారణం ఏమిటనే ప్రశ్న ఇక్కడ మనకు వస్తుంది. అభివృద్ధి క్రమం ఆరంభదశలో వున్న అసమానతల తీవ్రత దీనికి ఒక కారణం. రుణసదుపాయాల మార్కెట్లో వున్న లోపాలు మరో కారణం. అలాగే, ఇక నిరక్షరాస్యత, కనీస విద్యలేకపోవడం వేరొక కారణం. ప్రస్తుత ఉదారవాద ఆర్థిక విధానాలు ఈ సమస్యలకు సమాధానం ఇవ్వలేవు. దీనివలన దేశవ్యాప్తంగా చూస్తే పేదరికం పెరుగుదలతో పాటుగా, ప్రాంతీయ అసమాన తలు కూడా తీవ్రం అవుతున్నాయి.

గ్రామీణ పేదరికం :

1970, 1980 దశకాల కాలంలో గ్రామీణ పేదరికం గణనీయంగా తగ్గింది. 1973-74 సంవత్సరంలో 55%గా వున్న గ్రామీణ పేదరికం 1989-90 నాటికి 34% నికి తగ్గింది. అయితే 1990వ దశకంలో ఈ పరిస్థితి మారిపోయింది. ఈ కాలంలో గ్రామీణ పేదరికం స్థాయి అంతకు మునుపటి 34% నుంచి తగ్గకపోగా, అది పెరిగి పెరిగి 42% చేరుకుంది. కాగా, అధికారిక గణాంక వివరాలు మాత్రం భిన్నమైన కధనాన్ని వినిపిస్తున్నాయి. మార్కెట్లను సరళీకరించడం, విదేశీ పెట్టుబడులు మార్కెట్లోకి ప్రవేశించేందుకు వున్న నిబంధనలను సరళీకృతం చేయడం, ఎగుమతులను (ముఖ్యంగా వ్యవసాయ రంగంలో) ప్రోత్సహించ డం వలన ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, పేదరికం తగ్గుతుందని ఉదారవాద మార్కెట్ వ్యవస్థను సమర్థించేవారు చెబుతూ వచ్చారు. అయితే, కొద్దో గొప్పో తమకు అనుకూలం గానే సాగిన ఎన్.ఎస్.ఎస్ సర్వేలు సైతం దీనికి భిన్నమైన పరిస్థితిని సూచించడంతో వీరు ఇరకాటంలో పడుతున్నారు. అందుకే ఎన్.ఎస్.ఎస్ సర్వే నమూనా మరీ చిన్నదిగా వుందనీ, గ్రామీణ ప్రాంతంలో వినియోగస్థాయిని తక్కువగా అంచనా వేసిందనే కుంటి వాదనలు ముందుకు వస్తున్నాయి.

పేదల వినిమయ వస్తువులలో ఆహారం వాటా 60%గా ఉంటుందని ముందే చూసాం. ఈ పదార్థాల ధరలు 1990వ దశకంలో బాగా పెరిగాయి. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతు లను ప్రోత్సహించడం, ఆహార సబ్సిడీలపై తలసరి వ్యయాన్ని తగ్గించడం వంటి స్థూల ఆర్థిక వ్యవహారాలు దీనికి కారణం. దీనంతటి వలన తలసరి నిజ ఆహార వినియోగం పెరగకుండా ఉండి పోయింది. దీనివలన గ్రామీణ పేదరికం పెరిగింది. ఇక, గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాల కల్పన పరిస్థితి కూడా గ్రామ పేదరికాన్ని తగ్గించేందుకు సానుకూలంగా లేదు. మొత్తం జాతీయ ఆదాయంలో గ్రామీణ విభాగపు వాటా గణనీయంగా పడిపోయింది. దీనికి కారణం వ్యవసాయక ఆదాయాలు, వ్యవసాయేతర ఆదాయాలకంటే తక్కువగా పెరగడం మాత్రమే కాదు. మొత్తం గ్రామీణ ఆదాయాలలో వ్యవసాయేతర ఆదాయాల వాటా 1990-91 కాలం తరువాత పెరుగుదల లేకుండా ఉండిపోవడమే దీనికి ప్రధాన కారణం.

1993-94వ సంవత్సరం ప్రాతిపదికగా వేసిన జాతీయ ఆదాయాల నూతన వరుసక్రమ అంచనాలు వ్యవసాయ ఉత్పత్తి బాగా పెరిగిందని సూచిస్తున్నాయి. అయితే పండ్లు, కూరగాయల, పూల ఉత్పత్తులు మొదలైనవాటికి వ్యవసాయ ఉత్పత్తులలో హెచ్చు ప్రాధాన్యత నివ్వడం దీనికి కారణం. దీనంతటి వలన, ఈ కాలంలో ఈ తరహా పంటల వాటా మొత్తం వ్యవసాయ ఉత్పత్తిలో 50 శాతానికి మించి చూపబడుతుంది. కాగా, ప్రస్తుతం అందుబాటులో ఉన్న గణాంక వివరాల ప్రకారంగా గ్రామీణ విభాగంలో వాస్తవిక అంచనాల ప్రకారంగా తలసరి ఉత్పత్తి పెరుగుదల రేటు 1980వ దశకంలో 3.1 శాతం మించి, 1990వ దశకంలో 1.8 శాతానికి పడిపోయింది. దీనికి చాలా కారణాలు ఉన్నాయి. మొదటిది గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయేతర ఉపాధి అవకాశాలు కుప్పకూలిపోవడం. ఇక రెండవది పండ్లు, కూరగాయల విభాగంలో మినహా మిగతా వ్యవసాయక రంగంలో ఎదుగుదల లేకపోవడం. ఇవి ప్రధాన అంశాలు. ఎందుచేతనంటే 1970, 1980 దశకాలలో గ్రామీణ ప్రాంతాలలోని వ్యవసాయేతర రంగాలలో ఆదాయ సముపార్జన అవకాశాలు గణనీయంగా పెరిగాయి. దీనికి కారణం ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో హెచ్చు మొత్తాల్లో కేటాయింపులను వినియోగించడం. ఆ కాలంలో నూతనంగా సృష్టించబడిన ఉపాధి అవకాశాల్లో దరిదాపు 60 శాతం గ్రామీణ ప్రాంతాలకే దక్కాయి.

90వ దశకంలో ఉపాధి :

సంస్కరణల ముందుకాలంలో (1983 నుంచి 1993-94 దశాబ్దం) ఉపాధిని కల్పించగల ఆర్థిక వ్యవస్థ సామర్థ్యం సాలీనా 2.7%గా వుంది. గత 9 సంవత్సరాల కాలంలో ఈ సామర్థ్యం 1.07%నికి పడిపోయింది. మరోప్రక్క స్థూలజాతీయ ఉత్పత్తి నుంచి, సంస్కరణల కాలంలో 6.7%నికి పెరిగింది. సంస్కర ణలు సమాజంలోని పై వర్గాలవారికే లాభం చేకూర్చాయన డానికి ఇదే తార్కాణం. 1993-94 సంవత్సరం తర్వాత సంఘటిత రంగంలో ఉపాధి అవకాశాలు దరిదాపు "సున్నా" స్థాయికి పడి పోయాయి. ప్రభుత్వ రంగ పరిశ్రమలలో వున్న ఉపాధి అవకాశాలు కూడా కృశించి పోతున్నాయి. గతంలో సంఘటిత రంగానికి వెలుపల, పెద్ద ఉపాధి కల్పనా రంగంగా వ్యవసాయం వుండేది. అయితే, సరళీకృత విధానాల అనంతరకాలంలో ఈ విభాగంలో కూడా ఉపాధి అవకాశాలు సన్నగిల్లాయి.

దీనంతటివలన, 1993-94 సం॥లో 6 శాతంగా వున్న నిరుద్యోగం, 1999-2000 కాలానికి 7.3 శాతానికి పెరిగింది. షెడ్యూల్డు తరగతుల విషయంలో ఈ నిరుద్యోగ శాతం తరుగుదల 9.6కి పెరిగింది. మొత్తం నిరుద్యోగ సైన్యం సంఖ్య 1999-2000 సంవత్సరాల నాటికి 27 మిలియన్లకు పెరిగింది. ఈ నిరుద్యోగులలో 74% మంది గ్రామీణ ప్రాంతాల్లోనే వున్నారు. వీరిలో 60 శాతం మంది విద్యావంతులే.

ఈ నేపథ్యంలో దేశంలో పేదరికం పెరిగిపోతోంది. పరిస్థితిని ఎంత మసిపూసి మారేడు కాయనుచేసి, కాకిలెక్కలు చెప్పినా ఇది వాస్తవం. సంస్కరణలు ధనవంతులను మరింత ధనవంతులుగాను, పేదలను మరింత పేదలుగాను చేసి వదిలి పెడుతున్నాయి. మధ్య తరగతిని కృంగ దీస్తున్నాయి. ఈ తరగతి వారి పరిస్థితి "ఇంట్లో ఈగల మోత, బయట పల్లకీల మోత"గా మారిపోతోంది మరి. ☐

అన్నిటినీ మించిన అభివృద్ధి : మద్యపానమే మహావనరు!

- కె. రామిరెడ్డి

దేశంలోని అన్ని రాష్ట్రాలకన్నా ఆంధ్రప్రదేశ్ అత్యంత వేగంగా పెరుగుదలరేటు సాధించినదెందులో అంటే ప్రజల చేత ఇంకా ఇంకా ఎక్కువగా సారా,విస్కీలు తాగించి ఎక్సయిజు పన్ను దండుకోవటంలో అని టక్కున చెప్పవచ్చు. రాష్ట్ర ఎక్సయిజు పన్ను ఆదాయం 1995-96లో రు.77.7 కోట్లనుంచి 2001-02నాటికే రు.1655 కోట్లు అయింది. దీని చక్ర అభివృద్ధి రేటు 72.81 శాతం. 2002-03 బడ్జెట్ అంచనా ప్రకారం రు.1870 కోట్లకు చేరనుంది. 1995-96 నుంచి గణాంకాలు పరిశీలిస్తే ఎక్సయిజు ఆదాయంలో 11 పెద్ద రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ పదవస్థానం నుంచి అయిదవ స్థానానికి చేరుకొంది. అంటే తాగుడు పెరిగిందన్నమాట. రాష్ట్ర సొంత పన్ను ఆదాయంలో ఎక్సయిజు పన్ను ఆదాయం పైన ఉదహరించిన కాలంలో 1.9 శాతంనుంచి 14.1 శాతం కాగా పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఈ శాతం తగ్గుతూ వచ్చింది: కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు మనకన్నా ఎక్కువ శాతం ఉన్నా వాటి పెరుగుదల తాబేలు నడక వేగంలోనే పెరుగుతోంది. ప్రధాన రాష్ట్రాల్లో చక్ర అభివృద్ధి రేటు శాతం ఇలా ఉంది: గుజరాత్ 13.20, కర్ణాటక 16.22, కేరళ 9.22, మధ్యప్రదేశ్ 8.58, మహారాష్ట్ర 10.38, పంజాబ్ 6.79, రాజస్థాన్ 7.67, తమిళనాడు 16.53, ఉత్తరప్రదేశ్ 14.28, పశ్చిమ బెంగాల్ 13.61, ఆంధ్రప్రదేశ్ 72.81 (సెంటర్ ఫర్ మోనిటరింగ్ ఇండియన్ ఎకానమీ మార్చి 2002)

1995 ఎన్నికల ముందు, తెలుగుదేశం పార్టీని గెలిపిస్తే, మద్యపాన నిషేధాన్ని ప్రవేశపెడతానని హామీ ఇచ్చిన ఎన్.టి. రామారావు అధికారం లోకి రావడంతోనే ఆ హామీని మొదటిరోజునే అమలుపరిచారు. కాని ఆయనను పదవీచ్యుతుణ్ణి చేసి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఆర్థికపరిస్థితి ఏమీ బాగా లేదనే కారణంతో నిషేధాన్ని ఎత్తివేశారు. ఎక్సయిజు ఆదాయం తారాజువ్వలా పైకెగసింది. ఆర్థికస్థితి బాగు పడిందా? అదే సంవత్సరాల్లో రెవెన్యూ లోటు రూ.739కోట్ల నుంచి 2001-02లో రూ.2881కోట్లకు చేరుకుంది ద్రవ్యలోటు రూ.2419కోట్ల నుంచి రూ.19956కోటకు పెరిగింది. కాగా ఆర్థికపరిస్థితి దిగజారడానికి కారణం మద్యపాననిషేధం కాదని ఈ గణాంకాలు నిరూపిస్తున్నాయి.

అన్ని రాష్ట్రాల ఎక్సయిజు సుంకం మొత్తం ఆదాయంలో ఆంధ్రప్రదేశ్ ఆదాయ స్థానం ఏమిటి అని విశ్లేషిస్తే 1995-96లో 0.9 శాతం నుంచి, 2001-02లో 8.9శాతానికి పెరిగింది. 1995-96లో మళ్లా 2001-02లో అన్ని రాష్ట్రాల మొత్తం ఎక్సయిజు ఆదాయంలో వివిధ రాష్ట్రాల శాతాల లాగే ఉన్నాయి, తగ్గాయి లేదా మార్జినల్‌గా పెరిగాయి. కాని ఆంధ్ర ప్రదేశ్‌లో పెరిగినంత వేగంగా మరే రాష్ట్రాల్లోనూ లేదని ఈ కింది గణాంకాలు తెలియచేస్తాయి. (బ్రాకెట్లో అంకెలు 2001-02 నాటివి. మొదటి అంకెలు 1995-96 సంవత్సరానివి)

ఆంధ్రప్రదేశ్ 0.9 (8.9), గుజరాత్ 0.2 (0.2), కర్ణాటక 9.6 (11.2), కేరళ 5.3 (4.0), మధ్యప్రదేశ్ 7.2 (5.1), మహారాష్ట్ర 12.6 (10.1), పంజాబ్ 11.1 (7.5), రాజస్థాన్ 8.3 (6.1), ఉత్తర ప్రదేశ్ 13.6 (13.2), పశ్చిమబెంగాల్ 3.1 (3.1). రాష్ట్రాల్లో ప్రభుత్వం వసూలు చేసే పన్నుల్లో ప్రతి నూరు రూపాయల్లో పదిన్నర రూపాయలు మందు భాయిలనుంచే వస్తుంది. 1995-96లో ఈ పన్ను ఆదాయం 1.2 మాత్రమే ఉండగా 1998-99/ 2000-2001 మధ్య కాలంలో ఎనిమిదిన్నర శాతం స్థాయిలోవుండి 2001-02లో 10.5శాతానికి చేరింది. ఈ విషయంలో కూడా పెరుగుదల ఇంత జోరుగా పదకొండు పెద్ద రాష్ట్రాల్లో ఎక్కడాలేదు. చంద్రబాబుకు ప్రతీ దానిలో ఫస్టన వుండాలనే ధ్యేయం. ప్రజలచేత తాగించటంతో ప్రారంభమైన దన్నమాట. ఈ తాగుడు చాలదన్నట్లు ఇటీవల బార్లు, రెస్టారెంట్‌లు తెరవడానికి లైసెన్సు ఇచ్చారు.

మద్యం సేవించటంలో గత దశాబ్దకాలంలో గమనించాల్సిన, ఆందోళన పడాల్సిన విషయమేమంటే మధ్యతరగతి జనం తాగటం ఎక్కువవ్వటం. 1989-90లో సారా, కల్లు ద్వారా మొత్తం ఎక్సయిజు సుంకంలో 80శాతం ఆదాయం వస్తుండగా, 2002-03లో బ్రాందీ, విస్కీ తదితర ఖరీదైన ద్రవాల నుంచి వచ్చే ఆదాయం 93 శాతానికి చేరుకొంది. □

ఆంధ్రప్రదేశ్‌లో ఎక్సయిజు సుంకం వసూళ్లు

(రూ. కోట్లు)

సంవత్సరం	ఎక్సయిజు సుంకం	రాష్ట్ర సొంత రెవెన్యూ	రాష్ట్ర మొత్తం పన్ను ఆదాయం	సొంత ఆదాయంలో ఎక్సయిజు శాతం	మొత్తం పన్ను ఆదాయంలో ఎక్సయిజు శాతం
1	2	3	4	5	6
1995-96	77.66	4120.44	6683.11	1.9	1.2
1996-97	63.90	4881.83	7820.54	1.3	1.2
1997-98	887.47	7113.35	10524.29	12.4	8.4
1998-99	924.01	7961.38	10969.55	11.6	8.4
1999-2000	1038.41	9008.60	12351.90	11.5	8.4
2000-01	1242.96	10551.92	14531.90	11.8	8.6
2002-02 స.అం.	1655.00	11657.92	15706.32	14.1	10.5
2002-03 బ.అం	1870.00	13459.67	18034.67	13.9	10.4
చక్రాభివృద్ధి రేటు 1995-96 నుండి 2002-03 మధ్య			60.36	18.06	14.70

(ప్రతి సంచికలోనూ ఈ శీర్షిక కింద ఒక ఆసక్తికరమైన రాజకీయార్థిక, సామాజిక, సాంస్కృతిక విశ్లేషణా వ్యాసాన్ని పునర్ముద్రించదలిచాము. చిన్న, స్థానిక పత్రికలలోనూ, ఇంటర్నెట్‌మీదా, పాత పత్రికలలోనూ అచ్చయి ప్రస్తుతం ఎక్కువ మందికి అందుబాటులో లేని, ఇప్పటికీ తాజాగా కనబడే వ్యాసాలకు ఈ శీర్షిక వేదిక. నీహార్ ఆన్‌లైన్.కామ్ లో ఏప్రిల్ 2000 లో వెలువడిన వ్యాసంతో ఈ శీర్షిక ప్రారంభిస్తున్నాం. - సం.)

ఇప్పటికీ ఎదురుపడుతున్న గిరీశం పాత్ర !

-వి. వంశధార

ఈ మధ్య మళ్ళీ ఒకసారి 'కన్యాశుల్కం' చదివారా? ముఖ్యంగా చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చి "స్వర్ణాంధ్ర' స్వప్నాలు అమ్మడం మొదలుపెట్టిన తరువాత 'కన్యాశుల్కం' చదివారా?

గిరీశం ఒక నాటక పాత్ర మాత్రమే కాదని, తెలుగు సామాజిక జీవనంలో నిత్యం ఎదురుపడే స్వభావాల వ్యక్తీకరణ అని ఎంతోకాలంగా ఎందరో విశ్లేషిస్తూనే వున్నారు. పుట్టి నూరేళ్ళు దాటినా గిరీశం బలం తగ్గలేదు సరికదా పెరుగుతున్నట్టనిపిస్తోంది. ఇవాళ్టి మన ఏలికకూ గిరీశానికీ పోలికలు కనబడడం కూడా యాదృచ్ఛికమో, అసహజమో కాదు.

తెలుగు సమాజంలో ఒక సంధి దశలో పుట్టిన అవకాశవాదానికి, స్వార్థపరత్వానికి, మెసకారి తనానికి, ఉదాత్త ఆశయాలను కూడా స్వప్రయోజనాలుగా వక్రీకరించగల దుర్మార్గానికి గిరీశం ఒక చిహ్నం. బహుశా వంద సంవత్సరాల తర్వాత కూడా తెలుగు సమాజం ఆ సంధి దశను దాటలేదేమో! సరిగ్గా ఆ విలువలే ఇంకా విస్తృతమై అధికార కేంద్రాలకు కూడా ఎగబాకాయేమో!

మొత్తం గిరీశం వ్యక్తిత్వాన్ని విశ్లేషించి, ఈ శతాబ్ది ఆద్యంతాలలో కొనసాగిన ఆ వ్యక్తిత్వధారను పరిశీలించడం ఇక్కడ సాధ్యం కాదు గాని కలల అమ్మకం అనే ఒక్క సంగతే చూద్దాం.

ఎప్పుడైనా కలల వ్యాపారం చాలా లాభసాటి వ్యాపారం. పెట్టుబడి లేని వ్యాపారం. సమాజంలో అసంతృప్తులూ, కొరతలూ, అవమానాలూ, దారిద్ర్యమూ ఉన్నంతకాలం ఆకాంక్షలుంటాయి, కలలుంటాయి. ఆ కలల్ని ఆకర్షణీయంగా, రంగుల్లో, పంచదార పూతలతో అమ్మగల వాళ్లకు గొప్ప లాభాలుంటాయి. స్వప్నాలు సాకారమయ్యే పరిస్థితి లేనంతకాలం మనుషులు ఆ స్వప్నాలే కొనుక్కోవడానికి, అనుభవించడానికి ఇష్టపడుతుంటారు. రియాలిటీలో సాధ్యం కానిది వర్చువల్ రియాలిటీలో సాధ్యం చేసుకునే ప్రయత్నమిది.

గురజాడ సరిగ్గా ఈ సంధి దశను, సంధి దశ ప్రకంపనాలను సీస్మోగ్రాఫ్‌లాగ పట్టుకున్నాడు. ఆ సంధి దశలో తలెత్తే బేహారి గిరీశాన్ని సృష్టించాడు.

'కన్యాశుల్కం' మొదటినుంచి చివరివరకూ గిరీశం చేసిన పనులను విశ్లేషిస్తే అన్నిచోట్లా కలల అమ్మకం కనబడుతుంది. దాదాపు అమ్మిన కలలన్నిట్లో ఒక్కటికూడా నిజం కాకపోవడం కనబడుతుంది. చివరికి ఆ కలల అమ్మకం బెడిసికొట్టి, "డామిట్ కథ అడ్డం తిరిగింది" అన్నప్పుడు నిజానికి అడ్డం తిరిగినది కథ కాదు, కల!

గిరీశం కథ వెంకటేశానికి కల అమ్మడంతో మొదలవుతుంది. పరీక్ష ఫెయిలయిన వాణ్ణి ఎముకలు విరగ్గొట్టే తండ్రి నుంచి కాపాడతాననడం మొట్టమొదటి కల అమ్మకం. అక్కడి నుంచి గిరీశానికి మరే వ్యక్తితో సంబంధం ఏర్పడినా, ఏ ఇబ్బంది వచ్చినా ఒక కల సిద్ధంగా వుంటుంది.

'ఫొటిగరాపుల' ఖరీదడగడానికి వచ్చిన బంట్రోతుకు 'రేప్పొద్దున రెండు కట్టల దొరల చుట్టలు ఇస్తాన'నే కల, వెంకటేశాన్ని మూడేళ్ళు తన తరిఫీదులో ఉంచితే క్రిమినల్ పోలీసు పరీక్ష పాసుచేయిస్తానని వెంకమ్మకు అమ్మేకల, దావా గెలవకపోతే తన చెవి కడపాయించుకుని వెళ్లిపోతానని అగ్నిహోత్రావధానులకి అమ్మేకల, తనను పెళ్ళాడితే 'బతికినంత కాలం నవ్వుతూ, ఆనందిస్తూ' ఉండవచ్చుననీ, సుబ్బి పెళ్ళి కూడా ఎత్తగొట్టవచ్చుననీ బుచ్చమ్మకు అమ్మే కల, లుబ్ధావధానులకి అమ్మే కల - మొత్తంగా గిరీశం పాత్ర అడుగడుగునా చేసింది కలల అమ్మకమే.

ఈ వ్యక్తిగత స్థాయి కలలకు ఎక్కడో ఒకచోట పరీక్షా, సాఫల్యమూ, వైఫల్యమూ ఉంటాయి గనుక అసలు మొత్తంగానే పరీక్షకు కుదరని కలలూ వున్నాయి గిరీశం దగ్గర అమ్మకానికి! లోకం మరామత్తు చెయ్యడం అని వెంకటేశం అన్నా, సోషల్ రిఫారమ్అని తానే స్వయంగా అన్నా పరీక్షించడానికి వీల్లేని పెద్ద కలలు అవి! బైటి వాళ్ళకు - అన్నివర్గాల వాళ్లకీ, అన్ని అవసరాలకీ, అన్ని అసంతృప్తులకీ - ఇట్లా ఎడాపెడా కలలు అమ్మేవాడు తన గురించి తానేమనుకుంటాడు? ఈ కలల అమ్మకం ఏదో యాదృచ్ఛికం కాదని, గిరీశం స్వభావంలో అది ఉందని గురజాడ స్పష్టంగానే వ్యక్తం చేశాడు. అంతేకాదు, భవిష్యత్తులో రాజకీయవేత్తలందరూ ఈ పనే చేస్తారని కూడా ఆయన ఊహించాడు.

"ఇలాంటి ప్రమాదాలను తప్పించుకోవడమే ప్రజ్ఞ. ఏవైనా డిఫికల్టీ లొచ్చినప్పుడు ఒక తస్సావేశావంటే అది బ్రహ్మ బేధ్యంగా

ఉండాలి. పొలిటీషనంటే మరేమిటనుకున్నావ్'' అని గిరీశం నోటనే స్పష్టంగానే చెప్పించాడు గురజాడ.

గురజాడ ఊహించిన అర్థంలో రాజకీయవేత్తలు విస్తరించడానికి ఆ తర్వాత నాలుగైదు దశాబ్దాలు పట్టింది. ఒపీనియన్స్ ఛేంజి చేయడం మాత్రమే కాదు, డిఫికల్టీ రాగానే తస్సా వెయ్యడం, అంటే కలల మీద కలలు అమ్ముతూపోవడం రాజకీయానికి మారుపేరయింది. చివరికి ఎన్ని కలలు అమ్మామో తమకే గుర్తులేనంతగా, ఏ కలలు కొనుక్కున్నామో కొనుక్కొనే వాళ్ళకు గుర్తులేనంతగా కలల వెల్లువలు ప్రవహించడం ఇటీవలి పరిణామం.

రానున్న రాజకీయ ధోరణికి మాత్రమే కాదు, రానున్న వ్యాపార ధోరణికి కూడా సంకేతం గిరీశం. బహుశా శతాబ్దాంతానికి రాజకీయమూ, వ్యాపారమూ కలగలిసిపోయి, రాజకీయ వేత్తకు వ్యాపారవేత్తగా ప్రఖ్యాతి వచ్చే సందర్భాన్ని కూడా గురజాడ ఊహించి ఉంటాడు. ప్రతి విషయాన్నీ లాభనష్టాల్లో, జమా ఖర్చుల్లో చూడాలనే వ్యాపార దృష్టిని జీవితానికి, పెళ్ళికి కూడా అన్వయించడం గిరీశం చేశాడు.

"తొందరపడి హాజీ సాయబు తురకల్లో కలిసి పోయినాడన్నట్లు నా వంటి బుద్ధిమంతుడు ఏ పనీ చేయకూడదు. లాభనష్టాలు బేరీజు వేసి, జమా ఖర్చు చూసుకొని మరీ డిసైడ్ చేయాలి' అని బుచ్చమ్మను పెళ్ళి చేసుకుంటే లాభనష్టాలన్నీ నిర్లజ్జగా లెక్కగడతాడు గిరీశం.

కన్యాశుల్కం రచన నాటికి, ఇరవయ్యో శతాబ్దితొలి దశకాల నాటికి గిరీశం ఒక పాత్ర మాత్రమే కావచ్చు. బహుశా నెగెటివ్ పాత్ర కూడా కావచ్చు. అసహ్యించుకోదగిన పాత్ర కావచ్చు. కాని ఆ స్వభావమే క్రమక్రమంగా మన పాలకుల, సమాజ నిర్ణేతల స్వభావంగా ఎదుగుతున్న కొద్దీ గిరీశం పట్ల ఆకర్షణ పెరిగిపోతూ వచ్చింది. చివరికి సాహిత్య విమర్శ కూడా ఈ సమర్థమైన, పనిచేసే మోసం ఆకర్షణలో పడి గిరీశాన్ని కన్యాశుల్కానికి నాయకుణ్ణి కూడా చేసింది.

ప్రజా జీవితాన్ని అల్లకల్లోలం చేసే ప్రపంచీకరణ క్రమం మొదలయిన తరువాత, ఆ ప్రమాదం నుంచి ప్రజల దృష్టిని మళ్ళించడానికి కలల అమ్మకం మళ్ళీ ఒకసారి విజృంభించింది. అటు రాజకీయం, ఇటు వ్యాపారం కలగలిపి కలల అమ్మకం ప్రారంభించాయి. గిరీశాలు సర్వవ్యాప్తమయిపోయారు. కుప్పలు తెప్పలుగా కలలు కురవడం మొదలయింది.

ఆంధ్ర రాజకీయార్థిక సామాజిక జీవనంలో గత నాలుగైదేళ్ళ పరిణామాల నేపథ్యంలో కన్యాశుల్కాన్ని మళ్ళీ చదివితే గిరీశం సాహిత్యం లోంచి సమాజంలోకి నడిచి వస్తున్న దృశ్యం కనబడుతుంది. అధికార పీఠాల కింద గిరీశం చేస్తున్న వికటాట్టహాసం వినబడుతుంది.

ఇది సాహిత్యానికి ఎంత గొప్ప కితాబు! సమాజానికి ఎంత పెద్ద ప్రమాదం!! ❐

(8వ పేజీ తరువాయి)

చీలిక వస్తుంది. దానిలోని ఒక విభాగం కార్మికులతో జట్టు కడుతుంది. అయితే, ఈ విభాగం మేలిముసుగులో కార్మికవర్గ ఉద్యమాన్ని వెన్నుపోటు పొడిచే శక్తులపట్ల అప్రమత్తంగా వ్యవహరించాలి. పెట్టుబడిదారీ వ్యతిరేక పోరాటంలో రాక్షసితోనైనా రాజీపడాలని మార్క్స్ చెప్పాడని వినికిడి. అయితే, నేటి పెట్టుబడిదారీ వ్యతిరేక పోరాట దశ ఈ స్థాయిని దాటిపోయింది. ప్రపంచం రాను రాను రెండు శత్రు శిబిరాలుగా చీలిపోయింది. పీడితులు, పీడకులు ఆ శిబిరాలు. ఈ నేపథ్యంలో పెట్టుబడిదారీ వ్యతిరేక పోరాటంలో మరింతగా రాజకీయ రాజీలకు స్థానం తరిగిపోతోంది. రాజీలేని, నిఖార్సయిన వర్గ పోరాటాల శకానికి తెరలేస్తోంది. ఈ పోరాటంలో తాము ఏ ప్రక్కన వున్నామో తేల్చుకోవాల్సిన ఆగత్యం పార్టనర్ ఎన్జీవోస్ తో సహా ప్రతివారిపైనా వుంది. ఇటువంటి విస్తారమైన ప్రజాపోరాటాల వెల్లువను, ఎంతకాలమో దగా చేయడం సాధ్యం కాదు. తమ నిజ స్వరూపాలను కప్పిపెట్టుకుని "ప్రగతిశీల" ముసుగు క్రింద చలామణీ అయ్యే సంస్థల రంగు వెలసిపోయేందుకు మరెంతకాలమో పట్టదు.

పెట్టుబడిదారీ విధానానికి పూర్తిగా సైద్ధాంతికంగానూ, చాలా మేరకు ఆచరణాత్మకంగానూ కూడా కాలం చెల్లిపోయింది. ఇక ఈ వ్యవస్థ అంత్యక్రియలకు ఎంతో సమయం పట్టదు. మండుతోన్న లాటిన్ అమెరికా, ఆఫ్రికా ఖండాలు, ఓ మేరకు ఆసియా ఈ చితిని పేర్చనున్నాయి. ఈ దిశగా ఇప్పటికే వచ్చి చేరిన క్రొత్త కెరటాలు, ప్రసవ వేదన (మరణవేదన!) పడుతోన్న పెట్టుబడి దారీ వ్యవస్థ గర్భం నుంచి నూతన వ్యవస్థ ముందుకు వస్తోంది. దీనిని స్వాగతించేందుకు ప్రగతిశీల శక్తులు అన్నీ సిద్ధం కావాలి. ❐

వంటనూనెల దిగుమతులు

1997-98	20.8 ల.ట.
1998-99	44.9
1999-2000	44.9
2000-01	48.3
2001-02	44.3
2002-03 అంచనా	50.0

వంటనూనెల దిగుమతిలో ప్రపంచంలో భారతదేశం నెం. 1

ప్రధాన రాష్ట్రాల స్థూల ద్రవ్యలోటు

	(కోట్లలో) (2001-02)
పశ్చిమ బెంగాల్	10944.6
గుజరాత్	10019.3
ఉత్తర ప్రదేశ్	9393
ఆంధ్రప్రదేశ్	8897
మహారాష్ట్ర	6615.7
తమిళనాడు	6351.2

మొండిబాకీల ఊబినుంచి బ్యాంకులు బయటపడేనా?

- పి. వరహాల శెట్టి

లక్షకోట్ల రూపాయల పైగా బ్యాంకుల మొండి బాకీలు తరచుగా వార్తల్లోకెక్కి బ్యాంకుల్లో డబ్బు పొదుపు చేసుకొన్న వారి గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్నాయి. ఇలా రుణాలు కావాలని ఎగ్గొట్టిన పారిశ్రామిక వేత్తల, వ్యాపారస్తుల, ధనిక రైతుల పేర్లు ప్రకటించాలని గత పది సంవత్సరాల్లో పార్లమెంటులో, బయటా పోరుతూ వచ్చినా ఏవో కుంటి సాకులతో రిజర్వుబ్యాంకు ప్రకటించకపోవడంతో బ్యాంకు ఉద్యోగుల సంఘమే ఆ పేర్లను ప్రకటించి సంచలనం సృష్టించింది. బాకీల చిట్టాలో వివిధ కార్పోరేట్ సంస్థలు, బడా పారిశ్రామిక వేత్తల పేర్లన్నీ బజారుకెక్కాయి. తమిళనాడు బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రకటించిన పట్టికలో తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత, ఆమె ప్రియనేస్తం శశికళ, కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి టి.ఆర్.బాలు వున్నారు. (ఏయే బ్యాంకుల్లో ఎంతెంత మొండి బాకీలున్నాయో పేజీలో చూడవచ్చు). సామాన్యులెవరైనా చిన్న పరిశ్రమో, వ్యాపారమో పెట్టుకోవడానికి రుణం కోసం బ్యాంకులకు వెళితే ఛీ కొట్టే యజమానులు, చిన్న సన్నకారు రైతులు బాకీ పడితే కుండా చెంబూ వీధిలోకి విసిరేసే బ్యాంకులు లక్షకోట్ల రూపాయల బాకీలను ఎలా ఎందుకు పేర బెట్టారు?

అభివృద్ధి చెందుతున్న దేశాలను నిధులకొరత వెంటాడుతూనే వుంటుంది. బ్యాంకులను జాతీయం చేయటం ద్వారా, వాటిలోని నిధులను దేశాభివృద్ధికి ఖర్చు చేయటానికి అవకాశం ఏర్పడింది. ఆ అవకాశాన్ని వమ్ముచేసి, ఆ నిధులను తామే కాజేసి మొండి బాకీదారులంతా దేశాభివృద్ధిని నిరోధిస్తున్నారు. ప్రపంచబ్యాంకు వద్దకు రుణాల కోసం పరుగులెత్తించి, దేశాన్ని రుణాల ఊబిలో ముంచడానికి కారకులవుతున్నారు. ఈ రుణాల మీద వడ్డీల రూపంలో లక్షల కోట్ల రూపాయలు దేశ సరిహద్దులను దాటి రుణ దాతలకు వెళ్లడమే కాకుండా, వైద్యం, విద్యలాంటి సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు చేయనీయకుండా అడ్డుపడుతున్నారు. ఆస్తులను సృష్టించి మూలధనం ఏర్పాటు చేసుకోవ డానికి వీలుకాకుండా చేస్తున్నారు. దేశానికి, ప్రజలకు తీరని ద్రోహం చేస్తున్నారు. మరి ప్రభుత్వం ఏం చేస్తోంది? ఇలాంటి వాళ్లకు రక్షణ కల్పిస్తూందంటే మీరు నమ్ముతారా? చూడండి.

రుణం చెల్లింపులను సంవత్సరాలుగా ఎగవేస్తున్నవారి పేర్లను ప్రకటించకుండా వారి "మర్యాద"ను కాపాడటం ప్రభుత్వం కల్పించిన మొదటి రక్షణ ప్రభుత్వం మన్నుతిన్న పాములా పడి వుందని ప్రజలుఅనుకోకుండా వుండడానికి ఏదో చేస్తున్నట్లు నమ్మించటం, కాని ఏం జరక్కుండా చూడడం అనే కళలో ప్రభుత్వం ఆరి తేరింది. రుణాల వసూళ్లకు 1997-98 లో ట్రిబ్యునళ్ల (డెట్ రికవరీ ట్రిబ్యునల్స్) ఏర్పాటు చేసి, మొండి బాకీలు వసూలు చేస్తున్నట్లు నటించడం, అది పని చేయడానికి కావాల్సిన కుర్చీలు, టేబుళ్లు కూడా అమర్చకపోవడం, మొండి బాకీదారులను పిలిచి, కాఫీ, టీలు ఇచ్చి, కట్టమని వాళ్లను బ్రతిమాలటం, ఏవో నామకః వసూళ్లు చేయటం - ఇలా పనిచేసే ట్రిబ్యునళ్లు లక్షకోట్ల రూపాయలు వసూలెలా చేయగలుగుతాయి? 2001-02లో ఈ ట్రిబ్యునళ్లు వసూలు చేసిన మొత్తం కేవలం రు. 2153 కోట్లు. ఇది సముద్రంలో నీటిబొట్టు. మొండి బకాయిలను ఎలా వసూలు చేయాలి ఏం చర్యలు తీసుకోవాలో చెప్పమని ఒక కమిటీని నియమించగా, ఆ కమిటీ ఒక నివేదికనిస్తే రెండు సంవత్సరాలు ఆ నివేదికను అటకెక్కించేయటం ప్రభుత్వం కల్పించిన మూడో రక్షణ. ఆ తర్వాత వన్-టైం సెటిల్‌మెంట్ పేరుతో వడ్డీ మాఫీ చేయటం, అసలు తగ్గించటం లాంటివి చేసి నొప్పిలేకుండా ఆపరేషన్ చేయటం నాలుగో రక్షణ. ఈ పాచిక కూడా పారలేదు. కావాలని ఎగ్గొట్టే వాళ్లు అలాంటి సెటిల్‌మెంటుకు ఎందుకు ముందుకు వస్తారు? ఇలాంటి మొండి వాళ్ళను ఏం చేసినా పాపం లేదనుకుంటాం కాని మాజీ ఆర్థికమంత్రి సిన్హా అలా అనుకోలేదు. బ్యాంకులిచ్చిన మొత్తం రుణంలో మొండిబాకీల శాతం పడిపోతుందని పార్లమెంటులోనే ప్రకటించి వీళ్ళకు గుడ్ కాండక్టు సర్టిఫికెట్ ఇచ్చారు! ఇది అయిదో రక్షణ. ఇటీవల సెక్యూరిటీబిల్లు లోక్‌సభ ఆమోదించినపుడు కూడా 'బకాయిలు చెల్లించటంలో ఏమైనా సమస్యలుంటే ప్రభుత్వం పరిశీలించగలదని' ఆర్థికమంత్రి జస్వంత్‌సింగ్ తాజా హామీ ఇస్తున్నారంటే ప్రభుత్వం తాజా చట్టాన్ని నిజాయితీగా అమలు పరుస్తుందని నమ్మకం కలగటం లేదు. ఈ జస్వంత్‌సింగే 13 రోజుల బి.జె.పి. నిర్వాకం చేసినపుడు ఎన్రాన్‌కు కౌంటర్ గ్యారంటీ ఇచ్చిన విషయం గమనార్హం. ఆ ఎన్రాన్ ఒప్పందం ఏమైందో అందరికీ తెలిసిన విషయమే.

ఇక్కడ సెక్యూరిటీ బిల్లు గురించి కొంచెం ముచ్చటించాలి. నవంబరు 26న Securitisation and Reconstruction of Financial Assets and Enforcement of Security Bill ను పార్లమెంటు ఆమోదించింది. మొండి బాకీలున్న వారికి 60 దినాలు నోటీసు ఇచ్చి, చెల్లించకపోతే వాళ్ల మీద కేసు పెట్టి కోర్టులచుట్టూ తిరగనవసరం లేకుండా వారి ఆస్తులను జప్తు చేసే అధికారాన్ని బ్యాంకులకు ఇస్తుంది. ఇందులో Asset Reconstruction Company లను ఏర్పాటు చేసే అధికారం ఇస్తుంది. దీని ప్రకారం బ్యాంకులు తమ బాకీలన్నీ ఈ కంపెనీకి దఖలు పరుస్తాయి. ఆ కంపెనీ బ్యాంకులున్నవారి ఆస్తులను జప్తు చేసి, వాటిని అమ్మి సొమ్ము చేసి బ్యాంకుకు అందచేస్తుంది. ఇందలో ఏదో మతలబు వుందని బ్యాంకు ఉద్యోగులు అనుమానిస్తున్నారు. ఆ చట్టం పూర్తి

(తరువాయి 26వ పేజీ లో)

డిసెంబర్ 1 - 15, 2002

రాష్ట్రం

1. నెల్లూరు జిల్లాలో ఇద్దరు కిడ్నాపర్ల ఎన్‌కౌంటర్లు
నల్లగొండ జిల్లాలో యురేనియం నిల్వలు
విశాఖ జిల్లా రైవాడలో పోలీసు కాల్పులు
చిత్తూరు దేశం పార్టీ కార్యాలయంలో ముష్టి యుద్ధాలు
2. దిగివచ్చిన ఆంధ్ర విశ్వవిద్యాలయం - విద్యార్థుల డిమాండ్లకు ఆమోదం
4. ఆలమట్టి నీరిప్పించరూ - ప్రధానికి సి.ఎం.లేఖ
5. ట్రాన్స్‌కోలో కొత్త డైరెక్టర్లు మొండిబాకీలు - చందుభాయ్ జువెలర్స్ ఆస్తులు ఎస్.బి.ఐ స్వాధీనం
గొత్తి కోయల గ్రామాన్ని తగులబెట్టిన అటవీశాఖ.
6. పన్నుల వసూళ్ల ఆధారంగా మునిసిపాలిటీలకు గ్రేడింగ్
8. రైతుల ఆత్మహత్యలపై విచారణ - హక్కుల కమిషన్‌కు వై.ఎస్. లేఖ.
9. గోదావరీ జలాలపై 15 లోగా నిర్ణయం - అఖిల పక్షం అల్టిమేటం
బయటకు వెళ్లను - రాజకీయాలు వీడను - రామమూర్తి నాయుడు
నిత్యావసర వస్తువులకు ధరల సెగ
10. రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు డి.ఎ.పెంపు
11. రిటైర్డ్ ఏ ఎస్పీ కాల్చివేత
12. హైదరాబాద్‌లో 32వ జాతీయ క్రీడోత్సవాలు ప్రారంభం

దేశం

1. రైలు ఛార్జీల్లో డాక్టర్లకు 10 శాతం రాయితీ
4. రష్యా భారత్ ఒప్పందాలపై సంతకాలు.
రు. 153 కోట్లు విదేశీ పెట్టుబడులకు ఆమోదం
5. రష్యాకు పుతిన్ తిరుగుపయనం
ఇంత ఆహారమున్నా ఆకలి చావులా? ప్రధాని
6. బాబ్రీమసీదు కూల్చివేతదినం (బ్లాక్‌డే) ప్రశాంతం
7. నేను మోడీ లాయర్ని - వాజ్‌పేయ్.
సంక్షోభంలో చక్కెర పరిశ్రమ
8. నట్టడివిలో వీరప్పన్ బందీ నాగప్ప మృతదేహం
0.319 పెరిగిన ద్రవ్యోల్బణం
ఇక విచారణలో పాల్గొనం - తెహల్కా
9. చమురు సంస్థల అమ్మకం - కేంద్రం నిర్ణయం
సోనియా గాంధీ పుట్టినరోజు వేడుకలు
10. కంపెనీలుగా సహకార సంస్థలు - బిల్లుకు లోక్‌సభ ఆమోదం
11. నానీపాల్కివాలా మరణం
12. రైతులకు క్వింటాల్‌కు మరో రు. 10 కరవు సహాయ ధర ఇవ్వాలని వ్యవసాయ ధరల కమిషన్ సిఫార్సు
రాజకీయాలను నేరపూరితం చేయటాన్ని నిరోధించే ఎన్నికల చట్టం సరవణబిల్లు పార్లమెంటు ఆమోదం
గుజరాత్ ఎన్నికలు ప్రశాంతం - 65 శాతం వోటింగు.
13. దర్శకుడు, నిర్మాత యాష్ చోప్రాకు ఫాల్కే అవార్డు

(4వ పేజీ తరువాయి)

"ప్రజాస్వామ్య" నియంత. రెండోపక్క కాంగ్రెస్ దేశం అంతటిలో లాగే, రాష్ట్రంలో కూడా పుంజుకొంటూంది. వాళ్ళలో వాళ్ళు కొట్టుకొంటున్నారని దేశం కార్యకర్తలు చంకలు గుద్దుకోనవసరం లేదు. అధికారంలో వున్నా, లేకున్నా కాంగ్రెస్ కొట్టుకోనిదెపుడు? ఇవి గుజరాత్ ఎన్నికల్లో బిజెపి తిరిగి అధికారంలోకి రావడం దేశానికే ఒక పెద్ద ప్రమాదమని భావించే పార్టీలన్నిటినీ తప్పకుండా పునరాలోచింప చేస్తాయి.

ఈ సంవత్సరంలో అందరికీ ఆనందాన్ని కలిగించే ఏకైక పరిణామం కృష్ణా బేసిన్‌లో సహజ వాయువు లభ్యం కావడం ఇన్నాళ్ళూ పరిశ్రమలు రాష్ట్రంలోకి రావడానికి అడ్డంకిగా వున్న విద్యుచ్ఛక్తికి కొరత ఇపుడు మాయమవుతుంది. ప్రభుత్వానికి రాయల్టీ ద్వారా నిధులు సమకూరుతాయి. పరిశ్రమలు వస్తాయి. ఉద్యోగాలు లభించవచ్చు. పన్ను ఆదాయం పెరుగుతుంది. ఇది శుభసూచకం. అయితే ప్రభుత్వానికి ఎంత అదనపు ఆదాయం చేకూరుతున్నా చిల్లుకుండలో నీళ్ళు పోసినట్లవుతుంది. ఉదాహరణకు మద్య నిషేధం వున్నన్నినాళ్ళు దానివల్ల ఆదాయం తగ్గిపోయిందని గోల చేసిన ప్రభుత్వం ఆ తర్వాత ఆదాయం ఎన్నోరెట్లు పెరిగినా ఆర్థిక పరిస్థితి మళ్ళీ క్షీణిస్తూనే వచ్చింది. ప్రజలు మాత్రం ఎన్నాళ్ళు సహిస్తారు?

20-12-2002

★ గత అర్ధ శతాబ్దంగా పెరిగే లక్ష్యాలు 'పొదుపు' పెట్టుబడి పెరుగుదల రేటు, ప్రభుత్వ రంగ పెట్టుబడులు అంటూ అదే పాట పాడుతూ పోతుంటే ప్రజల్లో ప్రణాళికా పత్రం పట్ల విశ్వసనీయత వుండదు.

- హిందూ సంపాదకీయం 25-12

★ 80 శాతం బాధ్యతలు మావి. కాని 80 శాతం ఆదాయం కేంద్రానికి వెళుతోంది.

- యనమల మార్చి 7

★ కేంద్ర ప్రభుత్వం కేటాయింపు లెక్కలు అడిగినపుడు పెత్తనం వద్దని రాష్ట్రాలు అంటున్నాయి. కాని ప్రపంచ బ్యాంకుకు ప్రతీ పైసాకు లెక్కలు చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రానికి జవాబుదారీతనం వహించేందుకు ఇబ్బంది ఏమిటో.

-వెంకయ్యనాయుడు

★ అభివృద్ధి కార్యక్రమాలకు 1985-90 మధ్య ఖర్చు 70 శాతం వుండగా 2000-01 నాటికి 60 శాతానికి దిగజారింది అస్సోఛామ్

★ కేంద్రం, రాష్ట్రాల రుణభారం ఎంత పెరిగిందంటే, వారి మొత్తం పన్ను ఆదాయాన్నంతా ఈ రుణాన్ని తిరిగి చెల్లించడానికి వినియోగించినా (వడ్డీ మాట పక్కన పెట్టండి) అయిదు సంవత్సరాల పాటు చెల్లిస్తేనే తీరుతుంది.

- ఎకనమిక్ టైమ్స్

★ రాష్ట్రాల రుణ బకాయిలు 1998లో రూ. 2,81,207 కోట్లు కాగా, 2002 నాటికి రూ. 5,91,832 కోట్లకు పెరిగాయి. రుణ భారం 1991లో రు. 1,10,289 కోట్లనుండి దాదాపు అయిదురెట్లు పెరిగి రూ. 5,91,832 కోట్లకు పెరిగింది. ఈ పెరుగుదల ప్రతి సంవత్సరం 20 శాతం చొప్పున వుంది.

-అస్సోఛామ్

★ 2001-02 ఫైనాన్స్ అకౌంట్స్ ప్రకారం భూమి శిస్తు పద్దు కింద రెవెన్యూ ఆదాయం రూ. 19,71,50 లక్షలు కాగా, ఆ సొమ్మును వసూలు చేయడానికి అయిన ఖర్చు రూ. 21,42.11 లక్షలు.

★ దేశంలో తయారయ్యే సాఫ్ట్‌డ్రింక్స్ ప్రపంచ ఉత్పత్తిలో ఒక శాతం మాత్రమే. కాని ప్రపంచ లిక్కర్ ఉత్పత్తిలో 20 శాతం దేశంలోనే.

-ఎకనామిక్ టైమ్స్ 21 నవంబర్

★ ఉద్యోగం చేస్తున్నా సరే, లేక ఇల్లాలయినా సరే, స్త్రీలే ఎన్నో రెట్లు ఎక్కువ కాలం ఇంటిపనిలోనే వుంటారు.

ఇంటి యాజమాన్యంలో, ఇల్లు సర్దడంలో, షాపింగ్‌లో సగటున వారానికి స్త్రీలు వెచ్చించే సమయం

విద్యాస్థాయి	పురుషులు	స్త్రీలు
నిరక్షరాస్యులు	7.8	34.2
ప్రాథమిక విద్య స్థాయిలోపు	6.9	32.7
ప్రాథమిక విద్య	6.6	34.0
మాధ్యమిక విద్య	6.5	35.5
సెకండరీ	6.1	37.1
ఉన్నత సెకండరీ	6.2	35.5
గ్రాడ్యుయేట్, ఆ పైన	5.4	33.9

-ఎకనామిక్ టైమ్స్ 1 అక్టోబర్ 2002

★ భారతదేశంలో సెకండరీ పాఠశాలల్లో బాలురతో పోలిస్తే బాలికలు 66 శాతం మాత్రమే. బంగ్లాదేశ్‌లో 111 శాతం. బంగ్లాదేశ్, మలేషియా, శ్రీలంక, హాంగ్‌కాంగ్, తైవాన్, థాయ్‌లాండ్, ఫిలిప్పైన్స్, కొరియా, ఇండోనేషియా, చైనా, పాకిస్తాన్, నేపాల్, తర్వాత స్థానమే ఇండియాది.

- ఎకనామిక్ టైమ్స్ 24/9/02

★ తెలుగుదేశం నాయకుడు ఉమారెడ్డి వెంకటేశ్వర్లు చెప్పినదాని ప్రకారం భారత్ నుంచి వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు ప్రతి సంవత్సరం సగటున రెండుశాతం తగ్గుతూ వస్తున్నాయి. 1999లో 18.25 శాతం నుండి 2000లో 15.91 శాతానికి 2001లో 14.78 శాతానికి తగ్గిపోయాయి.

- న్యూస్‌టైమ్ 30/8/02

★ అర్బన్ కో ఆపరేటివ్ బాంకుల్లో మొండిబకాయిలు మార్చి 2001 నాటికి రూ. 9245 కోట్ల నుంచి మార్చి 2002 నాటికి రూ. 11,472 కోట్లకు చేరుకొన్నాయి.

- టైమ్స్ ఆఫ్ ఇండియా 31/8/02

★ 1993-94కు ముందు పది సంవత్సరాలలో మహిళల ఉద్యోగాల అభివృద్ధి 1.7 శాతం చొప్పున పెరిగితే 1993-94 నుంచి 1999-00 మధ్య కాలంలో పెరుగుదల 0.98 శాతానికి పడిపోయింది.

-ఎకనమిక్ టైమ్స్ 30/8/02

★ మార్చి 2002 నాటికి 102 కోట్ల జనాభాలో కేవలం 2.9 శాతం మంది మాత్రమే ప్రత్యక్ష పన్ను చెల్లించాల్సిన వారి జాబితాలోకి వస్తారు.

- కేంద్ర ఆర్థిక మంత్రి డిసెంబర్ - 13

★ బ్యాంకులు, గృహ నిర్మాణంలో ఆర్థిక సహాయ సంస్థలు గృహనిర్మాణానికి ఇచ్చిన రుణాలు 1999-2000 లలో రూ. 19,723 కోట్లు నుంచి 2001-02 రూ. 2,960 కోట్లకు పెరిగాయి. 2002-03 లో రూ. 37,000 కోట్లకు పెరగవచ్చు.



(23వ పేజీ తరువాయి)

పాఠం లభించినపుడే విశ్లేషించడానికి వీలవుతుంది. బ్యాంకులు తమ బాకీఉన్న వారి ఆస్తులనో, భవనాలనో, కర్మాగారాలనో జప్తు చేసాయనే అనుకొందాం. అవన్నీ అమ్మకానికి పెడతారా? టెండర్లు పిలుస్తారా? వేలం వేస్తారా? ఈ పని చేయడానికి బ్యాంకుల్లో అదనపు సిబ్బందిని నియమిస్తారా? మోటారుకారు పోతుంటే అపుడపుడు కుక్కలు మొరుగుతూ దాని వెనక పరుగెడతాయి. కాని కారు ఆగిపోయిన తర్వాత అదీ ఆగిపోతుంది. ఏం చెయ్యాలో దానికీ తెలియదు. అలాగే జప్తు చేసి ఏం చెయ్యాలో బ్యాంకులకు తెలియదు. ఇటీవల చెన్నైలో ఎవరి ఆస్తినో ఇలా జప్తు చేయగా హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకొన్నారు. ఇలా ఆస్తి జప్తు చేయటం రాజ్యాంగం ఇచ్చిన హక్కులకు వ్యతిరేకమట! అంటే బ్యాంకు నుంచి రుణం తీసుకొని సెక్యూరిటీగా పెట్టిన ఆస్తులను, బాకీ రుణాలు చెల్లించకపోతే, స్వాధీనం చేసుకోకూడదన్న మాట. ఇలా వాదించిన అడ్వకేట్ తానే బ్యాంకు వున్న పరిస్థితిలో వుంటే ఏం చేసి వుండేవాడో తెలుసుకోవాలని కుతూహలంగా వుంది.

రాష్ట్రంలో...

రాష్ట్రంలో కోటిరూపాయలకు పైగా రుణం తీసుకొన్నవారు 1020 మంది మొండి ఖాతాదారులుగా తేలి రు. 4796.12 కోట్లు బాకీ పడ్డారు. రాష్ట్ర ప్రణాళిక కేటాయింపు సుమారు తొమ్మిదివేల కోట్లు. బాకీ పడిన మొత్తం దీనిలో సగం అన్నమాట. ఇలా బాకీ పడిన కొన్ని కంపెనీలు బోర్డులు తిప్పేసాయి అడ్రసు లేకుండాపోయాయి. ఒకే కంపెనీ నాలుగైదు బ్యాంకులనుంచి రుణాలు తీసుకొన్న ఉదాహరణలూ వున్నాయి. ఎక్కువ మొత్తం బాకీలున్న వారిలో మాజీ ఉపముఖ్యమంత్రి జె.వి. నరసింగరావు కుమారుడు నడిపే పెన్నార్ పాటర్సన్, వార్త పత్రిక నడిపే సంఘి గ్రూపు కంపెనీలు, విజయవాడ సిరీస్ రాజు, కేంద్రమంత్రి కృష్ణంరాజు కంపెనీ గోపీకృష్ణ గ్రానైట్స్ కొన్ని ఉదాహరణలు మాత్రమే. వీరిలో ముఖ్యమైన వారి పట్టిక, వారివ్వాల్సిన మొండి బకాయిలు రెండురెళ్లు నాలుగు పేజీలో చూడవచ్చు.

గత అనుభవాలను గమనంలో వుంచుకొంటే తాజా చట్టం బ్యాంకులను మొండిబాకీల ఊబిలో నుంచి బయట పడవేస్తుందా అన్నది శేష ప్రశ్నగానే మిగిలిపోతుంది. మొండిబాకీ దార్లకు రక్షణ కల్పిస్తూ రావటం అత్యంత గర్హనీయం. బ్యాంకు ఉద్యోగుల సంఘాలు అప్రమత్తంగా వుండి, వారికి తెలిసిన సమాచారాన్ని ఖాతాదార్లతో, ప్రజలతో పంచుకోవాలి.

మొండిబాకీల ఊబిలోనుంచి బ్యాంకులు బయటపడితే నష్టాలొస్తున్నాయి కాబట్టి ప్రయివేటీకరిస్తామని వాదించడానికి వీలుండదు. ఇదివరకే లక్షమందికి పైగా ఉద్యోగులను వి.ఆర్.ఎస్. ఇచ్చి ఇంటికి పంపడానికి వీలుండదు. బ్యాంకులను ప్రయివేటీకరించాలనే ప్రపంచబ్యాంకు ఆదేశాన్ని అమలు పరచడానికి వీలుండదు. కాగా కొత్తచట్టం కూడా మొండిబాకీల సమస్యను పరిష్కరించకుండా వుండడమే ప్రభుత్వ లక్ష్యం. 9/12/2002 ❑

With Best Compliments From :

CHEMTECH

CHEMTECH ACIDS & CHEMICALS (P) LIMITED

Manufacturers of Sulphuric Acid, Oleum & Sodium Methoxide (Powder & Solution)

CHEMTECH FERTILISERS LIMITED

Manufacturers of Single Super Phosphate (Powder & Granulated)

Office :
Flat No. 119, Sanali Heavens Apartments,
Nagarjuna Nagar, Hyderabad - 500 073.

Phones : 23748372, 23742781 & 55628372
Fax No. 040 - 23748374

Factory :
Kazipally Industrial Area,
Jinnaram Mandal, Medak Dist.

Phone No. (08458) 277270
(Kazipally)

Finest Quality Gas Turbines




with Quickest Delivery Time

Need Heavy Duty Gas Turbines and Generator sets real quick?

Get in touch with Bharat Heavy Electricals Limited

BHEL's expertise and experience in manufacture and supply of Heavy Duty Gas Turbines and Generator sets (model frame 6561B, ISO Rating: 39.60 MW) will ensure quick-time delivery (subject to prior sale)

- *Two GTG sets within two months and additional two GTG sets within four months*
- *Two GTG sets alongwith auxiliaries within four months and additional two sets within six months*



BHEL, under licence from GE, USA manufactures Fr 1, 3, 5, 6B, 6FA and 9E Gas Turbines at its Hyderabad Unit, Andhra Pradesh, India.

BHEL has successfully supplied over 110 Gas Turbines to customers all over India and abroad, such as Malaysia, Oman and Saudi Arabia. BHEL created a record by executing 2 Fr 6B GTG contracts on turnkey basis in Malaysia within six months! BHEL is currently executing contracts in Sri Lanka, Bangladesh and other countries.

Options: *■ Supply of GTG sets only ■ Supply of GTG sets and Auxiliaries ■ Supply of GTG sets with / without auxiliaries and associated Project Engineering and Erection and Commissioning Services ■ Total turnkey execution of GTG Power Plants*

For your requirements, please contact:

General Manager (CM & PED)

Bharat Heavy Electricals Limited
Ramachandrapuram, Hyderabad - 502 032, Andhra Pradesh, India
Tel: 0091-40-3020033 Fax: 0091-40-3021919
Email: pnreddy@bhelhyd.co.in Website: www.bhel.com
Regd.Office: BHEL House, Sirifort, New Delhi-110 049, India.

AKSHARA:BHEL:1832K